
అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాసపత్రిక 309

సంపుటి: 38 సంచిక: 2 డిసెంబరు 2014

పేజీలు: 44 వెల: రు. 15



పుస్తకాల్లోని జ్ఞాపకాలు
సాయుధంగా చిగురిస్తున్నాయక్కడ
కొత్త రూపం పురుడుపోసుకుంది
కాస్త అంబలిపోసి ప్రాణమిద్దామా!

ప్రభుత్వాల పౌరవ్యతిరేక చర్యను ఖండిస్తున్నాం

2014 నవంబర్ 19వ తేదీన విశాఖ ఏజెన్సీలోని వీరవరం గ్రామానికి చెందిన కొంతమంది ఆదివాసులను ఆంధ్రప్రదేశ్ పోలీసులు ప్రేరేపించి విప్లవ రచయితల సంఘం నాయకుడు వరవరరావు ఇంటిముందు హైదరాబాద్‌లో దాడి లాంటి ధర్నాను నిర్వహించడాన్ని వరంగల్ రచయితల ఐక్యవేదిక తీవ్రంగా ఖండిస్తోంది.

ఆదివాసులనైనా, ఏ పౌరులనైనా రక్షించాల్సింది ప్రభుత్వాలే. అలా రక్షించాల్సిన ప్రభుత్వాలే రక్షణ బాధ్యతను విస్మరించి ఆదివాసులను రెచ్చగొట్టి, పావులుగా వాడుకుంటూ పౌరసమాజంలో అశాంతిని సృష్టించడం కోసమే ఈ చర్యకు పాల్పడ్డాయని మేం భావిస్తున్నాం.

ఆంధ్ర పోలీసులు తెలంగాణ ప్రభుత్వ పోలీసుల ప్రమేయం లేకుండా హైదరాబాద్‌లో ఇలాంటి వ్యతిరేక చర్యకు పాల్పడే అవకాశం ఎంత మాత్రం లేదు. మాటెత్తితే ఆంధ్ర పాలక ప్రభుత్వాలను విమర్శించే తెలంగాణ ప్రభుత్వం తన రాష్ట్రంలోని బాధ్యతాయుత పౌరుడైన వరవరరావుతో పాటు పరిసర పౌరుల స్వేచ్ఛకు భంగం కల్గించే అప్రజాస్వామిక చర్యకు ఎందుకు పాల్పడినట్టు? తెలంగాణ శాంతి భద్రతల వ్యవస్థపై ఇంకా ఆంధ్రప్రదేశ్ పాలక ప్రభుత్వానికి, పోలీసులకు అజమాయిషీ ఉందనుకోవాలా? అదే నిజమైతే తెలంగాణ ప్రభుత్వానికి ఇంతకంటే అవమానకరమైన విషయం మరొకటి ఉండదు.

తెలంగాణ ఉద్యమం ఆశించిన వాటిలో స్వతంత్ర రాజకీయ నిర్ణయాధికారం, స్వాభిమానం చాలా ముఖ్యమైనవి. తెలంగాణ ప్రభుత్వానికి నిజంగా తెలంగాణ స్వాభిమానం ఉంటే అచ్చమైన తెలంగాణవాది వరవరరావు రాజకీయ విశ్వాసాలతో నిమిత్తం లేకుండా ఆయనపై జరిగిన దాడిలాంటి ధర్నా ఘటనపై తక్షణమే స్పందినిచి తన వైఖరిని బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాం.

ప్రజలు ఆంధ్రాపాలక ప్రభుత్వాలకు, రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా టిఆర్ఎస్ పార్టీని భావించినట్లే, ఇతర ప్రత్యామ్నాయ రాజకీయాలను కూడా కోరుకొని ఉద్యమించే హక్కు ప్రజలకుంది. కనుక ప్రజా పోరాటాలను, ఉద్యమాలను కక్షపూరితంగా చూస్తూ చట్టవ్యతిరేక, అణచివేత పద్ధతుల ద్వారా ఎదుర్కోవాలనుకోవడం రాజకీయ అవివేకం అవుతుంది. ఆంధ్రాపాలక ప్రభుత్వాల వలే కాకుండా తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమం ఆశించిన విధంగా చట్టబద్ధంగా వ్యవహరించి తన రాజకీయ పరిణతితో కూడిన ప్రజాస్వామిక పాలనను అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుచున్నాం.

– వీరబ్రహ్మాచారి, కన్వీనర్ – విరసం వరంగల్ యూనిట్; లోచన్; బాసిత్, విరసం కార్యవర్గ సభ్యులు;
మెట్టు రవీందర్, కన్వీనర్ రచయితల ఐక్యవేదిక; కాత్యాయనీ విద్మహే, ప్రజాస్వామిక రచయితల వేదిక;
బిల్ల మహేందర్, కార్యదర్శి – తెలంగాణ రచయితల సంఘం; నాగిళ్ళ రామశాస్త్రి, కాళోజీ ఫౌండేషన్;
డా. వి.వీరాచారి, అరసం (తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు); విజయ్‌కుమార్, శ్రీలేఖ సాహితీ;
వడ్డెబోయిన శ్రీనివాస్, గోదావరి సాహితీ మిత్రులు



3

309

అరుణతార
సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

సంపుటి : 38 ✻ సంచిక : 2 ✻ డిసెంబర్, 2014

సంపాదకుడు
చలసాని ప్రసాద్
వర్కింగ్ ఎడిటర్
డి.వి. రామక్రిష్ణారావు
ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,
కార్బైడ్ కంపెనీ ఎదురుగా,
మౌలాలి, హైదరాబాద్ - 500 040.
* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా
రచనలు పై చిరునామాకూ,
ఇ-మెయిల్ ద్వారా
arunatara1977@gmail.com కూ
పంపవచ్చు
సంపాదకవర్గం :
ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్
చందాలు పంపాల్సిన చిరునామ
మేనేజర్
ఎస్. రవికుమార్
5-1307, దొరసానిపల్లె రోడ్,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.
సెల్ : 9866021257
విరసం కార్యదర్శి చిరునామా
పి. వరలక్ష్మి
5-1820, గీతాశ్రమం వీథి,
ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360.
డి.టి.పి. అండ్ లే అవుట్
ఆర్. భాగ్యలక్ష్మి
1, 4 కవర్ డిజైన్
పి. వరలక్ష్మి, క్రాంతి
2, 3 కవర్ డిజైన్
ఆర్. భాగ్యలక్ష్మి
2 కవర్ ఫొటోలు
విరసం వరంగల్ యూనిట్
http://www.facebook.com/arunatara.virasam
Virasam website : *www.virasam.in*
ఈ సంచిక వెల : రు. 20/-

సంపాదక లేఖ...

రెండు తెలుగు రాష్ట్రాల్లో పాలకుల వాగ్దానాల వెల్లువ సాగుతున్నది. నవ తెలంగాణ, నవ్యాంధ్ర నిర్మాతలుగా తమను తాము నిలబెట్టుకోడానికి ఉరుకులు పరుగుల మీద ఊహా స్వర్గాలను నిర్మించే పనిలో ఉన్నారు. చంద్రబాబు నాయుడికి అదనంగా రాజధాని నిర్మాణ కర్తవ్యం కూడా ఉన్నందున ఎక్కే విమానమూ దిగే విమానంగా ఆయన నిజ జీవితం సాగుతున్నది. ఆంధ్రప్రదేశ్ రాజధానికి ప్రపంచంలో ఎక్కడ నమూనా దొరుకుతుందో వెతకడమే ఏకైక కార్యక్రమమైపోయింది.

అభివృద్ధి పేరుతో సాగుతున్న ఈ వంచనా శిల్పం మేలి ముసుగులను రెండు రాష్ట్రాల్లోనూ అత్యంత విషాదాత్మకంగా రైతుల ఆత్మహత్యలు తొలగిస్తున్నాయి. రాష్ట్రాలు వేరు గావచ్చు. పాలకుల చిరునామాలు మారవచ్చు. కానీ ఎన్నటికీ తీరని సామూహిక విషాదం మాత్రం రైతుల ఆత్మహత్యలే. 'బంగారు తెలంగాణ'లో ఎన్ని ఉరితాళ్లు వేలాడుతున్నాయో, ఎన్ని వందల పురుగు మందుల డబ్బాలు ఖాళీ అవుతున్నాయో లెక్కపెట్టుకోవడం కంటే నవ తెలంగాణకు పరమార్థమేమున్నది? కేసీఆర్‌కు మాత్రం ఏ దిగులూ లేదు. ఈ పాపమంతా 'తరతరాల కోస్తాంధ్ర వలసపాలకుల దుర్మార్గాల కొనసాగింపే' అని పాత పాఠమే అప్పజెప్పగలడు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డం కంటే ఏంగావాలన్న మేధావులను, టీఆర్ఎస్ ఎన్నికల ఎండమావుల్లో దాహం తీర్చుకోవచ్చని భరోసా ప్రకటించిన రచయితలను, ఇంకో అడుగు ముందుకెళ్లి టీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చిన పెద్ద మనుషులను, అలుపూ సొలుపూ లేని రోజువారి ప్రభుత్వ వాగ్దానాలను చూసి ముచ్చటపడుతున్న బుద్ధిజీవులను ఉరితాళ్లపై అంతరిస్తున్న రైతుల ప్రాణస్పందనలు వినిపిస్తున్నాయా? అని బరితెగించి అడగాల్సిందే. నవ తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగంలో కోఆప్ట్ అయిపోయిన, కావడానికి నానా విన్యాసాలు చేస్తున్న బుద్ధిమంతులందరినీ వినయంగా కూడా నిలదీయాల్సిందే.

ఇందుకు వాళ్లకు కోపం రావచ్చు.మేధావులు కదా? దీనిపై ఎన్నెన్ని విశ్లేషణలు ఇస్తారో విందాం. తప్పేదేముంది? విప్లవాధికారం వచ్చిన చోట ఏండ్ల తరబడి సాగిన సంక్షోభాన్ని కూడా తప్పక గుర్తు చేయగలరు. అది దీనికి సమర్థన కాదని మాత్రమే మనవి చేద్దాం.

ఇంతకూ.. ఎవరినో నిలదీయడం వల్ల తీరే విధ్వంసం కాదిది. రెండు రాష్ట్రాలు కావాలనుకున్నప్పుడు ఇలాంటి విషాదాలు ఉండవని భ్రమపడిందీ లేదు. రైతు స్వయంహననానికి అక్కడ పరిష్కారముంటుందనుకున్నదీ లేదు. ఎట్టకేలకు తెలంగాణ బూర్జువా వర్గం తన ప్రాంతమ్మీద పెత్తనాన్ని, తానే దోచుకొనే అవకాశాన్ని పొందిన ఈ తరుణాన ఇంత కంటే అనుకునేదేముంది? 'ఇట్లని ఎవరనుకున్నా'రని విశాలాంధ్ర గురించి కాళోజీ అనుకున్నడేమోగాని, తెలంగాణ రాష్ట్రంలో ఇట్లాగే అవుతుందనే ఎరుక విప్లవశక్తులకు ఉన్నది. అయినా తెలంగాణ ఎందుకు కావాలన్నది ఇప్పుడు మళ్లీ చెప్పుకోనవసరం లేదు. పైగా రుతువు పూర్తిగా మారిపోయింది.

ఎన్నటికీ మారని రుతు విషాదం రైతు ఆత్మహత్య.

వ్యవసాయమంటే అప్పు. తెలంగాణలో వడ్డీ అంటే మిత్తి. దాని సరైన అర్థం మృత్యువు. సాగు చేసి అప్పులపాలు కావడం మాత్రమే రైతు చేయగల పని. కౌలు రైతులది మరింత దుర్భరం. లెక్కల్లో చేరని అప్పులు. ఓటర్లుగా తప్ప రైతు గుర్తింపు లేని మనుషులు.

ఇంతకూ ఈ అప్పుల బాధ ఏంది? దీని స్వభావం ఏంది? అసమ భూ సంబంధాల వల్ల భూమి లేని వాళ్ల సమస్య ఒకటైతే.. భూమి ఉన్న పేద, మధ్యతరగతి రైతుల బతుకేమిటి? చావేమిటి? రైతుల శ్రమ దోపిడీ అవుతున్న తీరేమిటి? దాని మర్మమేమిటి?

రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాదు, సుమారుగా యావద్దేశమంతా రైతుల ఉసురు తీస్తున్న శక్తులేమిటి? మళ్లీ ఆలోచిద్దాం. మళ్లీ మళ్లీ ఆలోచిద్దాం. తాము మట్టితిని మనకు అన్నం పెట్టినందుకు రైతుల తరపున అంతర్మథనకు పూనుకుందాం. భవిష్యత్తులోనైనా రూపొందాల్సిన బలమైన రైతాంగ ఉద్యమాలకు కొన్ని ఆలోచనాయుధాలు సిద్ధం చేద్దాం. లేకపోతే రుణమాఫీల గారడీ సాగుతూనే ఉంటుంది. రుణ స్వభావం మరింత బాగా తెలుసుకుంటేనే.. రుణమాఫీ గురించి కాక.. రైతు రుణగ్రస్థుడు కావడానికి వ్యవస్థాంతర్గత కారణాలు వెలికి తీయగలం.

సంచిక - 309

విరసం సాహిత్యాన్ని కరపత్రాలను, స్టేట్‌మెంట్లను, అరుణతార పత్రికను **www.virasam.in** వెబ్‌సైట్‌లో చూడవచ్చు. అలాగే వివిధ సాహిత్య పత్రికల బ్లాగులు, సైట్‌ల లింకులను కూడా చూడవచ్చు.

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.
విడి సంచిక వెల - రు. 15; సంవత్సర చందా - రు. 180;
రెండు సంవత్సరాల చందా - రు. 350; మూడు సంవత్సరాల చందా - రు. 500;
ఐదు సంవత్సరాల చందా - రు. 800; దశాబ్ది చందా - రు. 1600/-

మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!
పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి.డి.ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు),
మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం.ఎస్. భాషాలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు
ఈ-మెయిల్ : **arunatara1977@gmail.com**
http://www.facebook.com/arunatara.virasam

రచన సరే, మన హృదయం ఉండాల్సిన చోటే ఉందా?

- పి.వరలక్ష్మి

అక్షరానికి ఉన్న శక్తి అపారం. అధికారిక శాసనాన్ని స్థిరపరిచినా, 'అనధికార శాసనకర్త'గా వ్యవహరించినా సాహిత్యం పోషించిన పాత్ర పద్మునైనది. 'సాధారణ మాటలకు ఇంత అసాధారణ సౌందర్యం, అలౌకిక ఆకర్షణ ఎలా వచ్చాయి.. అని పంక్తుల మధ్యలోకి ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయేవాడి'నని తన తొలి పఠనానుభవాన్ని గురించి గోర్కీ రాసుకున్నాడు. అందుకేనేమో సాహిత్యం వెంట గుర్తింపు, కీర్తి వస్తాయి. సమాజంలో సాహిత్యకారులకు ఎంతో కొంత గౌరవం లభిస్తుంది. కళాసాహిత్య పోషకులైన రాజులను చరిత్ర కూడా తగు రీతిలో గుర్తుపెట్టుకుంది. కళాసాహిత్యాల అసలైన సృష్టికర్తలు మాత్రం చరిత్ర ఎరుకలో ఉండరు. అదలా ఉంచితే ప్రపంచీకరణ యుగంలో కార్పొరేట్ సాహిత్య పోషకులు రంగం మీదికొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా సాహిత్యోత్సవాలను స్పాన్సర్ చేస్తూ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సాహిత్యసేవ చేస్తున్నారు. మన దేశంలోనూ జైపూర్ సాహిత్యోత్సవం మొదలుకొని ఈ ఏడాది మొదట్లో జరిగిన హైదరాబాద్ లిటరరీ ఫెస్ట్ దాకా కార్పొరేట్ సంస్థలు నిర్వహించిన అతి భారీ సాహిత్యోత్సవాలతో పాటు అడపాదడపా తెలుగు పండుగలు జరిగాయి. రియలెస్టేట్ వ్యాపారులు, ప్రజలను పీల్చుకు తిని కోట్లకు పడగలెత్తిన బ్యూరోక్రాట్లు, బహుళజాతి ప్రాయోజిత ఎన్.జి.ఓ.లు సాహిత్య సేవలో తరిస్తున్నాయి.

'సాహిత్యం దేని కోసం? దాని పరమార్థమేమిటి?' వంటి ప్రశ్నలు బహుశా మన సమాజంలో ఇప్పుడు కొత్తగా వేసుకోనక్కర్లేదు. రాజాస్థానాల నుండి, అధికార పీఠాల నుండి స్వేచ్ఛ పొందిన సాహిత్యం, మందిలో కలిసిన సాహిత్యం, మందిలో పుట్టిన సాహిత్యం, తలెత్తుకు నిలబడి ధిక్కార పతాకను ఎగరేసిన సాహిత్యం సమాజానికి ఒక భరోసానిచ్చింది. తెలుగు సాహిత్యకారులు ఆ వారసత్వాన్ని సగర్వంగా స్వీకరించారు. అక్షరం ఆధిపత్యానిది కాదు, అశేష ప్రజాసమూహాలకు ప్రాతినిధ్యం వహించేదనే దశకు చేరుకోవడంలో ఎంత సంఘర్షణ ఉందో నేటికీ నడుస్తున్న చరిత్రే. సాహిత్యాన్ని సాహిత్యంగానే చూడాలంటే, రాజకీయం కాని వ్యక్తీకరణ ఏదీ ఉండదని కుండబద్దలు కొట్టి చెప్పాయి మన సాహిత్యోద్యమాలు. ఎన్ని వాదాలున్నా తెలుగు సాహిత్యం పీడిత సమూహాల పక్షాన నిలిచింది. దేశంలోనే కాదు, ప్రపంచంలోని సకల దుర్మార్గాలను ప్రశ్నించింది. సామ్రాజ్యవాద మార్కెట్ చేతిలో పరాయీకరణకు గురవుతున్న మనిషిని గురించి దు:ఖించింది. తెలంగాణ నుండి పాలస్తీనా దాకా ఆధిపత్యాన్ని, హింసను, అణచివేతను ప్రశ్నించింది. అట్టడుగుకు నెట్టివేయబడ్డ సమాజాల సాంస్కృతిక వ్యక్తీకరణకు అక్షరరూపమిచ్చింది.

సాహిత్యకారులు అంతకన్నా ఇంకా ముందుకే నడిచారు. ఎన్నో సార్లు నేరుగా ఉద్యమ గొంతుక వినిపించారు. విద్యార్థి, మేధోరంగాన్ని ప్రభావితం చేశారు. ప్రగతిశీల భావాలకు వాహికలయ్యారు. ప్రగతిశీల రచయితలు అని వేరుగా కాక రచయితంటేనే ప్రగతిశీలవాది అనే భావన తెలుగు సాహితీలోకంలో స్థిరపడింది. భాషా సాహిత్యాలను పాలకవర్గం చేతుల నుండి తప్పించి ప్రజా ఉద్యమాలు తమ సొంతం చేసుకున్నాయి. ఎన్నో వేదికలు, భిన్న ప్రాపంచిక దృక్పథాలు, భావ సంఘర్షణలు మామూలే. ఎన్నివైపుల నుండి వ్యవస్థతో, రాజ్యంతో ఘర్షణ పడితే సామాజిక పురోగతికి అంత ప్రయోజనం. పురోగామి శక్తులను, భావజాలాలను అయితే అణచివేయడం, లేదా మేనేజ్ చేయడం పాలకవర్గాలు నిరంతరం చేసే పని. మొదటిది సూటిగా ఉంటుంది. రెండోది అనేక ముసుగులు వేసుకొని ఉంటుంది. కారణాలేవైనా దాదాపు సాహిత్య లోకం మొత్తం బహిష్కరించిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భం మొత్తంగా రచయితల అసమ్మతిని నమోదు చేసుకుంది. రకరకాల సాహిత్యమేళాలు కాస్త అటో ఇటో మొదలయ్యాయి. పాలకవర్గాల సాహిత్యసభలు, కార్పొరేట్ సాహిత్యోత్సవాల ఆర్భాటాలు ఇటీవల మరీ ఎక్కువయ్యాయి. ఇవి అన్ని రకాల సాహిత్యకారులకు ఆకర్షణీయంగా కనపడుతున్నాయి. ఆ ఆకర్షణ వెనక ఉన్న రాజకీయాలు ఒక్కోసారి బహిరంగంగా కనపడుతున్నా కొందరు రచయితలు సంకోచించకుండా సాహిత్య మేళాల్లో కలిసిపోతున్నారు. 'ఇజాలకు అతీతంగా సాహిత్యాన్ని సాహిత్యంగా ఆస్వాదిద్దాం' అనే సమ్మేళనాలు టీవీ ఛానళ్ళు, సినిమాలతో విసిగిపోయిన అనేక స్రవంతుల్ని మరో వైపు కలుపుతున్నాయి. ఇందులో సాహిత్యాభిలాష తప్ప ఏ ఉద్దేశాలు ఉండకపోవచ్చు. అయితే ఈ మూడ్‌ని కూడా కార్పొరేట్ శక్తులు వాడుకుంటున్నాయి.

పెట్టుబడి కట్టుకథల గుట్టు విప్పే రచయితలవైపు ఇప్పుడు పెట్టుబడి చూస్తోంది. నిజానికి సర్వం విధ్వంసం చేసే కార్పొరేట్ పెట్టుబడికి కళాత్మక అభిరుచికి పొంతన లేదు. ఆదివాసుల్ని ఊచకోత కోసిన సల్వాజుడుం హంతకముఠాకు స్పాన్సర్ చేసిన మైనింగ్ కంపెనీలు, వేరొక చోట సాహిత్యోత్సవాలకు స్పాన్సర్ చేస్తాయి. న్యూస్‌పేపర్ల నుండి టీవీ వార్తల వరకు బడా కంపెనీల వ్యాపార దన్నుతో ప్రసారమయ్యే వార్తలే ప్రపంచ జ్ఞానమైపోయి, సోషల్ మీడియాతో సహా కార్పొరేట్ కనసన్నల నుండే వాస్తవాల్ని వీక్షిస్తున్న స్థితి. ఈ స్థితిలో నిజానికి సాహిత్యమే ఒక ఆలంబన. అన్నిటినీ ఇమడ్చుకోగలిగిన పెట్టుబడి సాహిత్యాన్నీ తన పరిధిలోనికి తీసుకుపోతుందా? భారీ ప్రచురణ సంస్థలు నిర్వహించిన హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్, టాటాలు స్పాన్సర్ చేసిన జైపూర్ సాహిత్యోత్సవం, తెహెల్కాతో కలిసి ఎస్సార్ సంస్థ నిర్వహించిన 'థింక్' ఫెస్ట్ వంటివి ఏడాది పొడవునా ప్రపంచం నలుమూలలా హోరెత్తిస్తున్నాయి. వీరిని కాదని చిన్న ప్రచురణ సంస్థలు, సాహిత్య బృందాలు తమ అస్తిత్వాన్ని

నిలబెట్టుకోవాల్సిన పరిస్థితి వస్తుందా? కానప్పుడు స్వేచ్ఛగా, నిజాయితీగా రచనలు చేయడం సాధ్యమవుతుందా?

ఇంకోవైపు సృజనాత్మక రచయితల్ని ఆదరించి తమ సాహిత్యాభిరుచిని చాటుకోవడం ఒక సామాజిక హోదాగా వ్యాపారస్తులు, బూర్జువా రాజకీయ శక్తులు కూడా భావిస్తున్నాయి. కళా సాహిత్య దిగ్గజాల పేర్లు పెట్టి బహుమతులు, పురస్కారాలు ఇవ్వడంలో ఆసక్తి పెరుగుతున్నట్లు కూడా ఉంది. ఈ మొత్తం పరిణామాల్లో ప్రజాపక్షం దృఢంగా నిలిచే సాహిత్యకారులను వ్యవస్థలోకి సంలీనం చేసుకోవడం జరుగుతోంది. పాలకవర్గాలు, కార్పొరేట్ శక్తులు బుద్ధిజీవుల్ని కోఆప్ట్ చేసుకునే పని నిశ్శబ్దంగా జరిగిపోతోంది. పూర్తిగా తమ పక్షం కాకపోయినా మేధావుల్ని క్రియాశీల ప్రతిపక్షంలో లేకుండా చేయడం కూడా ఒక వ్యూహం. ఈ నేపథ్యంలో ఒకప్పుడు ఎంతో ప్రగతిశీల పాత్ర పోషించిన తెలుగు సాహిత్యకారులు తమకు తెలీకుండానే, లేక తెలిసే ఈ భ్రమల్లోకి జారిపోతున్నారా అన్నదే ఇప్పుడు ప్రశ్న.

కొత్త ప్రభుత్వాలు ఏర్పడినప్పుడు కొద్ది కాలం ఉండే భ్రమాజనిత వాతావరణంలో ఈ ధోరణి ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. దేశ స్వాతంత్ర్యం పేరుతో అధికార మార్పిడి జరిగి పరాయి పాలకులు పోయి మన పాలకులు వచ్చినప్పటి వలె తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తెలంగాణ వాళ్ళు ప్రభుత్వాధినేతలు అయినప్పుడు కొందరైనా భ్రమలకు గురి కావడం సహజం. అయితే వ్యవస్థలో సంక్షోభం ముదిరిపోతున్నప్పుడు అట్లా భ్రమలకు లోనైన వాళ్ళు ఏమంటారు? తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు, కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలు, రైతుల ఆత్మహత్యలు, యూనివర్సిటీలు, నగరాలు, పల్లెలు ఎక్కడ చూసినా మితిమీరిన పోలీసింగ్, ప్రజాస్వామిక హక్కుల హననం పట్ల వాళ్లేమంటారు?

మరోవైపు ఇటీవలి కొన్ని సాహిత్య వేడుకలను చూస్తున్నప్పుడు ఆశ్చర్యం, ఆందోళనా కలుగుతున్నాయి. పుస్తకాల్లోని అక్షరాలకు, వాటిని ఆవిష్కరించే వేదికలకు పొంతన కుదరదు. ఒక్కోసారి వేదిక మీద మాట్లాడే మాటలను, వెనక వేలాడే బ్యానర్ మీది అక్షరాలు గేలి చేస్తుంటాయి. ప్రజాపక్షం వహించే రచనలను ఏదో సందర్భం కోసం కూర్చి అందులోని విలువలకు పూర్తి విరుద్ధమైన వారికి అంకితం ఇస్తారు. ఒక పుస్తకంలో రైతు గురించో, ఆదివాసీ గురించో, దళితుల గురించో సున్నితమైన, సౌందర్యాత్మకమైన వ్యక్తీకరణలు ఉంటాయి. ఆ సమూహాలను క్రూరంగా హింసించిన అధికారి దానికి పురస్కార ప్రదానం చేస్తాడు. (విచిత్రంగా జీవించి ఉన్న వారి పేరు మీద పురస్కారాలు ఏర్పాటు చేయడం కూడా ఒక ధోరణి అయిపోయింది.) నిన్నటికి నిన్న 'ప్రాతినిధ్య' కథల పేరుతో వెలువరించిన సంకలనం, దాని ఆవిష్కరణ సభ ఒక తాజా ఉదాహరణ. నిజానికి ఈ సంకలనాన్ని కూర్చిన రచయిత మంచి సాహిత్యాన్ని సృజించిన వ్యక్తి. ఆమె ఏ విలువలు, ఆదర్శాలు లేని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ వంటి ఫక్తు ఫ్యూడల్ శక్తులు, అక్రమ వ్యాపారస్తుల పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తూ ఎన్నికల్లో దిగడం ఒక విషాదం. మాజీ ఉద్యమకారుల వలెనే ఇటువంటి ధోరణి ఒకటి రచయితల్లో మొదలుకావడం శోచనీయం. దానికి మించిన విషాదం ఆ పుస్తకావిష్కరణ సభలో ఒక పోలీసు అధికారి పురస్కారాలు ప్రదానం చేయడం. ఆయన విధి నిర్వహణలో భాగంగా విధిలేక కాదు, కక్షపూరితంగా, చట్టవ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలను అణిచేసి దోపిడి వ్యవస్థకు ఎంత దన్నుగా నిలిచిన వ్యక్తో అందరికీ తెలుసు. ఈ సభకు ఆహ్వానితులుగా ఉన్న కొందరు రచయితలు గైర్హాజరవడం మాత్రం కొంత ఊరటనిచ్చే అంశం. ఈ గైర్హాజరీ యథాలాపంగా కాక రాజకీయ అసమ్మతితో జరిగిందని కూడా నమ్మవచ్చు. అటువంటప్పుడు ఆ రచయితలు తమ మనసులో ఏ వైఖరి ఉందో బహిరంగపరిస్తే సాహిత్యలోకానికి మరింత ప్రయోజనకరం. ఇటువంటి సాహిత్య ధోరణుల మీద అసమ్మతి తెలపడం సాహితీలోకానికి, సమాజానికి కూడా అవసరం.

ఇదంతా ఎందుకంటే సమాజపు అట్టగుడు పొరల్లో అణచివేయబడ్డ దేశ వెన్నెముకల గురించి రాసిన రచయితలు, మార్కెట్ వ్యామోహాల్లో మొద్దుబారుతున్న మానవ స్పందనలను తడిమే భావావేశం ఉన్న రచయితలు వ్యక్తులుగా ఎక్కడ నిలబడాలో కూడా సమాజం ఆశించొచ్చు అనుకోవడం వల్లనే. నిజానికి ఏ రచనైనా ప్రజల అద్భుత సృజనాత్మకతకు సాహిత్య రూపమివ్వడం కాదా? లేకపోతే ఈ భాష ఎవరిది? ఈ వ్యక్తీకరణలు ఎవరివి? పాత్రలు, వ్యక్తిత్వాలు, ఇతివృత్తాలు ఎక్కడివి? ఎవరి నుండి తీసుకుని ఎవరికి ఇస్తున్నాము? రచయిత గుర్తింపు, గౌరవం వెనక ఉన్నది అతని/ ఆమె కృషి, నైపుణ్యం మాత్రమేనా? ప్రాతినిధ్య రచనలు, రచయితలు ఏ సమూహాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు? రాసిన అక్షరాలు సరే. హృదయం ఉండాల్సిన చోటే ఉందా? రాజకీయాలేవైనా ప్రజాపక్షం వహించే రచయితలుగా మనం ఈ ప్రశ్నలు వేసుకోవాలి. ఏ దుర్మార్గపు వ్యవస్థను నిరసిస్తున్నామో దానికి కొమ్ముకాసే అధికారులు, ఆదివాసీ, దళిత, మైనార్టీలను హింసాత్మకంగా అణచివేసే పార్టీల వాళ్ళు నిర్వహించే సభల్లో పాల్గొన్నప్పుడు హృదయం ఎట్లా స్పందిస్తుందో ఏ కవైనా రాయాల్సిందే. అన్ని మానవ స్పందనలను మొద్దుబార్చే కార్పొరేట్ పెట్టుబడి సృజనాత్మక సాహిత్యానికి కళ్ళు జిగేల్ మనిపించే వేదిక నిర్మించినప్పుడు దాని మీద నిలుచున్న కవి హృదయం ఎట్లా మొద్దుబారుతుందో ఏ కవితైనా చెప్పాల్సిందే.

అదిగదిగో అదిగో చూడు ఇజ్రాయిల్ ఇనుప డేగ

- ఉప్పెన

అదిగదుగో అదిగో చూడు ఇజ్రాయిల్ ఇనుపడేగర
గాజా పైన అధర్మ దాడిని చేస్తుందిరా... ధ్వంసము చేస్తుందిరా...
॥అదిగో॥

అధర్మ యుద్ధాలు చేసి దేశాలను కూల్చినోడు
అన్యాయపు తీర్పులిచ్చి ఉరితాళ్ళు పేనినోడు
క్రూడాయిల్ కోసమే హత్యలెన్నో చేసినోడు
అమెరికోని అండతోని ఇజ్రాయిల్ ఇనుపడేగర
గాజాపైన బలగాలతో దాడి చేస్తుందిరా... ॥అదిగో॥

పాలు నీళ్ళు రాకుండ కట్టడి చేసిందిరా
ఆహారం చేరకుండ అడ్డుకుంటు ఉందిరా
దారులన్ని బంధించి ఆంక్షలు పెడుతుందిరా
గాజాను లొంగదీయ ఎత్తులు వేస్తుందిరా
ఆ ఎత్తులను చిత్తు చేస్తు సాగుతుంది గాజారా ॥అదిగో॥

పౌరుల స్వేచ్ఛ అంటు ప్రాణాలు తీస్తు ఉందిరా
వందల మందిని చంపి గుట్టలు పోస్తుందిరా
బాంబులతో దాడి చేస్తు ధ్వంసము చేస్తుందిరా
మొసలి కన్నీళ్ళను కారుస్తు ఉంది చూడరా
క్రూడాయిల్ కోసము ఈ కుట్ర సాగుతోందిరా ॥అదిగో॥

చమురు బొరులపైన తిరుగుబాటు చేసినా
సద్దామ్ స్ఫూర్తి తోటి కదిలినాది ముందుకు
గడాఫీ ఏ గుండె ధైర్యం దండులాగే నింపెరా
జాతిని మేలు కొలిపి దేశ భక్తిని రగిలించిరా
సామ్రాజ్యవాదానికి ఎదురు తిరిగినాదిరా ॥అదిగో॥

అంతర్జాతీయ న్యాయస్థానం అంతర్జాతీయ నేరగాడు
ఇజ్రాయిల్‌కు అండగున్నారు ఇంక నాకు ఎదురులేదని
విర్ర వీగుతుందిరా ఈ దాడి చేస్తు ఉందిరా
పిల్లల రక్షించుకోను తల్లికోడై గాజారా
ఇనుప కాళ్ల డేగను ఎగిరి తంతు ఉందిరా ॥అదిగో॥

అతడు ఆత్మహత్య చేయబడుతున్నాడు

- వద్దెబోయిన శ్రీనివాస్

చావుదేముంది
అందరూ చస్తారు
అతడు మాత్రం
నాకు మెతుకివ్వలేనందుకే
మరణింపబడుతున్నాడు
కాదు
అతడు ఆత్మహత్య చేయబడుతున్నాడు

పయనం మొదలైనప్పుడు
వొక కాలం
తన ఉండే వన్నీ

వేర్లు పెకిల్తే
తుపానుకెదురు నిల్చినప్పుడు
గింజ తనది కాదు
ఎరువు తనది కాదు
భూమి తనది కాదు
చినుకు తనది కాదు
బతుకు తనది కాదు
మెతుకు తనది కాదు
కాలం అతడి గుప్పిట్లోంచి జారిపోయింది

పగుళ్ళ చర్మం మీద
విత్తనం మరణయాతన పడుతున్నప్పుడు
ఒక్కడే
గింజనోదారుస్తూ-
నా మెతుకు కోసం
పురిటి నొప్పులతో పట్టిన మొలక
శ్రమ సారె మీంచి జారిపోతున్నా-

ఆకాశం మొత్తం
కుప్పకూలేంత మబ్బు దృశ్యమైనా
రెప్పపడని కళ్ళని
వొక్క చినుకూ పలకరించదు

నా మెతుకును కలవరిస్తూ కలవరిస్తూ
నా ప్రాణ ప్రియుడు పగిలి
వొక జిలుకర మందార పువ్వులా వేలాడుతుంటాడు

మొత్తం ముంచినాక
రుణమాఫీ చేశాం
రుణమాఫీ చేస్తున్నాం
రైతే రాజు
రైతే దేశానికి వెన్నెముక
జై కిసాన్
చావు డప్పుల్లా మోగుతుంటాయ్

అయినా ఒకడు మళ్ళీ మళ్ళీ
యుద్ధం గెలుస్తానని-
పంటపొలాన్ని మెళ్ళో వేసుకొని

నా మెతుకు నిర్మించడానికి వస్తుంటాడు
నా బతుకు నిర్మించడానికి వస్తుంటాడు

పాము రాకుండా
మా ఇంటెనుక మా అమ్మ
తెల్లుసిరి నాటినట్టు
చావు రాకుండా
నాటటానికో చెట్టుంటే బాగుండేది
చేన్లు పొలాలు చెలకల చుట్టూ
అతడి కోసం నాటొచ్చేవాణ్ణి!

బెదురులేని అక్షరం

-ఉదయమిత్ర

నిరసన గొంతెత్తుకొని
వింత మృగం వొచ్చింది
పాలకుల కనుసైగల
పాతపాటే పాడింది

నకిలీలను వెంటేసుకు
కలకలమే రేపింది
సముద్రముప్పొంగుతుంటే
అలల దిట్టిపోసింది

బెదురులేని అక్షరం
కుదురుగనే నిల్చింది
ధిక్కారమే తొలిపొద్దయి
నలుదెసలా వ్యాపించింది

(వివి ఇంటి ముందు జరిగిన లొల్లికి స్పందించి)

నా అంతర్ గానం

-సాదుం శ్రీకాంత్

నా ఆవేశమంతా
ఆకలి వేదనే
నా ఆవేదనంతా
అమ్మ రోదనే
నా ధిక్కారమంతా
దీనుల స్వరమే
నా అధిక్షేపణంతా
అన్నార్తి పక్షమే
నా పదమంతా
అధికారంపై రణ పథమే
నా కన్నీరంతా
రక్త ప్రతిరూపమే
నా స్వేదమంతా
రైతు సిద్ధాంతమే
నా తపనంతా
పతనంపై పంతం
నా అక్షరమంతా
వివక్షపై ఎత్తిన సుత్తి
నా ఆక్షేపణంతా
విధ్వంసంపై దూసిన కత్తి
నా ఆకాశమంతా
అమరుల నగరమే
నా ఈ ఘోషంతా
ఓ సామాజిక సంఘర్షణ
నా ఈ కదలిక
నిన్న, నేడు, రేపుల కలయిక
నాది త్యాగం కాదు సుమా!
ఇది సలిపే ఓ లోపలి గాయం
ఇది పోరాటమా, ఏమో?
ఇది నా అంతర్ గానం

పశ్చిమ కనుమలెరుపు

- జయ

అందమైన వనంలో ఆట పాటలతో
చల్లగాలుల జలపాతాల ఒరవడిలో
పరుగులు తీస్తున్నది ప్రజాసైన్యం
ఏ తల్లి కడుపు పంటలో వర్గపోరు నేస్తాలతో
ఉరకలు వేస్తున్నది

భాషలు వేరైనా లక్ష్యం ఒకటే
త్యాగం ఒక్కటై పార్టీలు కలిసేను
అణచబడ్డ ఆదివాసీలను చైతన్యం చెయ్య
సాగేను ఆదివాసీ సైన్యం
మహత్తర ఐక్యతను ఎత్తిపడుతూ
పీడిత ప్రజల విముక్తికై కదిలేను గెరిల్లా సైన్యం

ఆధునిక ఆయుధాలు ఎదురు నిల్చినా
కష్టాలను కన్నీళ్ళను లెక్క చెయ్యక
చిరునవ్వును ధరించి
సమరానికి సై అంటూ సాగేను ప్రజాసైన్యం
సకల దేశ శ్రామికులను ఒక్కటి చెయ్య
భూమి భుక్తి విముక్తికై
పల్లె పల్లె ప్రజాకమిటీలు పెడుతు
సాగేను గెరిల్లా సైన్యం

వెస్టర్న్ ఘాట్స్‌ను విముక్తి ప్రాంతం చేయ
సంయుక్త చర్చల లక్ష్యసాధనకై పోరుదాం
సరిహద్దులు లేకుండా భుజం భుజం కలిపి
సాగేను ప్రజాసైన్యం
ఆయుధ బలంతో విర్రవీగుతూ
పదిరోజుల్లో పారదోలుతానన్నాడు వాడు
సంయుక్త శక్తితో బదులు చెబుతోంది ఎర్రసైన్యం
గ్రామగ్రామాన అమరుల స్తూపాలను నిర్మిస్తాం
వీధి వీధుల్లో ఎర్రజెండాలు ఎగురవేస్తాం

(సిపిఐ (మావోయిస్టు), సిపిఐ (ఎంఎల్) (నక్సల్బరీ) పార్టీల విలీనం సందర్భంగా వెస్టర్న్ ఘాట్స్ నుండి...)

నేను నిలబడే నిద్రలోకి జారుకున్నా

-సూ లీఛీ

నాకళ్ల ముందు కాగితం పసుపురంగుకి మారుతోంది
నేను రాస్తున్న పెన్ను పాళీ అదో రకం బ్లాక్ షేడ్లో ఉంది.
వర్క్ షాప్, స్పేర్ పార్ట్స్, మిషన్స్, ఓవర్ టైం, శాలరీ
అక్షరాలన్నీ పనికి సంబంధించిన పదజాలంతో నిండి పోతున్నాయి
నన్నువారు అలానే తయారు చేశారు

నినదించడం.. తిరగబడటం నాకు రాదు
ఆరోపించడం, ఫిర్యాదు చేయడం అసలే తెలియదు
నిశ్శబ్దంగా భరించడం మాత్రమే నేర్పారు

నేను మొట్టమొదట ఇక్కడ అడుగు పెట్టినప్పుడు
ప్రతి నెలా 10వ తేదీ ఇచ్చే జీతం కాయితాన్నే కోరుకున్నాను
కానీ అందుకు చాలా ఆలస్యంగా చింతిస్తున్నా

నన్నిలా తయారుచేశారు
నా జీవితాన్ని.. నా భాషను.. మొత్తంగా నన్ను మార్చారు
పని మానేయడాన్ని.. జబ్బుపడటాన్ని .. సెలవు తీసుకోవడాన్ని
నిరాకరించారు.
ఆలస్యంగా రావడం ... త్వరత్వరగా వెళ్లడం అసలే కుదరదు

అసెంబ్లీ లైన్లో శిలలా బిగదీసుకు నిలుచుంటాను..
నా చేతులు ఇనపముక్కల్లా గాల్లో ఎగురుతుంటాయి
ఇలా ఎన్ని రోజులో... ఎన్ని రాత్రులో
నిలబడే నిద్రపోయాను

(చైనాలోని షాన్జిన్ లో ఫాక్స్ కన్ వర్కర్స్ పనివత్తిడి తట్టుకోలేక 2011 నుంచి 2014 వరకూ 14 మంది ఆత్మహత్య చేసుకున్నారు. తన సహచరులు ఒక్కొక్కరే ఆత్మహత్య చేసుకుంటుంటే 24ఏళ్ల సూ లీఛీ నిరాశలో రాసిన కవితల్లో ఇది ఒకటి. కవి కూడా 10 సార్లు ప్రయత్నించి చివరికి సెప్టెంబర్ 30న ఆత్మహత్య చేసుకున్నాడు.)
అనువాదం: **అలెక్స్**

మేం 'గాజా' పసి పిల్లలం మాట్లాడుతున్నాం!!

- బిల్ల మహేందర్

అవును!
ఇన్ని రోజులు మీరు
చూస్తున్నది... చదువుతున్నది
వింటున్నది... మాట్లాడుకుంటున్నది
మేమిప్పుడు
మీతో చెప్పుకుంటున్నది
అంతా నిజమే!
అవును! అన్నీ పచ్చి నిజాలే!!

మేము
మీ పిల్లలం...
మీ 'గాజా' పసిపిల్లలం!!
మెరుపు మెరిసినా
చినుకు పడినా
హరివిల్లు విరిసినా
ఎగిరి గంతులు వేసే మీ పసి మొగ్గలం!!

కానీ ఇక్కడ మాలో
ఆ మెరుపులు లేవు
ఏ చినుకులు లేవు
ఎక్కడా హరివిల్లు విరబూయడమూ లేదు...
అంతా వర్షం... ఒక్కటే వర్షం
ఇంట... బయట... స్కూల్లో
ఎటుచూసినా ఒక్కటే 'బాంబుల వర్షం'...

'వర్షం' పడుతున్నప్పుడల్లా
ఏవో మెరుపులు మాత్రం
మా కళ్లలో చటుక్కున మెరుస్తూ
భీభత్సాన్ని సృష్టిస్తున్నయి
మా నెత్తురు చినుకులై రాలుతూనే ఉన్నయి
మా దేహాలు ముక్కలు ముక్కలై
మట్టితోనే ఎగిరిపడి
ఆకాశంలో హరివిల్లై విరబూస్తున్నయి

ఏం జరుగుతున్నదో తెల్వదు

ఎందుకు జరుగుతున్నదో అసలే తెల్వదు
ఎవరి కోసం జరుగుతున్నదో అంతకన్నా తెల్వదు

మేం ఏడిస్తే
అమ్మ ప్రాణం తల్లడిల్లేది
మేం నవ్వితే
ఆ చిరునవ్వులను తనివితీరా ముద్దాడేది
నాన్న చిటికెన వేలు పట్టుకుని
ఒక్కొక్క అడుగు వేస్తూ
అమాంతం అమ్మ ఒడిలోకి చేరగానే
ముద్దుల వర్షం ఒక్కసారిగా కురిసేది...

ఇప్పుడు
అమ్మ లేదు, నాన్న రాలేదు
ఇక్కడ పడుతున్న జోరు 'వర్షం'లో
మాతో పాటు మా ముద్దులు కరిగి సమాధులై పోయాయి

ఐనా...
మీరు ఎప్పటిలాగే
చూస్తుంటరు... చదువుతుంటరు
వింటుంటరు... మాట్లాడుకుంటుంటరు
ఎవరూ మా దగ్గరికి
రారు... పలకరు... అడగరు
ఎందుకో... ఏమిటో... ఎలాగో...?

అసలు
ప్రశ్నిస్తేగా జవాబు దొరికేది??

మేమిప్పుడు
నెత్తుటి ముద్దలం!!
మా దేహాలనంతా
తెల్లని గుడ్డతో చుట్టూ చుట్టుకుని
కనిపించే నెత్తుటి మరకలోంచి మాట్లాడుతున్నాం...
ఇక్కడ మనుషులెవరైనా
మా గురించి మనసు పెట్టి ఆలోచిస్తారేమోననీ
మా ప్రశ్నలకు కొంతైనా జవాబు దొరుకుతుందేమోననీ!!

ఆగంతక అతిథి

- పాణి

పిలుస్తామా
ఎదురు చూస్తామా
స్వాగతిస్తామా

నీతో నిమిత్తంలేని
నీకెన్నడూ తెలియని
మృత్యువు దగ్గరి నుంచి జీవితాన్ని అవలోకిస్తే ఎలా ఉంటుంది

గడచిన అగడ్తలకు
పోగేసుకున్న కోపాలకు
పేర్చుకున్న అసంతృప్తులకు
చేసిన ఆరోపణలకు
లెక్క తేలని తపనలకు
నెత్తురు చిట్లిపోయేలా అనుభవించిన ఆరాటాలకు..
ఇంతదాకా ఉన్న అర్థాలన్నిటినీ మృత్యువు తారుమారు చేస్తుంది

సొంతంలోంచి లోకానికి
లోకంలోంచి సొంతానికి వేసుకున్న దారులను
కడ బిందువు దగ్గరికి లాగి మాయం చేస్తుంది

సూక్ష్మనాళికలోకి అమాంతం లాక్కుంటుంది

మృత్యువును సిద్ధం చేసుకొని సాగే ప్రయాణమిది

ఏమరపాటుగా ఉన్నవేళ ఘటనాఘటన సారాంశంగా
ఇక ఇంతే.. అనే ఏకైక అర్థంగా అవనతం అవుతుంది

సకల గుర్తింపులను తృటిలో రద్దు చేసుకొని
బంధాలను బాంధవ్యాలను తుడిచేసుకొని సాగే అనంత యానమవుతుంది

అతిథిగా వచ్చి శాశ్వత బంధం వేస్తుంది
తానే బంధమవుతుంది
పరమమవుతుంది
సరి కొత్త జీవితమై
ఇతరుల జ్ఞాపకాల్లో నిక్షిప్తమవుతుంది.

లాంగ్ మార్చ్

- బాలసాని రాజయ్య

వస్తున్నది వస్తున్నది
కనుచూపు మేరలో కనబడుతూ
గ్రామాల్లో గడీలను కూల్చింది
విశ్వవిద్యాలయాల్లో విప్లవాన్ని రగిల్చింది
చీకటి బతుకుల్లో వెలుగు నింపి
లాంగ్ మార్చ్ వస్తున్నది

నక్సల్బరీలో బయలుదేరింది
శ్రీకాకుళంలో గర్జన చేసింది

దారి పొడుగున నినాదాలు చేస్తూ
రివిజనిస్టులకు సవాలు విసిరింది
సరిహద్దులు దాటి పోరు జేస్తూ
లాంగ్ మార్చ్ వస్తున్నది

జగిత్యాల జైత్రయాత్ర
ఇంద్రవెల్లి వీరుల స్ఫూర్తి పొంది
చరిత్రకు పునాది వేసి ఛత్తీస్‌ఘడ్ చేరి
పిల్లాజెల్లా విల్లంబులతో శబరినది దాటి
లాంగ్‌మార్చ్ వస్తున్నది

జల్ జంగల్ జమీన్ కోసం
అమరవీరుల ఆశయ సాధనకై
పట్టిన తుపాకి విడవకుండా
మావో అందించిన ఎర్రజెండా పట్టుకోని
వ్యవసాయక విప్లవమే విజయంగా
లాంగ్ మార్చ్ వస్తున్నది

మరో మరో వసంత మేఘ గర్జనకై
పరుగులు పెడుతూ పడిలేస్తూ
నినాదాల పోరు కవాతుల క్రమశిక్షణ
మొక్కవోని ధైర్యం అలుపెరగని పోరాటం
భారత్‌పై అరుణతార ఎగిరెయ్యడానికి
లాంగ్ మార్చ్ వస్తున్నది
రెడ్ సెల్యూట్ చేద్దాం రండి కదిలిరండి

చిగురించే జ్ఞాపకం

- మేడక యుగంధరరావు

కడవల కొద్దీ ధైర్యాన్ని
కడుపులో పోసినా
ఎక్కడో ఒకింత దిగులాకలి
ఒళ్ళంతా ఆవహిస్తూనే ఉంది
ఎప్పుడో చేతులు కలిపి
సుదీర్ఘ సంభాషణ చేసి
తరలిపోయిన యుద్ధగానం
మళ్ళీ తిరిగొస్తే బాగుండు
ఒలుకుతున్న కన్నీటి కట్టకు
కొన్ని క్షణాలు అరువిచ్చే గుండె
దొరికితే బాగుండు

నీటి మేఘం
అర్థాంతరంగా దిశ మార్చుకుందని
దిగులు పడాలో

సరిహద్దుల వంతెన దాటి
వేరొక ముంగిట
నింగి నుంచి నిచ్చెనేసిందని
సంబర పడాలో...??
ఏదైతేనేం -
ఏటిపాయ గొంతు తడుపుతోంది

అదొక అలసట తీరని స్వప్నం
కన్నులు తెగిన కాలంపై
సూర్యుణ్ణి నిట్టనిలువునా
మొలిపించే ప్రయత్నం

అది - ఊరుమ్మడి చెమట సేద్యమో
తిరిగొచ్చిన ఒకప్పటి హితునకు
సద్ది విప్పి మిగులు పంచడమో
వృక్కపోసే సిమెంటు గదుల్లో
తుప్పుక్కున రాలుతున్న అక్షరాలకు
ఎర్రచీమల రుచి చూపి
ప్రకృతి ఒడిలో సేదతీర్చడమో
గూట్లోని 'ప్రత్యామ్నాయ' దీపాల్ని
ఊరి చివరాఖరు వరకు వెలిగించడమో
ఏదైతేనేం -
పుస్తకాల్లోని జ్ఞాపకాలు
సాయుధంగా చిగురిస్తున్నాయక్కడ

నువ్వన్నట్టు
గాజు పలకలపై కరిగిన మేధస్సు
అడివి ఆకుల్లో గూడు కడితేనో
ఉన్న పళంగా ఇనుపటోపీలు
ఈదురు గాలులై తెగబడితేనో
వేళ్ళ సందుల్లోంచి
వెన్నెల జారిపోయి
పక్కలోని నెలబాలిక మాయమవుతుందని
మట్టి చీల్చుకు లేచిన యవ్వనం
అమాంతం నేల కూలుతుందని
పదే పదే శ్మశానాన్ని వర్షించాలా?
పరిగె పరిగె ఏరితేనే కదా!
పిట్టగూడు అల్లుకునేది
బొట్టు బొట్టు రాలితేనే కదా!
పంట చేను నిండుగా తానమాడేది

ఏదైతనేం-
కొత్తరూపం పురుడు పోసుకుంది
కాస్త అంబలి పోసి ప్రాణమిద్దామా!!

కథ

కొలిమి

- ఎన్‌డి

మనకు జీవితాంతం ఉపయోగపడగల సత్యాల్ని ఒకోసారి మనం చాలా చిన్న సంఘటనల ద్వారానే తెలుసుకుంటాం అన్పిస్తుంది. లేదా ఏమాత్రం ప్రచారం లేని, మనం రోజువారీగా భావించే ఏవో సాధారణ ఘటనల ద్వారానే అవి మనకు కనిపిస్తాయేమో. అవి రోజువారీగా ఏం మనకు దొరకవు. హఠాత్తుగా మనం ఊహించని యేదో సమయంలో మన కళ్ల ముందు మెరుస్తాయి. మనం వాటిని పట్టుకున్నామా సరే లేదా అంతే వేగంగా మాయమైపోతాయి కూడా. అలా పట్టుకోవడంలోనే ఉంది మరి అసలు విషయం. కానీ దానికి రోజువారీగా ఆచరణలో వుండడమూ అంతే అవసరం. అప్పుడే అవి మనకు అగుపడే అవకాశం వుంటుంది సుమా. ఇది దానంతట అదే ఒక సత్యం.

అందుకే మా జీవితంలో రోజువారీ ఆచరణలో చేసే పనులకు వుండే ప్రాముఖ్యత మరి దేనికీ వుండదు మరి.

* * *

నా మొత్తం వయసే 18 ఏండ్లు. నాకున్న జీవితానుభంగానీ, పార్టీ అనుభవం గానీ చాలా తక్కువే అని మీరు సులభంగానే ఊహించచ్చు. కానీ నా చిన్ని జీవితంలో జరిగిన కొన్ని విషయాల్ని అవి నన్ను ఒక జీవన సత్యం దగ్గరకు ఎలా తీసుకువెళ్లాయో మీతో ఒకసారి చెప్పాలని మొదలయ్యాను ఇవాళ. నిజానికి మా దండకారణ్య ఆదివాసుల విప్లవకర జీవితాల్లో ఇలాంటివి రోజువారీగా ఎన్నో జరిగిపోతుంటాయి. వాటిని మేం మా కిట్టులోనో, జోలెలోనో వేసుకుని ముందుకు సాగిపోతూనే వుంటాం. అయితే ఇవాళ మీరు నేను చెప్పేదాన్ని వినడానికి ఇంత ఆసక్తిగా వున్నారు కనుక నా చిన్ని అనుభవాన్ని మీకు చెబ్దామని చూస్తున్నా. నాకు మా సుదురులాగో, పాలిలాగో అన్నీ పద్ధతి ప్రకారం వరుసగా, చక్కగా చెప్పడం కూడా రాదు. కానీ నాకు చెప్పాలని వుంది.

మనం నిజంగా ఏదైనా కొత్త విషయాన్ని, అసలు సిసలు విషయాన్ని తెలుసుకున్నప్పుడు పక్కవారితో దాన్ని పంచుకోవాలనే ఒక ఆత్రుత ఎలా వుంటుందనేది కూడా నాకిప్పుడే అర్థమవుతోంది. మా గూడేలకు వచ్చే పార్టీ కామ్రేడ్స్‌ను చూసి నాకు చిన్నప్పుడు ఆశ్చర్యం వేసేది, వాళ్లు ఎన్ని విషయాలు మాకు విసుగూ విరామం లేకుండా చెప్తూనే వుంటారు కదా అన్నట్టు. సమాజాన్ని గురించీ, జీవితాన్ని గురించీ మనకు బోధపడిన సత్యాలకు దాగి వుండే స్వభావం వుండదనీ, అవి నిజాయితీగల వ్యక్తుల ద్వారా అంతటా వెదజల్లబడే స్వభావం కలిగి ఉంటాయనీ కూడా నాకిప్పుడిప్పుడే అర్థమవుతోంది.

వెనక్కూ ముందుకూ పోతూ ఒక పద్ధతి పాటించకుండా నేను చెప్పే విషయాలు మీకు కొంచెం విసుగు కలిగించవచ్చు. చెప్పాక కూడా ఏముంది, మామూలు విషయమే కదా అనీ అనిపించవచ్చు. నేను సగటు ఆదివాసీ అమ్మాయికంటే ఎక్కువే మాట్లాడతాను కొత్తా పాతా లేకుండా అని అందరూ అంటూ వుంటారు. అయినా కూడా నా అనుభవం నాకెలా విలువైనదో, అలాగే మీకూ ఎంతోకొంత వుపయోగపడుతుంది అనిపించకపోయి వుంటే నేను ఇంత కొత్తవాళ్లయిన మీకు ఇదంతా చెప్పే సాహసం చేయకపోదును. నిజం.

* * *

మా అమ్మా, నాన్నా చాలా పేద ఆదివాసీ రైతులు. నేను ఇంట్లో అందరికంటే పెద్దదాన్ని. నా తరువాత ఇద్దరు చిన్న చెల్లెండ్లు, ఇద్దరు తమ్ముళ్లు వున్నారు. నేను ఎనిమిదవ తరగతి వరకూ చదవడం అనేది మామూలుగా అయితే ఊహకందని విషయమే. కానీ మా చిన్నాన్న చిన్నప్పటి నుండి చదువులో చురుకుగా వుండడం వల్ల స్కూల్లో మాష్టర్జీలు అందరూ ఆయనను ప్రోత్సహించి, హాస్టల్లల్లో చేర్పించి చదివించారు. చివరికి ఆయన స్వయంగా గురుజీగా ఉద్యోగం చేసేదాకా వచ్చాడు. దాంతో ఆయన మా కుటుంబంలో, మా గూడెంలో, చుట్టుపక్కల గూడేల్లో మా ఆదివాసీ పిల్లలందర్నీ చదువుకోవడానికి బాగా ప్రోత్సహించి, హాస్టల్లల్లో చేర్పించి చదివించాడు. అలా నేనూ ఎనిమిది వరకూ చదివాను.

తర్వాత కూడా చదివించాలనీ, నన్ను కూడా ఉద్యోగస్తురాలిగా చూడాలనే కోరిక మా చిన్నాన్నకు ఉందని నాకు తెలుసు. చదువులో నేను ముందుండడం ఆయనకు గర్వంగా ఉండేదనీ తెలుసు. కానీ నాకు చిన్నప్పటి నుండి మా ఊరికి వచ్చే దళంతో, వాళ్లు నేర్పే పాటలతో, రాజకీయాలతో ఏర్పడిన బంధం నన్ను అటువైపే నడిపింది. చిన్నాన్న నిరాశ దాగలేదు. కానీ ఆయన దగ్గర నన్ను అడ్డుకోగల వాదనలు లేవు. పార్టీ లేకుంటే మా పరిస్థితి ఎలా వుంటుందనేది నా ముందు తరంవాడిగా ఆయనకే ఎక్కువ తెలుసు. ఫారెస్టు వాళ్ల దౌర్జన్యాలు అనుభవించిన తరం.

పీఎల్‌జీఏలో చేరే వయస్సు 16 సంవత్సరాలు రాగానే ఇక నేను ఆగలేదు. కానీ పార్టీ నన్ను ఇంకా చదువుకోమనీ, కొన్నాళ్లు విద్యార్థుల్లో పని చేశాక వద్దువనీ చెప్పి చూసింది. కానీ నేను వినలేదు. దానివల్ల పార్టీకి ఆ మేరకు నష్టం జరిగిందేమో, ఎందుకంటే విద్యార్థుల్లో పని చేయడం ఎంత ముఖ్యం అనేది నాకు ఇప్పుడు అర్థమైనంతగా కూడా అప్పుడు అర్థం కాలేదు. యేదేమైనా అది అలా జరిగిపోయింది. సరే అదంతా అంత ముఖ్యమైనది కాదులెండి. ఏ విషయానికైనా ఒక .గతం, ఒక వర్తమానం, ఒక భవిష్యత్తు వుంటుంది కదా, అందుకని కొంతైనా నా నేపథ్యం మీకు చెప్తే మంచిదనిపించింది.

నా జీవితం ఎక్కువ హాస్టల్లోనే గడిచినప్పటికీ పేదరైతు జీవితం ఎంత దుర్భరంగా ఉంటుందనేది నాకు అమ్మా, నాన్నల జీవితాన్ని చూడ్డం ద్వారా, పేదరికంలోనే పుట్టి పెరగడం ద్వారా తెల్వని విషయం ఏం కాదనేది చెప్పడానికే ప్రధానంగా ఇదంతా చెప్పాను.

* * *

ఏదైనా సత్యాన్ని తెలుసుకోవాలంటే కొంత కష్టపడ్డం అవసరం అనే విషయాన్ని మీరు ఒప్పుకుంటారనే అనుకుంటున్నాను. అది శారీరకం కావచ్చు. మానసికం కావచ్చు. లేదా రెండూ ఉంటాయనచ్చు. అందుకని మీరివాళ నా అనుభవం నుండి కొంత తెలుసుకోవాలంటే మీకు కొంత కష్టం ఇవ్వడం తప్పదు మరి. భయపడకండి. కొత్తవాళ్లను మరీ కష్టపెట్టకూడదు అని నాకు తెలుసు. ఎంత కష్టం అయినా మేం పడి మా దగ్గరకు వచ్చినవాళ్లను కష్టపెట్టకుండా సాగనంపడం మా ఆదివాసీ సంప్రదాయంలోనే ఒక భాగం. అంతేకాదు, మీకు కొంత అలసట కలిగినా మా ప్రకృతి మీకు గొప్ప ఆహ్లాదాన్ని ఇవ్వగలదని కూడా నేను మీకు హామీ.

ఏం లేదు. మనం ఓ రెండు, మూడు గంటలు నడవాల్సి ఉంటుందంతే. కాపోతే మధ్యలో ఓ వాగు దాటి, ఒక గుట్టెక్కాలి. అప్పుడు గానీ మన కథా ప్రదేశానికి చేరుకోలేం మనం. మరి పదండి. ఆ, ఆ, పదేరు, జాగ్రత్త, అంత తొందరపడాల్సిన అవసరమేం లేదులెండి. మీరు నడవగల్గిన వేగంతోనే పోదాం. సమయానికి చేరుకోలేం అనే చింత అనవసరం, ఎందుకో తెలుసా?

కాలం ఎప్పుడూ ముందుకే పోతుందని అంటారు కదా. అది విజ్ఞానశాస్త్రం. కానీ కాలంలో ముందుకూ, వెనక్కూ, ఏ కాలానికంటే ఆ కాలానికి వెళ్లగల శక్తి మాత్రం కథలు చెప్పేవాళ్లకు సొంతం. కథలకు భౌతిక ప్రపంచ సూత్రాలు వర్తించినా, వర్తించపోయినా అవి భౌతిక ప్రపంచం గురించిన సత్యాల్ని బోధించగలవు అనేది పిల్లలకు ఈ ప్రపంచంలో ఇంకెవరికంటే ముందు తెలిసిన వివేకం. కదూ?

* * *

రండి, మనం ఈ అడవిబాట వెంబడి చెట్ల కిందుగా నడుద్దాం. మనకిప్పుడు ఎండదెబ్బ అంతగా కొట్టదు. పొద్దు బారెక్కక ముందే ఎలాగూ చేరుకుంటాం. మెల్లగా చూసుకుని నడవండేం. ఒకోసారి పెద్ద బండలూ, మొద్దులూ జాగ్రత్తగానే దాటుతాం గానీ చిన్న బండలూ, కొయ్యలూ మిమ్మల్ని పడేస్తాయి. ప్రకృతిని ఆస్వాదిస్తూనే కింద కూడా ఒక చూపు చూసుకుంటూ నడవండి, అంతే.

చూశారా, ఎన్ని బుల్లి, బుల్లి రంగురంగుల పిట్టలు కిచకిచలాడుతున్నాయో. చీకటి వుండగానే వీటి కలకలరావాలతోనే అడవి నిద్రలేస్తుంది. వేలెడంత వుండవు కానీ కూతలు మాత్రం మూడు కొండల్ని దాటుతాయా అన్పిస్తుంది, కదూ. చలికాలం ఇక మనల్ని విడిచిపోతోంది. తర్వాత అడవి ఆకులు రాలుస్తుంది. మీకీ రహస్యం తెలుసు కదా, మనుషులు గానీ, ప్రకృతి గానీ చలికాలంలో కనిపించినంత అందంగా మరెప్పుడూ కనిపించరు. చూడండి అడవి కూడా ఎన్నెన్ని రకాల ఆకుపచ్చ రంగులతో అందంగా వుందో.

ఇప్పుడిక మనం వాగు దాటాలి. లోతు లేదు, మోకాళ్ల వరకు కూడా లేవు నీళ్లు. ఈ వెదురు కట్టెలు పట్టుకుని నడవండి. పాకుడు రాళ్లు వుంటాయి కనుక కట్టెనాధారం చేసుకుని నడవండి.

ఆ, దాటేశాం. ఇప్పుడిక కాసేపు ఈ బండల మీద కూచుందాం రండి. ఎందుకంటే మనం నడవబట్టి గంట కావస్తుంది. అలాగే ఇక గుట్ట ఎక్కేదుంది. కనుక అలసట తీర్చుకుని పోదాం. ఇగో ఈ చల్లటి నీళ్లు తాగండి. గుట్ట ఎక్కాక ఎక్కువ నీళ్లు అవసరం అవుతాయి కనుక కొద్దికొద్దిగా తాగండిప్పుడు.

ఎక్కడం కష్టంగా వుంది కదూ, నిజానికి ఇది చిన్న గుట్టే. ఇంకెంత వచ్చేశాం. కొద్దిగా ఓర్చుకోండి. కట్టెల సాయంతో ఎక్కడం వల్ల మీకు కొంచెం సౌకర్యంగా ఉండే వుంటుంది.

హమ్మయ్య, ఎక్కేశాం. కాసేపు కూచుందాం. ఆ, ఇప్పుడీ నీళ్లు మీకు కావల్సినంత తాగండి. అలసట తీరిందా? ఇప్పుడొకసారి అలా చుట్టూ మీ చూపులు సారించండి. అద్భుతంగా వుంది కదూ. దూరాల వరకూ వ్యాపించిన కొండల వరుసలు, నీలాకాశం, తెల్లటి మేఘాలు, అప్పుడే విచ్చుకుంటున్న సూర్యుడి కిరణాలు, లోయల మధ్య తెల్లగా పారుతున్న వాగులు, ఏవో అడవి పూల సువాసనలన్నీ మోసుకొస్తూ చెమట్లు కక్కిన శరీరంపైగా వీస్తూ అలసటను పోగొట్టే ఈ చల్లని పిల్లతెమ్మెరలు....ఇప్పుడిక నన్ను తిట్టుకోరు కదూ కష్టపెట్టినందుకు.

కాలంలో గెంతు వేయించగల కథకులు స్థలంలో వేయించలేకపోతారా? ఈ కష్టం అంతా లేకుండా కథాస్థలానికి తీసుకుపోలేకపోదువా అనే ఒక నిష్ఠూరపు చిరుసందేహం మీకు కలిగితే అదేం తప్పు కాదు. కానీ నా కథ చెప్పడం ముగిశాక ఈ కష్టం కలిగించినందుకు నన్ను క్షమించాలో లేదో తేల్చుకోండి. అప్పటివరకూ కొంచెం ఓపిక పట్టండి.

సరే, మన కథాస్థలం అయిన వూరు పొలిమేరలకు వచ్చేశాం. ఆ కన్పిస్తున్న పశువులు, మేకలు ఆ వూరివే. ఈ సమాధులు కూడా ఆ వూరివాళ్లవే. ఈ వస్తువులేంటి అంటారా? చనిపోయిన వ్యక్తులతో పాటు వాళ్లు వాడిన వస్తువుల్ని కూడా సమాధుల వద్దనే వుంచుతాం మేం.

ఇక ఊర్లోకి వెళ్దాం. దానికంటే ముందు మీరు వెదురుతో అల్లిన ఈ చిన్న తడక మీంచి గెంతాలి. ఇప్పుడిక మనం కాలంలో రెండు నెలలు వెనక్కు వచ్చేశాం. మనం చెప్పుకునే విషయానికి మనం ఇంత వెనక్కు వెళితే సరిపోతుంది. అంటే మనం ఇప్పుడు మన కథలోకి ప్రవేశించేశాం. చలికాలం, 2013.

అరే, ఏంటి ఆగిపోయారు, రండీ...

ఓహో, ఊరి చుట్టూ, ఇండ్ల మధ్యనా పరుచుకున్న ఆ ఆకుపచ్చ, పసుపుపచ్చ కలనేత తివాచీని చూసి ఆగిపోయారా? అవన్నీ మేం గంగ అని పిలిచే ఒక రకం నువ్వుల చేలు. ఈ కాలంలో మీరు ఏ వూరికెళ్లినా ఈ మనోహరమైన కలనేత తివాచీలు మీకు స్వాగతం పలుకుతాయి.

ఈ వూరు, దీని పక్కనున్న మరి నాలుగు వూర్లు ఒక ఆర్.పి.సి.గా వున్నాయి. ఈ వూరి పేరు మీదనే ఆ ఆర్.పి.సి. పేరూ పెట్టారు, ఎందుకంటే ఇదే వాటిల్లోకెల్లా పెద్దది, కేంద్రం కూడా. ఆర్.పి.సి. పేరు అంటారా? శత్రు నిర్బంధం తీవ్రంగా వున్న ఈ సమయంలో పేరు చెప్పుకోవద్దు కదా, దండకారణ్యంలో ఒక ముఖ్యమైన గెరిల్లాబేసులోని ఒక ఆర్.పి.సి. అనుకోండి. ఆర్.పి.సి. అంటే రివల్యూషనరీ పీపుల్స్ కమిటీనే గానీ మేం ఆర్.పి.సి. అని గానీ క్రాంతికారి జనతన సర్కార్ అని గానీ అంటాం.

మనం గోటుల్ వద్దకు పోదాం. గోటుల్ అంటే ఊరికి ఒక సాంస్కృతిక కేంద్రం కూడా. అక్కడ ఒక సభ జరుగుతోంది. రండి చూద్దాం. గోటుల్ చుట్టూరా తడికెలకు, గోటుల్‌ను నిలబెడ్తున్న

దూలాలకు అంటించిన పోస్టర్లు చూద్దాం. అవి మనకు ఈ సభ గురించి కొంచెం తెలుపుతాయి.

'ప్రజలకు సేవ చేద్దాం, ఉత్పత్తిని పెంచుదాం'

'భారతసేన వాపస్ జావో'

'బస్తర్ బస్తర్ ప్రజలదే, ఎస్సార్, అంబానీలది కాదు'

'జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికార్ హమారా'

'మార్క్సవాద్-లెనిన్‌వాద్, మావోవాద్ జిందాబాద్'

'బిసిటిఎస్ జిందాబాద్'

చదివేవి ఇంకా మిగిలి వున్నాయి గానీ, ఈలోపు కామ్రేడ్ బుధూ ఉపన్యాసం అయిపోతుందేమో. విందాం పదండి. ఆయన కోయలో మాట్లాడుతున్న విషయాల సారాంశం మీకు చెప్తాను.

బిసిటిఎస్ విద్యార్థులు తమ ఊరికి ఉత్పత్తిలో సహాయం చేయడానికి రావడం తమ ఆర్.పి.సి.కి ఎంతో సంతోషం కలిగిస్తోందనీ, ఆ పనిని ప్రజలూ, విద్యార్థులూ ఒకరికొకరు సహాయం చేసుకుంటూ విజయవంతం చేస్తారని ఆశిస్తున్నానని చెప్తున్నాడు కామ్రేడ్ బుధూ, అంటే ఈ ఆర్.పి.సి. అధ్యక్షుడు.

ఓ. ముందు మీకు బిసిటిఎస్ అంటే చెప్పాలి. బేసిక్ కమ్యూనిస్టు ట్రైనింగ్ స్కూలు అంటే ప్రాథమిక కమ్యూనిస్టు శిక్షణా పాఠశాల. దండకారణ్య పార్టీ గత ఐదారు సంవత్సరాలుగా దీన్ని ప్రతి సంవత్సరం నడుపుతోంది. దండకారణ్య పార్టీలో అత్యధికంగా వున్న ఆదివాసీ కామ్రేడ్స్ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొంతమంది చురుకైన, నిబద్ధత ఉన్న కామ్రేడ్స్‌ను ఎంపిక చేసి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా మెరుగైన కార్యకర్తలను తయారు చేసే ఉద్దేశ్యంతో పార్టీ దీన్ని ఆరంభించింది.

దాదాపు ఆరు నెలలపాటు లేదా నిర్బంధాన్ని బట్టి కొంత తక్కువ కాలం నడిచే ఈ స్కూలులో విజ్ఞానశాస్త్రం, భాష, లెక్కలు, చరిత్ర, భూగోళం వంటి స్కూళ్లలో బోధించే విషయాలతో పాటు మార్క్సిస్టు తత్వశాస్త్రం, మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్రం, నూతన ప్రజాస్వామిక విప్లవం, పార్టీ మహిళా పర్‌స్పెక్టివ్, పార్టీ వ్యూహం-ఎత్తుగడలు లాంటి రాజకీయ అంశాలు కూడా ప్రాథమికంగా చెప్తారు. కమ్యూనికేషన్స్ వంటి విషయాల్ని కూడా బోధిస్తారు.

ఈ స్కూలులో ఈ పాఠాలు నేర్చుకోవడమే కాక కొద్దిరోజులు ఉత్పత్తిలో పాల్గొంటూ ప్రజలకు సేవ చేయడం కూడా ఒక తప్పనిసరి భాగం. ఇప్పుడు మీరు ఈ గోటుల్‌లో చూస్తున్న దాదాపు ముప్పైమంది విద్యార్థినీ విద్యార్థులు స్కూల్లో నేర్చుకునే విషయాలు ముగించుకుని ఉత్పత్తిలో పాల్గోవడానికి ఈ ఆర్.పి.సి.కి వచ్చి ఉన్నారు. దాన్ని ప్రారంభంగానే ఈ భుంకాల్ సభ జరుగుతోంది. అందుకే ఊరివాళ్లంతా ఇక్కడే ఉన్నారు.

వచ్చిన విద్యార్థులందరినీ ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున ప్రజలు తీసుకువెళ్లాలనీ, వారు ఆ ఇంటివారికి అవసరమైన ఉత్పత్తి పనుల్లోనూ, అలాగే మొత్తంగా ఆర్.పి.సి. సమిష్టి పనుల్లో కూడా పాల్గొంటారనీ చెప్తున్నది మా బిసిటిఎస్ టీచర్ కామ్రేడ్ దన్ని. ఆ, అవును, నేను కూడా ఈ బ్యాచు బిసిటిఎస్ విద్యార్థినే. అందుకే మా బిసిటిఎస్ అన్నాను. పగలంతా మేం పనుల్లో ఉండి రాత్రికి మాత్రం గోటుల్‌లో పడుకునేవాళ్లం సెంట్రీ పెట్టుకుని. మిలీషియా సెంట్రీ ఎలాగూ ఆర్.పి.సి.ది ఉండేది విడిగానే.

ఇప్పుడు ఇక కథలోకి ప్రవేశించేశాం కనుక కొంచెం తొందర తొందరగా నడుద్దాం. మనం కాలంలో కొంచెం ముందుకూ వెనక్కూ నడుచుకుంటూ పోతూ అన్నీ తెలుసుకుందాం.

ముందు గోటుల్‌నే చూద్దాం. అక్కడే ఉన్నాం కనుక. మా విద్యార్థులం ఇక్కడున్న 15 రోజుల్లో ఈ గోటుల్ చుట్టూ ఉన్న తడికెను ముందు బాగుచేశాం. ఎందుకంటే పందులు, పశువులు లోపలకు వచ్చేస్తూ ఉండినాయి. తర్వాత అరటి పిలకలు తెచ్చి నాటి మళ్లీ వాటి చుట్టూ తడికెలు చేసి పెట్టాం. గోటుల్ నేల అలికి చాలా రోజులైనుండె. అందుకని ఎగుడుదిగుడు లేకుండా చదును చేసి పేడ తెచ్చి మంచిగా అలికాం. ఈ పనంతా అయ్యాక గోటుల్ చుట్టూ కొన్ని పూలమొక్కలు నాటాం. కడుపుకే కాదు కళ్లకూ విందు అవసరమే కదా, ఏమంటారు?

ఊర్లో వున్న నలభై ఇళ్లకూ తిరగలేం కనుక ఒకటి రెండు ఇండ్లలో ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున వెళ్లిన మా విద్యార్థులు చేసిన పనులను పరిశీలిద్దాం.

ఇది కామ్రేడ్స్ మంగు, కోసిల ఇల్లు. మంగు ఆర్.పి.సి.లో రక్షణ విభాగం బాధ్యుడు, కోసి కెఎఎంఎస్‌లో పని చేస్తుంది. వాళ్లకు ఇద్దరు చిన్న, చిన్న పిల్లలు. అందుకని తమ బాధ్యతలనూ, పిల్లలనూ చూసుకుంటూ ఇంటిని కొంత నిర్లక్ష్యం చేయక తప్పలేదు. మా విజయ్, అమిత, రాధలను వీరు తమ ఇంటికి పిలుచుకుపోయారు.

మా విద్యార్థులు ముగ్గురూ ఇంటి చుట్టూ, ఇంట్లోనూ పాతగా అయ్యి పడిపోతున్న వాటినన్నిటినీ బాగు చేశారు. ఇంటి కప్పును బాగు చేశారు. కోళ్లగూడును బాగుచేశారు. పందులు దూరివస్తున్న సందులన్నిటినీ కట్టడి చేశారు. ఇంటి చుట్టూ కొన్ని కూరగాయల పాదులు వేసి, రాటలు నాటి తీగెలు పాకించారు. అలాగే రోజూ వాళ్ల పొలంలోకి వెళ్లి కలుపులు తీయడం, గట్లు బాగుచేయడం కూడా చేశారు.

ఆయా ఇండ్లకు, వారి పొలాలకు అవసరమైన పనుల్లో చిన్న, చిన్న తేడాలుండచ్చు గానీ దాదాపుగా మా విద్యార్థులం మమ్మల్ని తీసుకుపోయిన ఇండ్లన్నింటి వద్దా, వారి పొలాల్లోనూ అవసరమైన పనులన్నీ చేసి పెట్టాం. మీరలా గ్రామంలో తిరుగుతూ అన్ని ఇండ్లనూ చూసుకుంటూ నడవండి. ఎక్కడా బాగు చేయాల్సినవేవో వున్నట్టు మీకు కనిపించడం లేదు కదూ. బిసిటిఎస్ వచ్చి పోయిన గ్రామం అని గుర్తుపట్టేలా ఉంది కదూ.

గ్రామంలో బాటలన్నీ కూడా చాలా శుభ్రంగా ఉండడం కూడా మీరు గమనిస్తున్నారనుకుంటున్నా. ఎందుకంటే మేం గ్రామంలో సఫాయి అభియాన్ కూడా చేపట్టాం. ఊరి వాళ్లందరినీ కూడా భాగం చేసినా ప్రధానంగా మేమే ముందుంటూ గ్రామాన్నంతా శుభ్రం చేశాం. శుభ్రత ప్రాముఖ్యత గురించి పాటలు పాడి, ఒక నాటిక కూడా వేశాం.

ఇటు రండి, ఈ అందమైన కూరగాయల క్షేత్రాన్ని చూద్దురు. ఇది పూర్తిగా మేం విడిగా ఆర్.పి.సి. సమిష్టి అవసరాల కోసం తయారు చేసిన కూరగాయల క్షేత్రం. ఆర్.పి.సి. వ్యవసాయ క్షేత్రం బాధ్యుల సహాయంతో రకరకాల కూరగాయల మొక్కలూ, పాదులూ తయారు చేసి మేము ఉన్నన్ని రోజులు వంతులవారీగా నీళ్లు పోస్తూ, పశువులు, పందులు వాటిని పాడు చేయకుండా తడికెలు కట్టాం.

మేమిక్కడ ఉన్నకాలంలో వచ్చిన అక్టోబర్ క్రాంతి అంటే రష్యా విప్లవ దినాన్ని అందరితో కలిపి జరుపుకున్నాం. మనకు పక్క గల్లీ నుండి వినిపిస్తున్న నినాదాల హోరు ఆ సభ నాటిదే. సఫాయి అభియాన్‌లో భాగంగా వేసిన నాటికే కాకుండా 'భారత్ సేన వాపస్ జావో' అనే నాటిక, భగత్సింగ్ నాటిక, తాడిమెట్ల దాడి నాటిక కూడా వేశాం. అగో, ఆ బయలు ప్రాంతంలో మనకు కొంచెం ముందుగా అక్కడ గుండ్రంగా చుట్టూ కూచుని ప్రజలు చూస్తున్నది ఆ భగత్సింగ్ నాటికే.

దాదాపు రోజూ సాయంత్రం గోటుల్‌కు వచ్చాక పాటల కార్యక్రమం నడిచేది. ఆర్.పి.సి. సి.ఎన్.ఎం. వాళ్ల దగ్గర మాకు రాని పాటలు రాసుకుని నేర్చుకున్నాం, వాళ్లకు తెల్వని పాటలు రాసిచ్చి నేర్పించాం. మీకు గాల్లో తేలి వస్తూ వినిపిస్తున్న మధురమైన రేలా, రిలో రాగాలు అవే. రండి, కాసేపు కూచుని పాటలు విందాం. గ్రామంలో తిరిగి, తిరిగి అలిసిపోయి ఉంటారు. మనం చాయ్ కూడా పెట్టుకోవచ్చు.

చాయ్ తాగి, మనం ఈ పాటల ప్రోగ్రాం వినేవరకూ మనకు అన్నం వస్తుంది. విద్యార్థులు అందరూ ఇక్కడే జిల్లీలు వేసుకుని పడుకుంటారు. తిన్నాక మనం కూడా కొద్దిగా అటువైపు జిల్లీలు వేసుకుని ఒరుగుదాం. రేపు ఉదయాన్నే మీరు మళ్లీ మీ స్థలకాలాలకు వెళిపోవాలి కనుక కొంత ఆరాం చేస్తేనే మంచిది.

ఆ, ఆ, గుర్తుంది, మనం చెప్పుకునే విషయాలు మిగిలే ఉన్నాయి. అన్నం తిని చలికాలపు చుక్కల ఆకాశం కింద, మంట వద్ద చలికాగుతూ మాట్లాడుకుందాం అవన్నీ. ఈ చలికాలపు అనుభూతిని కూడా మీరు పొంది తీరాలి ఇంత అడవిలోపటికంటా వచ్చాక.

* * *

మా బిసిటిఎస్ గురించీ, అందులో భాగంగా ప్రజలకు సేవ చేసే విద్యార్థుల ఉత్పత్తి కార్యకలాపాల గురించి స్వయంగా చూడ్డం, తెలుసుకోవడం మీకు చాలా సంతోషంగా, ఉత్సాహంగా అనిపిస్తుంది అని నాకు తెలుసు. దేశంలో నిజమైన ప్రగతిని కోరుకునే మన విప్లవ క్యాంపులోని ఏ కామ్రేడ్‌కైనా ఇదంతా యెంత ఉత్తేజకరంగా ఉంటుందో నేను ఊహించగలను. చూసేవాళ్లకి మీకే అలా ఉంటే ఇక అందులోనే మునిగితేలిన మాకు ఎలా ఉండి ఉంటుందో మీరు ఊహించొచ్చు.

15 రోజులు ఎలా గడిచిపోయాయో మాకు అర్థమే కాలేదు. సమిష్టిలో ఉండే ఆనందం, ఓహ్, అనుభవించితే గానీ అర్థం కాదు. బిసిటిఎస్‌లో మాకు కామ్రేడ్ మావో ప్రజలకు సేవ చేయడం గురించి రాసిన వ్యాసాలు, చైనా, రష్యా కథలూ కూడా చెప్పేవారు. ఆ కథల్ని మేం తిరిగి ఇక్కడ జీవిస్తున్నట్టుగా తోచేది మాకా పనులన్నీ చేస్తుంటే.

ముగింపు సభను గ్రామంలో నిర్వహించే ముందు ఆర్.పి.సి. నాయకులతో కూర్చున్నాం. వాళ్లంతా చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారు. తమ డివిజన్‌లో బిసిటిఎస్ స్కూలు విజయవంతంగా జరగడం, తమ ఆర్.పి.సి.లో ఉత్పత్తి కార్యక్రమం విజయవంతంగా ముగియడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల, వారి గురూజీల క్రమశిక్షణ, నిబద్ధత తమకు ఎంతో స్ఫూర్తిని ఇచ్చిందన్నారు. విద్యార్థులం, మా గురుజీలు కూడా దాదాపు అలాంటి భావాల్నే ఆ ఆర్.పి.సి. నాయకత్వం పట్ల, ప్రజల పట్ల వ్యక్తం చేశాం. 5 నెలలకు పైగా స్కూల్లో నేర్చుకున్నది ఒకెత్తు, ఈ 15 రోజులు నేర్చుకున్నది ఒకెత్తు అని చెప్పాం.

ముగింపు సభ కూడా చాలా బాగా జరిగింది. ప్రజలంతా మేం వెళిపోతామంటే తమ స్వంత పిల్లలు వెళిపోతున్నట్టుగా భావించారు. తిరిగి రావాలని ఎంతో కోరారు. మీకు చెప్పడం మరిచాను, మేం చేసిన మరో పని పిల్లలకు శుభ్రంగా ఉండడం నేర్పించడం, వాళ్లకు రోజూ కాస్సేపు చదువు చెప్పడం. మేం వెళిపోతుంటే అందరికంటే బాధపడింది ఆ బుజ్జి పిల్లలే. మా వెంటే చాలా దూరం వచ్చారు.

అంతా మంచిగా అయిపోయిందనుకుంటున్న సమయంలో మేం తిరిగి పోయే దారిలో మాకు కలిసింది అక్కడి డివిజన్ కమిటీ సభ్యురాలు సునీల దీదీ. మమ్మల్ని కలిసి దీదీ, దీదీని కలిసి మేమూ చాలా ఉత్సాహపడ్డాం. మా ఉత్పత్తి కార్యక్రమం రిపోర్టు అంతా విని చాలా సంతోషించింది. తనకు ఆ ఆర్.పి.సి.లో అన్ని ఇండ్లూ తెలుసు కనుక ఒక్కొక్కరి గురించీ కూడా అడిగి, అడిగి తెలుసుకున్నది ఆ ఇండ్లకు పోయిన విద్యార్థుల నుండి. హఠాత్తుగా దీదీ ముఖంలో నవ్వు మాయమైంది.

ఎందుకో మీరే విందురు రండి. అక్కడ కనిపిస్తున్న ఆ మంట దగ్గరకి వెళ్దాం. అక్కడే దీదీ, మా గురూజీలు, విద్యార్థులమూ కూర్చుని ఈ విషయాలు మాట్లాడుకుంటూ ఉండింది.

* * *

'ఇవేనా మీరు వెళ్లిన ఇండ్లు? ఇంకా ఉన్నాయా? గుర్తు చేసుకుని చెప్పండి,' అడిగింది సునీల కొంత ఆదుర్దాగా.

'ఇంతే దీదీ. మొన్ననేగా మేం అక్కడి నుండి వచ్చింది, ఎలా మర్చిపోతాం,' విజయ్ అన్నాడు సునీల ముఖంలో మారుతున్న రంగులను ఆశ్చర్యంగా చూస్తూ.

అప్పటివరకూ ఒకరితో ఒకరు పోటీపడుతూ దీదీకి విషయాలను చెప్తున్న విద్యార్థులు మౌనంగా దీదీనే చూడ్డం మొదలుపెట్టారు.

దన్ని గురూజీ, 'ఏమైంది సునీలా, విషయం ఏంటి?' అని అడిగింది యిక ఆగలేనట్టుగా.

'నా నుండి పెద్ద పొరపాటే జరిగింది దన్నీ. ఉత్పత్తి కార్యక్రమానికి బైల్దేరే ముందు నువ్వు చాలా అడిగావు కూడా నన్ను ఒకసారి రమ్మని. కానీ పనుల ఒత్తిడితో నేను రాలేనని చెప్పాను. ఆర్.పి.సి. వాళ్లు సహకరిస్తారని హామీ ఇచ్చాను. కానీ ఇలాంటి పనులప్పుడు నాయకత్వం లేకపోతే జరిగే నష్టం ఏంటో అంతా అయిపోయాక ఆచరణలోనే అర్థమైంది,' అంది సునీల సుదీర్ఘంగా మంటకేసి చూస్తూ.

పిల్లలందరూ కొంత బిక్కవచ్చినట్టు అయిపోయారు. పొరపాటు ఏంటో, దీదీ ఎందుకు బాధపడ్తోందో వారికి అర్థం కాలేదు.

'సునీలా, పిల్లలందరూ ఆదుర్దా పడుతున్నారు,' అంది దన్ని మెల్లగా.

'ఓ, క్షమించండి, ఎటో వెళిపోయాను కాసేపు. ఆహాహ, మీరంతా అంత కంగారు పడకండి. ఇదొక గుణపాఠంగా తీసుకుందాం మళ్లీ జరక్కుండా. మీ రిపోర్టు వింటుంటే మీరు కొన్ని

ఇండ్లకు వెళ్లలేదనేది అర్థం అయ్యింది. ఆ ఇండ్లు ఎవరివి తెలుసా?' అడిగింది సునీల సూటిగా విద్యార్థులను చూస్తూ.

విద్యార్థులు తల అడ్డంగా ఊపారు.

'ఆ మిగిలిపోయిన కొద్ది ఇండ్లు పేదరైతులవి. బహుశా వాళ్లు విద్యార్థుల్ని ఇండ్లకు తీసుకువెళ్లి తిండి పెట్టడం తమకు కష్టం అవుతుందనే దానితో మిమ్మల్ని తీసుకెళ్లలేదు. దాంతో నిజంగా మీ సేవలు అవసరమైన కొందరికి అవి అందలేదు,' విద్యార్థుల ముఖాల్లోని భావాలను నిశితంగా గమనిస్తూ చెప్పింది సునీల.

విద్యార్థులందరికీ ఒక్కసారిగా ఝల్లుమంది. అంతా చాలా బాగా జరిగిందనే వాళ్లు ఇప్పటివరకూ అనుకుంటూ వచ్చారు. దాంతో మాటలు రానట్టుగా తమ గురూజీలకేసీ, సునీలకేసీ చూస్తున్నారు. కాస్సేపు అక్కడ మౌనం రాజ్యమేలింది.

క్రమంగా ప్రశాంతంగా మారుతున్న సునీల ముఖాన్ని చూస్తుంటే విద్యార్థుల ఉత్సాహాన్ని తాము చేసిన ఈ తప్పుతో చల్లార్చడం సరి కాదని ఆమెకు అనుకుంటున్నట్టుగా కనిపిస్తోంది. అంతకంటే ముఖ్యంగా విద్యార్థులకు ఒక ముఖ్యమైన గుణపాఠాన్ని అందించే అవకాశం కూడా యిది అని ఆమెలోని నాయకురాలికి అర్థమౌతోందేమో అనిపిస్తోంది.

సునీల అనునయంగా తిరిగి మొదలుపెట్టింది. 'మొత్తంగా మన బిసిటిఎస్ స్కూలుగానీ, మన ఉత్పత్తి కార్యకలాపాలు గానీ విజయవంతం అయ్యాయనేదే ప్రధానాంశం. అయితే ఎప్పుడైనా గానీ ఆచరణలోకి దిగినప్పుడే మనం నేర్చుకునే సిద్ధాంతాన్ని ఎలా అన్వయించాలనేది మనకు తెలుస్తుంది. కొన్ని అనుకూల, ప్రతికూల అనుభవాల నుండే మనం తర్వాతి అడుగులు ఎలా వేయాలో నేర్చుకుంటాం. ఇక్కడ జరిగిన పొరపాటు ప్రధానంగా డివిజన్ కమిటీలోని నా నుండి జరిగింది. ఇక్కడి బాధ్యతలు చూస్తున్న నేను గానీ, ఇక్కడి దళంగానీ ఇంత ముఖ్యమైన కార్యక్రమం అప్పుడు మీతో ఉండేలా మేం ప్లాన్ చేయకపోవడం లోపమే. ముప్పై మంది విద్యార్థులు ప్రజలకు సేవ చేసే సంకల్పంతో వచ్చినప్పుడు అవసరమైతే ఇతర పనులను సర్దుబాటు చేసుకుని మేం రావల్సింది. ఇంతకంటే ముఖ్యం ఏముంటుంది అని కూడా ఇప్పుడు వెనక్కి చూసుకుంటే అన్పిస్తోంది. ఇది మా ఆత్మవిమర్శ.

ఇది చూడగానే కనిపించే లోపం. లోతుగా ఆలోచిస్తే అంతకంటే ముఖ్యమైన లోపం ఇక్కడి స్థానిక నాయకత్వం అంటే మన ఆర్.పి.సి. పేదరైతుల ఇండ్లు మిగిలిపోకుండా ఉండేలా ప్లాన్ చేయలేకపోయిందంటే వారిని ఇంకా ఆ విధంగా ఎదిగించడంలో మా లోపం ఉంది. ఆత్మవిమర్శ ఉద్దేశ్యం తప్పులెన్నడం కాక తప్పులు తిరిగి జరగకుండా చూసుకోవడమే కనుక మేం కమిటీలో చర్చిస్తాం,' అంటూ ఆగి ఊపిరి తీసుకుంది సునీల.

వాతావరణం కొంత తేలికైంది.

సునీల అందరికేసి ఒకసారి చూసి అందరూ శ్రద్ధగా వింటున్నారని నిర్ధారించుకుని తిరిగి మొదలెట్టింది. 'మనం చేసిన పనులను మనం సాధారణంగా అంకెల్లో లెక్కబెట్టుకుంటూ ఉంటాం. ఎన్ని మొక్కలు నాటాం, ఎన్ని గట్లు బాగుచేశాం, ఎన్ని ఎకరాలు చదును చేశాం, ఎన్ని ఇండ్ల కప్పులు బాగు చేశాం, ఎన్ని సభలు చేశాం, ఎంతమంది ప్రజలు వచ్చారు...ఇలా. ఇందులో తప్పేం లేదు. తప్పకుండా ఈ అంకెలు అవసరం. అవి మన పనిని అంచనా వేయడానికి అవసరం. కానీ కమ్యూనిస్టులుగా మనం అక్కడికే ఆగిపోకూడదు. ఆ అంకెల వెనుక ఉన్న మనుషులనూ, ఆ మనుషుల మధ్య ఉన్న సంబంధాలనూ చూడ్డం నేర్చుకోవాలి. సిద్ధాంతంగా దీన్ని వర్గపంథా, ప్రజాపంథా అంటూ చెప్పడం సులువే. చేయడంలోనే ఉంది అసలు విషయం. ఈ ఉత్పత్తి కార్యకలాపం మీకా విషయాన్ని నేర్పిస్తే మనం ఈ ఆర్.పి.సి.లో ఆ పేదరైతులకు ఈ 15 రోజుల్లో సేవ చేయలేకపోయినా ఒక అర్థంలో విజయవంతం అయినట్టే. ఎందుకంటే మీరు జీవితంలో ఏ రంగంలో పని చేసినా అంకెల్ని అంకెలుగానే కాక వెనుక మనుషుల్ని చూడ్డం నేర్చుకుంటారు. ఇది పార్టీకి ఒక పెట్టుబడే కదూ?' అని ముగించింది సునీల విద్యార్థులను నవ్వుతూ చూస్తూ.

విద్యార్థులలో మిగిలి ఉన్న ఆదుర్దా కూడా దాంతో పటాపంచలైంది. అందరూ చిరునవ్వు నవ్వారు తలూపుతూ. దన్ని, మిగతా గురూజీలూ ఆలోచనలో పడ్డారు. తాము కూడా ఆత్మవిమర్శ చేసుకోవాలన్నట్టుగా దన్ని మాట్లాడబోయింది. సునీల ఆమె ఉద్దేశం గ్రహించి దన్ని చేయి తట్టింది, సరిపోతుంది అన్నట్టుగా. దన్ని కొంచెం సిగ్గుపడుతున్నట్టుగా చిరునవ్వు నవ్వింది.

* * *

చూశారు కదా. ఆ రోజు మేం నేర్చుకున్న విలువైన పాఠం అది. తర్వాత మా బిసిటిఎస్ స్కూలు సమీక్షలో ఉత్పత్తి కార్యకలాపాల సందర్భంగా స్థానిక నాయకత్వం దగ్గరుండి కొంత మార్గదర్శకత్వం ఇస్తే మంచిదనే సూచన చేస్తూనే స్కూలు గురూజీలు, విద్యార్థులు కూడా పేదవారికి ఎక్కువ సేవ అందేలా తాము కూడా కొంత అధ్యయనం చేసి ప్రయత్నించాలి అనీ రాసుకున్నాం.

సమీక్షలన్నీ బాగానే చేసుకున్నాం గానీ ఆ తర్వాత నేను మాత్రం చాలా ఆలోచించాను. నేను ఒక పేదరైతు జీవితాన్ని అనుభవించి వచ్చి కూడా ఆ ఇండ్లవాళ్లు మమ్మల్ని ఎందుకు తీసుకువెళ్లలేదు అనే విషయాన్ని ఎందుకు ఆలోచించలేదు అని చాలా అంటే చాలా తరచి చూసుకున్నాను నా లోపలకు. ఆ వర్గం నుండి రావడం అనేది నా ఆచరణ సరిగ్గా ఉంచుకోడానికి ఒక అనుకూల అంశమే కానీ అదొక్కటే సరిపోదు అనే సత్యం నేను ఆ రోజు తెలుసుకున్నాను. ఇది జీవితాంతం నా వెంటే ఉండి నన్ను హెచ్చరిస్తూ ఉంటుంది అని అనుకుంటున్నాను.

ఇంతే నేను చెప్పేది. అయిపోయింది.

చెప్పాను కదా అంతా విన్నాక మీకు పెద్ద విషయం ఏముంది అనిపిస్తుందని. కానీ రోజువారీ ఆచరణలో ఉన్నవాళ్లకు అర్థం అవుతుంది, బాగా తెలుసు అనుకున్న విషయాలు కూడా ఒకోసారి ఎలా కనబడకుండా పోతాయి అనేది.

ఆ రోజు మీరు కొత్తగా కొండ ఎక్కినప్పటి అనుభవం గుర్తుందా? మనం కొత్తగా కొండెక్కేటప్పుడు మన దృష్టి అంతా పట్టు జారిపోకుండా ఉండడం మీదే ఉంటుంది. మన చూపంతా కిందికే ఉంటుంది. పైకి, పక్కలకూ ఎటూ దాదాపుగా చూడం. అప్పుడు మనకు పట్టు జారిపోకుండా ఎక్కడమే ప్రధానం.

కొత్తగా రోజువారీ పనులు చేసేటప్పుడు మా పని కూడా దాదాపు అలాగే ఉంటుంది. కొండెక్కాక గానీ ఎంత ఎక్కాం, ఎలా

ఎక్కాం అనేది ఆలోచించే పరిస్థితి ఉండదు. అయితే అలా ఎక్కుతూ, ఎక్కుతూ అలవాటు పడ్డాక మనం అన్ని వైపుల నుండీ చూడ్డం నేర్చుకుంటాం. అప్పుడు మన దృష్టి కేవలం జారిపడకుండా ఉండడం మీద ఉండదు. జారిపడకుండా ఎలా ఉండాలో మనకు అనుభవంతో తెలిసిపోతుంది. అయినా పడమా అంటే ఎప్పుడైనా పడే అవకాశమే ఉంటుంది. కనుక ప్రతిరోజూ ఒక ప్రయోగమే, ఒక పరీక్షే. ఏ రోజు తప్పినా జారిపడక తప్పదు.

జారిపడకుండా ఎక్కడం నేర్చుకోకుండా మేం శిఖరాన్ని ఏమాత్రం చేరలేం. అందుకు కొండెక్కడం మొదలుపెట్టడం తప్ప మరో దగ్గరి దారి ఏదీ లేదు. అందుకే మొదటే అన్నాను మా జీవితంలో రోజువారీ పనులు చేయడానికున్న ప్రాముఖ్యత మరి దేనికీ ఉండదని.

మీరిప్పుడు కాసేపు నిద్రపోతే మంచిది. ఉదయాన్నే లేచి ఎవరి దారిన వాళ్లం విడిపోవాలి. మనం విడిపోవాల్సిన సమయం వచ్చేసింది. బిసిటిఎస్ స్కూలు ముగిశాక పార్టీ నన్ను కమ్యూనికేషన్ రంగానికి కేటాయించింది. మాకు శిక్షణా తరగతులు మొదలవుతున్నాయి. కాబట్టి ఇక నేను మీతో ఉండలేను. ఈ ఒక్కరోజును నేను ప్రత్యేకంగా మీతో ఈ విషయాలన్నీ చెప్పాలని అడిగి తీసుకున్నాను. అంతకంటే ఎక్కువ సమయం తీసుకోవడం క్రమశిక్షణ కాదు కదా.

* * *

రండి, మిమ్మల్ని మనం గెంతి వచ్చిన తడిక దగ్గర వదిలిపెడతాను.

ఇప్పుడిక మీరు ఈ చిన్న తడికె మీంచి వెనక్కి గెంతితే మీ అసలు స్థలకాలాల్లోకి వెళిపోవచ్చు. లాల్‌సలాం చేసేముందు ఒక్కక్షణం, కొండెక్కించిందెందుకో చెప్పాలి కదూ.

కొత్తగా కొండెక్కేటప్పుడు ఎలా ఉంటుందో మీకు అర్థం అవుతుందనే కాక మా కథంతా చెప్పడం అయిపోయాక మీకు అప్పుడు చెమట్లు కక్కుతూ కొండెక్కాక ఆ ప్రకృతి దృశ్యాన్ని చూసినట్టుగా అనిపిస్తుందేమో అని ఎందుకో నాకు తోచింది. అందుకని ఆ రోజు స్థలంలో మిమ్మల్ని గెంతు వేయించకుండా ఆ కొండంతా ఎక్కించాను.

క్షమిస్తారో లేదో ఇప్పుడిక మీ ఇష్టం.

లాల్‌సలాం. మళ్లీ కలుద్దాం.

(నా 'ఇద్దరు శస్త్రకారులు' కథ చదివిన వెంటనే 'చాలా యేళ్ల తర్వాత మనసును కట్టిన రచన' అనీ, దాన్ని హిందీలోకి 'తప్పక అనువాదం' చేసే బాధ్యతను కామ్రేడ్ నిత్యకు అప్పగించి, తాను 'దీన్ని తప్పక బంగ్లాలోకి చేస్తా' అంటూ 'ఈ ఒరవడిలో ఈ ప్రజల మహోద్యమాన్ని మరింతగా రికార్డు చేయడం మరవవద్దని కోరుతూ' చిట్టీ రాసి పంపారు కామ్రేడ్ రాంజీ దాదా (కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వర్లు). ఆయన నిర్దేశించిన కర్తవ్యాన్ని ఏ రోజూ మరిచింది లేకున్నా ఆయన కోరుకున్నంతగా నెరవేర్చాల్సే ఉన్నది. ఆయన అమరత్వం తర్వాత 'ఈసారి దండకారణ్య ప్రజల మహోద్యమం గురించి ఏం రాసినా అది మా రాంజీ దాదకే అంకితం' అనుకున్నా మనసులో. అందుకని ఈ 'కొలిమి' ఆ మహానాయకునికే వినమ్రంగా అంకితం).

రచనలకు ఆహ్వానం

అరుణతార అనేక ఇబ్బందుల మధ్యనే విప్లవ సాహిత్య సాంస్కృతిక రంగంలో కృషి చేస్తోంది. విరసం అధికార పత్రికగా ప్రజా ఉద్యమాల పక్షాన నిలబడి ప్రగతిశీల విలువలను నిలబెట్టడంలో సోదర సాహిత్య, రాజకీయ, సామాజిక పత్రికలతోపాటు తన వంతు బాధ్యత నిర్వర్తిస్తోంది. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పెచ్చరిల్లిన ఈ తరుణంలో విప్లవోద్యమంతోపాటు అనేక ప్రజా ధిక్కార స్వరాలు, నిరసనలు, పోరాటాలు వెల్లువెత్తుతున్నాయి. సామాజిక సంబంధాలను, విలువలను, ప్రజా ఆకాంక్షలను పాలకవర్గ విధానాలు ధ్వంసం చేస్తున్నాయి. ప్రజలు తమ వనరుల నుంచి, స్థావరాల నుంచి విస్థాపనకు గురవుతున్నారు. ప్రజల సహజీవన సంస్కృతి మీద దారుణమైన అణచివేత కొనసాగుతోంది. ఆదివాసుల పోరాటాల మీద రాజ్యం అతి పెద్ద స్థాయిలో యుద్ధం ప్రకటించిన సందర్భంలో మనం ఉన్నాం. అణగారిన ప్రాంతాలు, కులాలు, మహిళలు, మత మైనార్టీలు తీవ్ర అభద్రతలోంచే ఆత్మగౌరవం కోసం, న్యాయమైన ఆకాంక్షల కోసం పెనుగులాడుతున్నారు. ఈ సంఘర్షణను తెలుగు సృజనాత్మక సాహిత్యం అద్భుతంగా వ్యక్తీకరిస్తోంది. మారుతున్న ఈ సామాజిక సందర్భాన్ని తెలుగు రచయితలు గతం కంటే శక్తివంతంగా వివిధ ప్రక్రియల్లో ప్రజానుకూల చైతన్యాన్ని ప్రదర్శిస్తున్నారు, సామాజికవేత్తలు విశ్లేషిస్తున్నారు.

ఈ వ్యక్తికరణలకు, విశ్లేషణలకు అరుణతార మరింతగా వేదిక కావాలని మా ఆకాంక్ష. కథ, కవిత్వం, పాట, విమర్శ, పుస్తక సమీక్ష, అనువాదాలతోపాటు విశాల ప్రజా సాహిత్య సాంస్కృతిక రంగంలోని ఏ విషయం మీదైనా రచనలు పంపండి. సాహిత్య, కళా సిద్ధాంత, భావజాలపరమైన వాదాలను, విమర్శలను, వివిధ భాషా సాహిత్యాల్లోంచి ప్రగతిశీల రచనలను అనువాదం చేసి పంపించండి. సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాల మీద, ఉద్యమాల మీద విశ్లేషణలు, నివేదికలు పంపించండి. రాజ్యహింసా రూపాల మీద వ్యాసాలు పంపిండి. అమరులైన ప్రజా ఉద్యమ కార్యకర్తలు, బుద్ధిజీవులు, రచయితలపై స్మృతి వ్యాసాలు పంపించండి.

మీ రచనల వల్లే అరుణతార తాను నిర్దేశించుకున్న సాహిత్య, సాంస్కృతిక కర్తవ్యాలను, ప్రజా ఉద్యమ బాధ్యతలను మరింత శక్తివంతంగా నిర్వర్తించగలుతుంది. మీ రచనల వల్లే పత్రిక ప్రమాణాలు మరింత బలోపేతమవుతాయి. పత్రికలో వస్తున్న రచనల మీద ఎప్పటికప్పుడు అభిప్రాయాలను, విమర్శలను రాసి మా కృషిని మెరుగులు దిద్దండి. అన్ని రకాలుగా మీ నుంచి సహకారాన్ని కోరుతూ...

- సం.

కథ

పెద్దోళ్లు

- పలమనేరు బాలాజి

'ఒక సాకలోదులే, మంగలోదులే, జంగమోదులే, కంసలాయనా లే కుమ్మరాయనా లే, ఎవురి కదుపాత్రం వాళ్లు దేశాంతరం ఎలబారి పోయినంక ఈ ముదనష్టపు పల్లెటూర్లో మిగిలిండేది ఎవరంట' కీచుమంటోంది గుర్రప్ప గొంతు. తడారిపోయిన అతడి గొంతులోంచి వస్తున్న మాటల్లోని నిష్ఠూరం, కోపం, బాధ అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తూనే, ముభావంగా తలాడిస్తున్నాడు రాజగోపాల్.

ఎండధాటికి ఎక్కడా అలికిడి లేకుండా ఉంది. మనుషుల ఉనికి లేకపోవడం వల్ల చాలా ఇండ్లు పాడుబడినట్లు కనబడుతున్నాయి. చాలా వరకు ఇండ్లకు కిటికీలు, తలుపులు మూసి వున్నాయి. గొళ్లెం పెట్టిన తలుపుల మధ్య తుప్పు పట్టిన ఇనుప తాళాలు నిర్జీవంగా వేలాడుతున్నాయి. వీధుల్లో ఎక్కడా మనుషులు కనబడటం లేదు.

'ఈ కొంప ఎవర్దిరా అబ్బోడా... మన బుడబుడక్కల జంగం సీతయ్యదే కదా. గుడిసె సగం పడిపోయిండాది. మిగిలిండేది కూడా ఈ రోజో రేపో కూలి పడిపోయేటట్లుండాది. సంవత్సరం దాటింది గదా వాడు ఊరిడిసి పెట్టి. వాడు పోయిందే అరిష్టం పట్టుకుందనుకుంటా ఈ ఊరికి. వాడొక్కడే కాదులే. కులం పని చేసుకుని బతికే మనుషులు ఒకరన్నా మిగిలిండారేమో... కావల్లంటే ఊరంతా చుట్టి చెప్పు. చేతిలో విద్యని నమ్ముకుని బతికే మనుషులిట్లా తినేతిండికి, తాగే నీళ్ళకి కరువొచ్చిందని కడుపు చేత్తో పట్టుకుని నేలా, గొడ్డూ, గోదా ఈడనే ఇడిసిపెట్టి దేశాంతరం పోయినంక ఈ ఊర్లో ఏం మిగిలిందిరా. ఎవురు మిగిలిండారు. ఊరు ఒకప్పుడు ఎంత పచ్చగా వుండిందో, ఇప్పుడు చూడూ ఎట్లా దిగులు పడిపోయిందో. ఆ మనుషులు పోయినంక అస్సలు ఊరు కళే తప్పిపోయినాది కదరా అబ్బోడా' గుర్రప్ప గొంతు సన్నగా వణుకుతోంది.

రాజగోపాల్ ముఖానికి పట్టిన చెమటను తువ్వాలుతో తుడుచుకున్నాక, మెడచుట్టూ తువ్వాలు వేసి పట్టిన చెమట తుడుచుకుని, పైగుండీలు రెండూ విప్పి చొక్కా వదులు చేసుకున్నాడు. అతడికి నలభై ఏళ్ళు దాటి వుంటుంది. తలలో అక్కడక్కడా తెల్లవెంట్రుకలు తొంగి చూస్తున్నాయి. ముఖంలో మృదుత్వం పోయి చాలా కాలం అయినట్లుంది. ముఖం గరుగ్గా వుంది, చర్మం కమిలిపోయి కనిపిస్తూ వుండటం వల్ల అతడు చూడ్డానికి యాభై దాటిన వాడిలా కనిపిస్తున్నాడు. సన్నగా, పొడవుగా వున్నప్పటికీ చాలా బలహీనంగా దీర్ఘ కాలం జబ్బుపడిన మనిషిలా కనిపిస్తున్నాడు.

గుర్రప్ప వెనుక నాలుగు అడుగుల దూరంలో రాజగోపాల్ తల వంచుకుని మెల్లగా నడుస్తున్నాడు. రాగిమాను దగ్గరకు వచ్చాక గుర్రప్ప ఆగాడు. తువ్వాలుతో చెమట తుడుచుకుని, ఎండిపోయిన పెదవుల్ని నాలుకతో తడుపుకున్నాడు. గుర్రప్పకు అరవై దాటి వుంటుంది. చామనఛాయ, సన్నగా పొట్టిగా వున్నాడు. బట్టతల. రావిచెట్టు కింద రచ్చబండపైన కూర్చుందామనే ఉద్దేశంతో బండను చేత్తో తాకి చూసాడు. చుర్రుమంది. చప్పున చెయ్యి వెనక్కి లాక్కున్నాడు రాజగోపాల్

'అబ్బబ్బ మిడిమాళం ఎండ ఎట్లుండాదో సూడు. బండ కాలిపోతాండాది ఆ పక్క పోదాం పద. ఆ ఇస్కూలు కాడ కూర్చుందాం. పిలకాయలు వుండర్లే. మద్దేన్నం వరకే కదా స్కూలు. ఎండాకాలమని, మద్దేన్నం పిల్లకాయలు నిమ్మళంగా వుండాలని గవర్మెంటోడు ఒక పూట బడి నడిపిస్తావుండాడు. అదే మంచిది అనుకో. అయినా ఈ మిడిమాళం పిలగోళ్ళు యాపొద్దయినా ఇంటి కాడ వుంటే కదా. పోలోమని చింత చెట్ల కింద చేరిపోతారు. వాళ్ళ ఆటలేమో, పాటలేమో వాళ్ళనెవరు పట్టించుకుంటా వుండారు కానీ. ఇంతకు ముందయితే బావుల్లో, చెరువుల్లో, గుంతల్లో, ఏట్లో నీళ్లు కనబడతా వుండేప్పుడు ఈతకైనా పోయేవాళ్ళు. ఇప్పుడు యాడేగానీ నీళ్ళనే మాటే లేదుకదా. తాగేదానికే కడవ నీళ్లు గతిలేకుండా వుంటే ఇంక ఈత కొట్టేదానికి నీళ్లెక్కడుండాయిలే'

ముందు గుర్రప్ప నడుస్తూ వున్నాడు. కాస్త వెనుకగా అతడి మాటలకు తలాడిస్తూ ఊకొడుతూ, అతడ్ని అనుసరిస్తున్నాడు రాజగోపాల్.

వేణుగోపాలస్వామి గుడి దాటారు. పూర్వపు వైభవ చిహ్నాలేవీ అక్కడ లేశమాత్రం కూడా కనిపించటంలేదు. రంగులు వెలసిపోయి గోపురం, ముఖద్వారం కళావిహీనంగా కనబడుతున్నాయి. ధ్వజస్తంభం తాలుకు కొయ్య నెర్రెలు చీలివుంది. గాలి అలికిడే లేకపోవటం వల్ల ధ్వజస్తంభంపైన గంటలు నిశ్శబ్దంగా వున్నాయి. అక్కడ క్షణం నిలబడి, తలపైకెత్తి, నిశ్శబ్దంగా నిలబడి ధ్వజస్తంభాన్ని దాటి ఆకాశంవైపు నిస్తేజంగా చూసి, నిట్టూర్చి నడక కొనసాగించాడు గుర్రప్ప.

'ఎట్లాంటి దేవళం ఎట్టయిపోయినో కదా. టయానికి సరిగ్గా వానలు పడి ఊర్లో పంటలు బాగా పండి, చెరువుల్లో, బోర్లల్లో నీళ్లు పారాడే రోజుల్లో ఎట్లుండేది ఈ దేవళం. ఊర్లో అందరూ ముందుకు పడి తలా ఒక చెయ్యేస్తేనే కదా ఈ దేవళం తయారయ్యింది. పలమనేరు నుండి గోపాలస్వామి అయివోర్ని బలవంతాన రమ్మని చెప్పి ఆ అయివోరికి ఆయన కుటుంబానికే ఒక ఇల్లు కూడా ఏర్పాటు చేసింటిమి. రథసప్తమి ఎంత వైభవంగా వేడుకగా చేస్తా వుంటిమో. చుట్టుపక్కల పల్లెల్నుంచి కూడా జనాలు ఓ.. అని వస్తా వుండిరి. అన్నదానం చేస్తా వుంటిమి. శివాడి నుండి హరికథ చెప్పేదానికి ఆచారిని, ఆయన ఇద్దరు కూతుర్లని పిలిపిస్తా వుంటిమి. స్టేజి మీద ఆచారి ఒక పక్క కూర్చొని హార్మోని వాయిస్తా వుంటే, ఆయన కూతుర్లిద్దరూ మెడలో పూలమాలలు వేసుకొని, నడుముకు వడ్డాణాలు వేసుకొని స్టేజిపైన చకచకా కదులుతూ, ఎగిరిదూకుతూ చిడతలు

కొడుతూ.. హరికథ చెప్తా మధ్య మధ్యలో కుర్రోళ్ళ కోసం సినిమా పాటలు పాడతా వుంటే.. ఎంత హుషారుగా ఈలలేస్తా గంతులెస్తా వుండిరో కుర్రోళ్ళు. పిల్లా పెద్దా అంతా ఎగబడి చూస్తావుండిరి. హరికథ జరిగినంత సేపూ జనం మైమరిచిపోతావుండిరి. నువ్వుకూడా వచ్చిన్నావు కదా. ఇంతకు ముందోసారి' ప్రశ్నార్థకంగా తలతిప్పి చూసాడు గుర్రప్ప.

అవునన్నట్లు తలాడించాడు రాజగోపాల్. అతడు ఈ ఊరివాడే కానీ టౌన్‌కు చేరిపోయి ఐదారేళ్ళవుతోంది. అక్కడే జ్యూస్ ఫ్యాక్టరీలో పనిచేసుకుంటున్నాడు.

వీధి చివర ఉన్నట్లుండి నిలిచిపోయాడు గుర్రప్ప.

ఒంటరి పెంకుటిల్లు. అక్కడక్కడా పెంకులు రాలిపోయి బోసిగా కనబడుతోంది. మూసిన తలుపులు, కిటికీలకు చెదలు పడుతోంది. ఇంటిముందు వసరా. వీధిలోకి కనిపించేటట్లు రేకుపైన రాయబడ్డ బోర్డు, అక్షరాలు కొన్ని చెదిరిపోయి వున్నాయి. రంగు పూర్తిగా వెలసిపోయి వుంది. ఆ రేకుల బోర్డు ఒకవైపు చీలకు తగులుకుని, మిగతా సగం గాల్లో వేలాడుతోంది.

ఎడమచేత్తో ఆ రేకులబోర్డును పట్టుకుని సగం కనబడీ, కనబడని అక్షరాల్ని కూడి కూడి చదివి పైకి 'అంబూరు అన్నాస్వామి టైలర్ అంగడి' అనే పేరును ఉచ్చరించాడు. ఆ బోర్డును ఇంకో వైపు కొయ్యకు తగిలించేందుకు ప్రయత్నించాడు కానీ ఎక్కడా చీల కనబడకపోవడంతో ఆ ప్రయత్నం మాని, నడకను కొనసాగించాడు గుర్రప్ప.

తనలో తాను మాట్లాడుకుంటున్నట్లు, లోలోపలే గొణుక్కుంటున్నట్లుగా ఏదేదో మాట్లాడుతున్నాడు గుర్రప్ప. ఆకు వక్కా బాగా నమిలిన గుర్తుగా అతడి నాలుక ఎర్రగా కనబడుతోంది. వదులవుతున్న పంచెను, విప్పి మళ్ళీ నడుముకు బిగించి కట్టుకొని ముందుకు నడుస్తున్నాడు. ఆ నడకలో ఇది వరకటి వేగంలేదు . నింపాదిగా అతడ్ని అనుసరిస్తూ మాటలు వినబడటం కోసమన్నట్లు తలకొంచెం కుడి పక్కకు, వాల్చి అతడికి పక్కనే ఎడమవైపు నడుస్తున్నాడు రాజగోపాల్ ఇద్దరికీ మళ్ళీ చెమట బాగా పట్టేసింది. రాజగోపాల్ మాత్రం తువ్వాలుతో చెమట తుడుచుకునే పనిలో పడ్డాడు. గుర్రప్ప చెమటను పట్టించుకునే పరిస్థితిలో లేడు.

ఏదో జ్ఞాపకాల్ని అదే పనిగా గుర్తు తెచ్చుకుంటున్న వాడిలా గుర్రప్ప భ్రుకుటి ముడిపడి పోయింది. కళ్ళు వేటినో వెదుకుతున్నట్లు చురుగ్గా కదులుతూ వున్నాయి. గడ్డం మీదుగా జారిపోతున్న చెమట బిందువుల్ని చేత్తోనే తుడిచివేస్తూ మెల్లగా మాట్లాడుతున్నాడు గుర్రప్ప. అతడి కంఠంలో కూడా మార్పు వచ్చింది. ఇది వరకటి పదును, హుషారు తగ్గిపోయాయి. ఆ కంఠం జీరగా వుంది, బలహీనంగా వుంది, దయగా వున్నట్లుంది.

'ఎక్కడ అరవదేశం, ఎక్కడ అంబూరు, ఎక్కడ మిట్టూరు. చెప్పుల ఫ్యాక్టరీలో పనిచేసే దానికి అంబూరుకు పోయిండే కుటుంబాల్లో సుల్తానాను చూసి ప్రేమలో బడి, అడ్నించి మకాం మార్చి ఈడికొచ్చి టైలరింగడి పెట్టుకొని చుట్టుపక్కల పల్లెల్లో ఎవ్వర్నీ టౌన్ వైపుకు టైలర్ పనికోసం పోనీకుండా చేసిన మొగలాయి కదా అన్నాస్వామి. ఎంత తొందర్లోనే తెలుగు నేర్చుకున్నేడో. ఆడోళ్ళకి, మగోళ్ళకి, పిలకాయలకి ఎవురికి ఎట్లా కావల్నో అట్లా గుడ్డలు మట్టసంగా కుట్టిస్తావుండె. ఇద్దరు పిలకాయలు, సుల్తానమ్మ, అన్నస్వామి కుటుంబం కుటుంబమే ఈ పని చేస్తావుండిరి. చీరలుకు అద్దాలు కుట్టేదేమి, రంగుల పూలు వేసేదేమి. అబ్బబ్బ... ఏమి పనితనంరా అబ్బోడా. టౌన్నుంచి కూడా కాలేజి పిలకాయలు, ఆడోళ్లు ఈడికొచ్చి బట్టలు కుట్టుకొని పోతావుండిర్లే. టౌనుకంటే ఈడ రేటు తక్కువని ఒక పక్క పనితనం ఎక్కువని మరో పక్క. పాపం చేతిలో పనుండీ, పదిరూపాయలు సంపాదించే దిక్కు లేకుండా పొట్టపట్టుకుని మళ్ళీ అంబూరుకే పోయినాడో అరవదేశానికో పోయినాడో, ఇంకేడికో పోయినాడో అడ్రస్సు చెప్పేవాళ్ళేరి. పద పద ... ఇంటికో కథ గుండెని పిండేస్తాది. తలుపులు మూసివుండే ఏ ఇల్లు చూసినా గుండె తరుక్కుపోతాది. పద..పద...'

మాటతోబాటే నడక వేగాన్ని కూడా పెంచేశాడు గుర్రప్ప. ఇద్దరూ స్కూలు ముందుకు వచ్చి నిలబడ్డారు. ప్రహరిగోడ అసంపూర్తిగా వుంది. గేటు లేదు. లోపలికి నడిచారు.రంగు వెలసిపోయిన తరగతిగదులు బిక్కుబిక్కుమంటున్నాయి.

'వానల్లేక, పొలం పనులులేక రైతులు దేశాంతరం పోయినంక, కూలి జనం టౌనుకు చేరిపోయినంక ఈ పల్లెటూరి స్కూల్లో సదివేదానికి పిల్లోళ్లు లేక, వుండే ఐదారుమంది పిల్లోళ్ల సంఖ్య స్కూలు నడిపేదానికి సాలదని గవర్మెంటు స్కూలు మూసేస్తావుంది కదా. ఇంక ఆ ఐదారుమంది పిలకాయలు పక్కూరికి నడుచుకొని స్కూలుకి పోలేక ఓగుపట్టిపోతారు. ఈ స్కూలు మళ్ళీ తెరస్తారనే నమ్మకం లేదు. ఊరు పాడుబడిపోయినట్లే స్కూలు కూడా పాడుబడిపోతా ఉండాది. ఈ ఊర్లో స్కూలు మూసేసినంక కొత్తగా పిలకాయలు చదువు నేర్చుకోవాలంటే ఇంక ఖాయంగా టౌనుకు పోవల్సిందే కదా. కాలం ఎట్ల మారిపోయిందో చూడబ్బోడా'. స్కూలు వైపు చూస్తూ నడక ఆపకుండా మెల్లగా అన్నాడు గుర్రప్ప.

స్కూలు ఆవరణలోకి నడిచాక ఇద్దరూ కానుగ చెట్టు నీడలో రాతిబండపైన కూర్చునేసారు.

ఉక్కపోతకి కానుగ చెట్టు నీడ హాయిగా అనిపిస్తోంటే... చొక్కా కాలర్ మెడ వెనక్కు లాక్కుని, మరో రెండు గుండీలు విప్పి చొక్కాను బాగా వదులు చేసుకున్నాడు రాజగోపాల్.

నూలు గుడ్డతో అల్లిన చొక్కా లాంటి బనియన్ అప్పటికే చెమటతో తడిచిపోయి గుర్రప్ప శరీరానికి అతుక్కుపోయి వుంది. పొట్టపై అతుక్కుపోయిన బనియన్‌ను బయటవైపుకు లాగి తల బాగా వంచి నోటితో ఉఫ్‌మని గాలి ఊదుతూ తలను కుడిఎడమలుగా ఆడించాడు. తర్వాత ఎడమ చేత్తో మెడ వెనుక భాగం నుండి, వీపు వెనుక బనియన్‌ను పట్టుకుని వదులుచేసుకున్నాక అతడికి నెమ్మదించింది. ఎండిపోయిన పెదాల్ని నాలుకతో తడుపుకున్నాక 'ఇప్పుడు చెప్పు అబ్బోడా నీ కతేందో. నిమ్మళంగా కూర్చుని మాట్లాడల్ల అంటివే ఏందో చెప్పు. ఇక్కడ నీకు నిమ్మళంగానే వుండాదా. ఇంకేడికన్నా పోయి కూర్చుందామా?' అప్పటికి గుర్రప్ప మొహంలోకి కొద్దిగా నవ్వు వచ్చింది. నవ్వుతూ ఆ మాట అంటున్న గుర్రప్ప వైపు తలతిప్పి చూసి ఎందుకో గబుక్కున లేచి నించున్నాడు రాజగోపాల్.

ఇరవై నిముషాలుగా గుర్రప్ప చెప్పేది వింటూ అన్యమనస్కంగా

తలాడిస్తూ, ఊకొడుతూ నడుస్తూ వచ్చాడే కానీ నోరు తెరచి ఒక్క మాట కూడా మాట్లాడలేక పోయాడు రాజగోపాల్.

బుడబుక్కల జంగం సీతయ్య ఇంటి కథా రాజగోపాల్‌కు తెలుసు. పాడుబడిపోతున్న దేవాలయం సంగతీ తెలుసు. అంబూరు అన్నాస్వామి టైలర్ కథా తెలుసు. ఊర్లోంచి పట్నాలకు చేరిపోయిన పల్లెటూరి జనం కథా తెలుసు. చాలినంతమంది పిల్లలు లేరనే కారణంతో ఏకోపాధ్యాయ పాఠశాలల్ని మూసేస్తున్నారనే వాస్తవమూ తెలుసు. అయినా అప్పుడే కొత్తగా వింటున్న వాడిలా తెలియని విషయాల్ని ఆసక్తికరంగా వింటున్నట్లు మొహం పెట్టుకున్నాడు. కానీ... లోలోపల ఎందుకో అతడు కుమిలి పోతున్నాడు.

మెల్లమెల్లగా బాధ కడుపులోపల్నుంచి తన్నుకొచ్చేసరికి ఇక తమాయించుకోలేకపోతూ, భోరుమన్నాడు. ఉన్నఫలంగా అట్లా రాజగోపాల్ ఏడుపు మొదలు పెట్టేసరికి గుర్రప్ప కంగారు పడిపోయాడు. ఇది అస్సలు అతడు ఊహించని పరిణామం కావటంతో ముందు బిత్తరపోయాడు.

దిగ్గున రాతిబండపైనుండీ లేచి నిలబడే ప్రయత్నం చేశాడు. ఉన్నట్లుండి అట్లా చప్పున లేచేసరికి మోకాళ్ళు రెండూ కలుక్కుమన్నాయి. నొప్పికి తట్టుకోలేక 'అమ్మా' అంటూ మోకాళ్ళను రెండు అరచేతుల్తో పట్టుకుని గట్టిగా ఒత్తుకుంటూ, గబాలున మళ్ళీ బండపైన కూర్చునేసాడు.

అతడి బాధ చూసాక రాజగోపాల్ బలవంతాన తన ఏడుపు ఆపుకుంటూ 'ఏమైంది పెద్దయ్యా. మోకాళ్ళ నొప్పులు ఎక్కువైనాయా?' ఆదుర్దాగా అడిగాడు.

'పదేళ్ళుగా ప్రాణం తీస్తా వుండాయి కదా ఈ మోకాళ్ళ నొప్పులు. ఎన్ని చేసినా పసర్లు, ఆకులూ, అలుములు నాటు వైద్యానికి ఈ నొప్పులు ఎక్కడ తగ్గతాయిలేరా. ఇంగ్లీషు మందులు వాడల్లంటే ఉండే రెండెకరాలు అమ్ముకోవాల్సిందే. ఏదో మా తాత నేర్పించిన నాటు వైద్యం పుణ్యమా అని ఇట్లా లాక్కుని వచ్చేస్తా వుండానంతే. మొండి ప్రాణం కదా నాది' గుర్రప్ప గొంతులో బాధతో బాటు ఏదో తెగింపు కనబడుతోంది.

రాజగోపాల్ మళ్ళీ బండపైన కూర్చునేసాడు. ఈ సారి గుర్రప్ప పక్కలో కాకుండా గుర్రప్పకు ఎదురుగా కూర్చున్నాడు. కొన్ని క్షణాల విరామం తర్వాత రాజగోపాల్ గొంతు సవరించుకొని తలగోక్కుంటూ తనలో తాను మాట్లాడుకుంటున్నట్లుగా, ఏదో పలవరిస్తున్నట్లుగా లోగొంతుతో మొదలు పెట్టాడు.

* * *

నిద్రలో ఎందుకో ఉలిక్కిపడి లేచాడు గుర్రప్ప. గోడకు తగిలించిన క్యాలండర్‌లోని కాణిపాకం వినాయకుడ్ని భక్తిగా చూస్తూ మెల్లగా కళ్ళు తెరిచాడు. అప్పటికి ఉదయం ఐదు దాటింది సమయం.

ఇంట్లో ఏ అలికిడీ లేదు. వీధి తలుపు ముందుకు లాగివుంది. బయట నుండి తలుపు గొళ్ళెం పెట్టి, మంచినీళ్ళు తేవటానికి ఎటో వెళ్ళినట్లుంది గోవిందమ్మ.

కళ్ళు మూసుకొని ఆలోచనల్లోకి జారుకున్నాడు గుర్రప్ప.

నీళ్ళకు తెల్లవారుజామున ఎప్పుడెళ్ళిందో ఏమో? ఎంత దూరం పోయిందో, ఎక్కడికని పోయిందో.. అర్ధరాత్రి దప్పిక అనిపించి లేచి కూచుంటే... రెండు కడవల్లో సుక్క నీళ్ళయినా కనపడకపాయ. పగలంత కాయకష్టం చేసి పడుకున్నెట్లుంది. అదమరచి గురకపెట్టి నిద్రపోతాండే పెండ్లాం నడ్డిపైన కాలెత్తి తన్నగానే నిద్రలోంచి ఉలిక్కిపడి లేచి కూచుంది.

'ఏందయ్యా. ఏం కావల్ల. ఎందుకట్లా అర్ధరాత్రి కూతలు పెడతావుండావు?' నిద్రమత్తు ఎగిరిపోయి అయోమయంగా అడిగింది గోవిందమ్మ.

'గొంతు పట్టుకుపోతాండాది కదే. గ్లాసుడు నీళ్ళయినా కొంపలో లేదంటే పొద్దంతా నువ్వు ఏం సేద్యం చేసి అలసిపోయిండావే ముండా? ఇంట్లో మొగోడు తాగేదానికి గ్లాసుడు మంచినీళ్ళయినా లేకుండా ఏం ముండమోపి సంసారం చేస్తాండావే' విసుక్కున్నాడు తను.

'అయ్యో ఏందయ్యా తాగుబోతోడి మాదిరి లెక్కాపక్కా లేకుండా మాట్లాడతావుండావు. నువ్వూ చూస్తానే వుండావు కదా. ఊర్లో ఏడేగానీ నీళ్ళనేమాటే లేదు. దూరంగా పొలాలకాడికి పోయి రైతుల దగ్గర కన్నమాట్లు అనిపించుకొని మైళ్ళకు మైళ్ళు నడిస్తే బిందె, రెండు బిందెల నీళ్ళు తెచ్చేదానికి ప్రాణం పోతావుండాది. ఊర్లో ఎంతమంది మొగోళ్ళుండారో. ఎవ్వరేగానీ ఎండివో దగ్గరికో, సర్పంచు దగ్గరికో పోయి కొత్త బోరు వేయించేదానికిలే. మళ్ళీ ఏమైనా అంటే మొగతనమంతా ఇంట్లో ఆడోళ్ళపైన చూపించేదానికే సరిపోతుంది'. ఎప్పటినుండి అడగదలచుకున్నదో కానీ గోవిందమ్మ గొంతు పదునుగానే పలికింది దాంతో మాటా మాటా పెరిగింది.

ఆ గొడవ మరి కాస్సేపు కొనసాగిన తర్వాత ఇద్దరూ మొహాలు గంటుపెట్టుకొని పడుకున్నారు.

తలుపు చప్పుడవడంతో కళ్ళు తెరిచాడు గుర్రప్ప. చంకలో బిందెతో గోవిందమ్మ గసపోసుకుంటూ లోపలికి వచ్చింది. గుర్రప్ప లేచి వదులైన పంచె విప్పి మళ్ళీ గట్టిగా బిగించి కట్టుకొని కళ్ళు నులుపుకుంటూ బిందె అందుకోవటానికన్నట్లు చేతులు చాపాడు.

'భార్యకి సాయం చేయడమంటే చీకట్లో తోడురావడం లేదా ఆడదాని కష్టాన్ని అర్థం చేసుకోవడం. అంతేగానీ ఇంటికాడికి మోసుకొచ్చిన బిందెను దించుకోవడం కాదు మొగతనం'. రాత్రి తాలూకు బాధ ఇంకా ఆమె గొంతులో ధ్వనిస్తూనే వుంది. ఈసారి గుర్రప్పకు కోపం రాలేదు. బాధ అనిపించింది. ఆమె చెప్పింది నిజంకదా అనిపించింది. ఎట్లాగైనా ఊర్లో నీళ్ల సమస్య తీర్చే దానికి సర్పంచి దగ్గరికో, ఎంపిడిఓ దగ్గరికో జనంతో వెళ్ళి, గట్టిగా నిలదీస్తేనే కదా సమస్య తీరేది అనిపించింది.

భార్య అందించిన అర గ్లాసు నీళ్ళు గటగటా తాగేశాడు. అప్పటికి ప్రాణం నెమ్మదనిపించింది.

'ఏమ్మే... నాకు మాత్రం బాధగా వుండదా ఏదో కోపంలో రాత్రి అట్లా తిట్టేసాను కానీ. నా ప్రయత్నాలు నేను చేస్తానే వుండాను. సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పీటీసీ, ఎంపిపీ వేరే వేరే పార్టీలకీ, వేరే వేరే గ్రూపులకి, వేరే వేరే కులాలకి చెందినోళ్ళు. మనూర్లో ముక్కాలుభాగం ఉండేది మనకులమోల్లే కదా. అందుకే మనూరికి నీళ్లు ఇయ్యాలంటేనే పైకులమోళ్ళు ఏడుస్తావుండారు. తాగే నీళ్ళకు కూడా కులమే ముఖ్యమైపోతావుండాది, అడ్డమైపోతా వుండాది. ఊర్లో ఏ పని

చేయాలన్నా అడుగడుగునా రాజకీయాలు అడ్డుపడుతానే వుండాయి. ఆడోళ్ళకి అవ్వంతా అర్థంకావు. మాకే ఈ గ్రూపు రాజకీయాలు అర్థంకావడంలే. అందరూ మనోళ్ళేనంటారు. కానీ పనికాడికొచ్చేసరికి కులాలు, ఊర్లు వేరువేరైపోతాయి. గ్రూపులు ముఖ్యమైపోతాయి. ఒకపనిచేయాలంటే ఒకప్పుడు ఎవరో ఒకర్ని నాయకున్నో, ఆఫీసర్నో పట్టుకుంటే పనైపోతావుండె. ఇప్పుడట్లా కాలం కాదు కదా. ఒక పని ఒకడు చేసే దానికి ముందుకొస్తే ఆ పని వాడు చేస్తే వానికి ఎక్కడ పేరు వస్తుందోనని వాడా పని చేయకుండా అడ్డుకునేదానికి మిగతా నాయకులు రెడీ అయిపోతారు. వాళ్ళయినా ఆ పని చేస్తారా అంటే అదీలే. వాళ్ళ విలువను గుర్తించి వాళ్ళ ముడ్డి చుట్టూరా పది తూర్లు తిరిగితేగానీ వాళ్ళకు మన బాధలు అర్థంకావు. ఒకరితో చెప్పి పనులు చేసుకొనే కాలం కాదిది. కులానికో నాయకుడు చాలడు, ప్రతి కులంలో ప్రతి పార్టీకి ఒకరిద్దరు నాయకులుంటారు. ఈ గ్రూపు రాజకీయాలతోనే ఊరు నాశనమైపోతావుంది. ఎప్పుడూ లేంది కులానికి ఇంత గుర్తింపు వచ్చేసిందాది. కులాల వారిగా ఓట్లు చీలిపోతావుండాయని ఎన్నికల్లో కులమే గెలిపిస్తావుందని నాయకులకి గట్టి నమ్మకం. అదే ఇప్పుడు అందరి కొంపా ముంచుతా వుండాది. చూద్దాం రేపైనా ఊర్లో అందర్నీ కలిపేదానికి గట్టి ప్రయత్నం చేస్తాను. ఎంత వరకూ కలిసొస్తారో, ఎంత మంది వస్తారో తెలీదు. అయినా నా ప్రయత్నం నేను చేస్తానమ్మే '. సంజాయిషీగా, సమాధానంగా, అనునయంగా చెప్పుకొచ్చాడు గుర్రప్ప.

మెడపైన పట్టిన చెమటను చీరకొంగుతో తుడుచుకొని, అరగ్లాసు నీళ్లు తాగబోయి ఎందుకో వద్దనుకొని అందులో సగమే తాగి, మిగతా సగం నీళ్ళను బిందెలోనే ఒంపి మొగుడివైపు ప్రసన్నంగా చూస్తూ 'అదీచూస్తా . రేపు గాకపోయినా వారంలో అయినా నీళ్ళ సమస్య తీరితే అంతేచాలు'. అంది గోవిందమ్మ.

* * *

ఆ రోజు శుక్రవారం, విదియ.

కుమ్మరోళ్ళ నారాయణస్వామి ఊర్లో మొదటిసారి దిగువ వీధిలో టీ అంగడిని ప్రారంభించాడు. వీధి చివరన ఉండే పెంకుటింటి ముందు పందిరి వేయించాడు. రెండు అరటి మాన్లు నాటించి, మామిడి తోరణాలు కట్టించాడు. రెండు చెక్క బెంచీలు, ఆరు చెక్క స్టూల్లు వేయించాడు. అతడి భార్య నాగరత్నమ్మ గల్లా పెట్టె ముందు ఇనుప కుర్చీ వేసుకొని కూర్చుంది. రెండు తట్టల్లో బీడీలు, సిగిరెట్లు, అగ్గిపెట్టెలు, తమలపాకులు, వక్కలు, సున్నం పొట్లాలు, దుగ్గు పెట్టుకొని చిన్న సైజు చిల్లర దుకాణాన్ని ప్రారంభించింది.

మర్యాదకి సర్పంచు నారాయణ రెడ్డి, ఎంపిటిసి సభ్యుడు నరేంద్ర రెడ్డిని, కృష్ణారెడ్డి, మునికృష్ణయ్య, గుర్రప్ప లాంటి ఐదారు మందిని అదేపనిగా ఐదారుసార్లుగా పిలవడం వల్ల అందరూ పూజ సమయానికి వచ్చేసారు.

టీ అంగటి ముందు చెక్క కుర్చీలో వెంకటేశ్వరస్వామి పటాన్ని ఉంచారు. గ్లాసు నిండా ఇసుక నింపి, వెలిగించిన సాంబ్రాని కడ్డీలని అందులో ఉంచారు. పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టిన కొబ్బరికాయల్ని సర్పంచు ఎంపిటిసి సభ్యుడు కొట్టాక ఆ ఊర్లో దిగువ వీధిలో మొదటి టీ అంగడి అట్లా మొదలైంది. ఉదయంపూట ఇడ్లీలు, దోసెలు, సాయంత్రాలప్పుడు వడలు, బోండాలు, మురుకులు, నిప్పట్లు, మిరపకాయ బజ్జీలు దొరుకుతాయని అటుగా వచ్చిన వాళ్ళందరికి అదే పనిగా చెబుతోంది నాగరత్నమ్మ.

'డ్వాక్రా గ్రూపు డబ్బులతో అంగడి పెట్టినారు కాబట్టి నాగరత్నమ్మ పేరే పెట్టల్ల కదా' అన్నాడు సర్పంచ్ మాట వరసకి నవ్వుతూ.

'పొదుపు సంఘాల పుణ్యమా అని ఆడోళ్ళకైనా లోన్లు ఇస్తావుండాయి బ్యాంకులు. రైతులకన్నా ఆడోళ్ళ పనే మేలు కదా. వాళ్ళ పరపతే ఇప్పుడు ఎక్కువ యాడ చూసినా'. అన్నాడు ఎంపిటిసి హుషారుగా నవ్వుతూ.

'కుందలకన్నా బాగా కుదురుగా ఇడ్లీలు, టిఫిన్లు చేస్తావుండాదని మంచి పేరు తెచ్చుకోవల్ల నారాయణస్వామీ' దర్పంగా అన్నాడు కృష్ణారెడ్డి.

వాళ్ళ మాటలకి నవ్వుతూనే తలాడించారు భార్యాభర్తలిద్దరూ. వాళ్ళ మొహాలు పైకి నవ్వుతూనే కనబడుతున్నా వాళ్ళ బాధేదో మాటల రూపంలో రాలేక లోపలే కొట్టుమిట్టాడుతున్నట్లు అనిపించింది గుర్రప్పకి.

'కులాలదేముండాదన్నా. కుల వృత్తుల్ని విడిచి, టౌన్‌లో హోటళ్ళు, జిరాక్సు మిషన్లు, వైరింగ్ షాపులు, టైలరింగ్ షాపులు, చిల్లర అంగళ్లు పెట్టుకొని మనుషులు కడుపాత్రం వాళ్ళకు వచ్చిన పనేదో వాళ్లు చేసుకుంటా బతికేస్తావుండారు కదా. ఇప్పుడు కులాల పేరు చెప్పుకొని పల్లెల్లో బతకలేం కదా' అన్నాడు గుర్రప్ప టీ తాగుతూ.

ఆ మాటతో సర్పంచ్, ఎంపీటీసీ మొహాలు కళ తప్పాయి. గుర్రప్ప మాటలు వాళ్ళకు ఎంత మాత్రం రుచించలేదని వాళ్ళ మొహాలే చెబుతున్నాయి. ఏదో చెప్పబోయి ఎందుకో మళ్ళీ ఆ ప్రయత్నం మానుకున్నాడు ఎంపీటీసీ సభ్యుడు.

'కులమనేదే లేకపోతే మనిషికి గుర్తింపు యాడుంది. కులమే లేకపోతే మనిషికి మర్యాద ఎట్లుంటుంది. ఎంత సంపాదించినా, ఎంత వెనుకేసినా, రాజకీయాల్లో ఎంత పెద్ద పదవిలో కూర్చున్నా మనిషికి కులాన్ని బట్టే గుర్తింపు, విలువ వుంటాయి. కులాన్ని కాదని మనిషిని ఊరు గుర్తించదు. అంతెందుకు ఓట్లు కూడా కులాన్ని బట్టే కదా చీలతావుండాయి. తన కులమోళ్ళ ఓట్లే కదా ఎవర్నైనా గెలిపిస్తాయి'. ఖాళీ అయిన టీ గ్లాసు పక్కలో పెడుతూ అన్నాడు సర్పంచు.

ఆ మాటలు పొడిగిస్తే ఎక్కడికి వెడతాయో, ఎందుకనుకొని మాట మార్చాడు గుర్రప్ప. 'ఇప్పటికే చాలా తూర్లు మీకు, ఎండీవోకు చెప్పినాం. ఈ దినమన్నా మంచి రోజు కదా. నీళ్ల కథ చూడకూడదా. మీకు పుణ్యాం వుంటుంది. ఆడోళ్ళు దూరంగా పొలాల కాడికి పోయి నీళ్లు తెచ్చుకుంటా వుండారు. బోరు ఎండిపోయినంక, మళ్ళీ కొత్తబోరు వేసేదానికి మూడునెల్లలైనా ఇంకా తీరుబాటు కాలేదంటే మనకే నగుబాటు కదా'.

గుర్రప్ప మాటలతో సర్పంచు, ఎంపీటీసీ అక్కడి నుండి లేచి నిలబడ్డారు.

'బోరంటే మాటలా. డబ్బులు కావల్ల. గవర్నమెంటుకి అర్జీ పంపినాం. అద్నుంచి డబ్బు రావల్లకదా. నువ్వూ, నేను అనుకుంటే బోరు వస్తుందా. పెద్దోళ్ళ వ్యవహారం కదా. మీ కులమోళ్ళంతా నా

చుట్టూ చేరి నన్ను ఆడిపోసుకునే బదులు నీళ్ళు కావల్లని పైనుండే పెద్దోళ్ళ దగ్గరికి ఏ ప్రొద్దైనా ఎలబారిపోయినారా. అది కూడా నేనే చెప్పల్నా. కాలాన్ని బట్టి మనుషులు మారతావుండల్ల. ఇష్టమున్నా లేకపోయినా అధికారంలో ఎవరుంటే వాళ్ళ దగ్గరికి ఎలబారిపోవల్ల. మన పనులేదో అడుక్కొని కాళ్ళో, చేతులో పట్టుకొని నేగ్గా చేసుకోవల్ల. నువ్వు వయసులో నాకంటే పెద్దోడు. నీకు ఇంతకంటే విలావిరిగా ఇంక చెప్పలేను. నేను కూడా బయట అన్నీ మాట్లాడేదానికి లేదు. నీకు అర్థమౌతుందనుకుంటా పెద్దయ్యా. వస్తాను టౌన్ దాకా పోయి రావల్ల. అర్జెంటు పనుండాది'. ఆ మాట అని గుర్రప్ప జవాబు కోసం ఎదురుచూడకుండా నారాయణస్వామికి వెళ్ళొస్తానని చెప్పి సర్పంచు కదిలాడు. అతడి వెనుకే వెళ్ళొస్తానంటూ ఎంపిటిసీ సభ్యుడు కూడా కదిలాడు.

వాళ్ళు వెళ్ళినవైపే తెరిపారా చూస్తూ వాళ్ళు వీధి మలుపు తిరిగేంతవరకూ తల తిప్పలేదు గుర్రప్ప. ఖాళీ అయిన అద్దం గ్లాసుల్ని కడిగి పెడుతూ 'ఈ అద్దం గ్లాసుల్ని కడగాలంటే నీళ్లు తేవడం నా వల్ల కాదబ్బా. నా మాటిని పేపర్ కప్పులు తెచ్చుకో. అంతగా లేదంటే తాగేదానిక్కూడా నీళ్ళ ప్యాకెట్లు తెప్పించి పెడదాం. ఊరికే తాగేదానికి నీళ్లు ఇయ్యలేం. దానిపై నీ ఇష్టం ఏమంటావ్ మామా'. మొగుడి వైపు నుండీ తల తిప్పి గుర్రప్ప వైపు చూస్తూ అంది నాగరత్నమ్మ.

సమాధానంగా తలాడించాడు గుర్రప్ప. నారాయణస్వామి తల తిప్పి గుర్రప్ప వైపు తదేకంగా చూస్తూ 'చూస్తివా పెద్దయ్యా ఎన్నికలప్పుడు అయిపోయిండే గొడవల్ని కూడా గుర్తు పెట్టుకొని మాట్లాడతావుండాడు సర్పంచు. ఆయప్పకి ఆయప్ప కులం కావల్ల. మనకి మాత్రం మన కులం వద్దనుకుంటామా యాడన్నా. అది ఆ యప్పకీ తెలుసు. అయినా తెలీనట్లు, ఏమీ అర్థం కానట్లు ఏదేదో మాట్లాడతాడు. ఉన్నీలే. కాలమంతా ఇట్లే ఉంటుందా. మనకీ మంచిటైం వస్తుంది. అంతేగానీ మనం ఆ పెద్దోళ్ళ కాడికి పోయేదీవద్దు, వాళ్ళిచ్చే నీళ్లూ వద్దు. ఎన్ని దినాలు జరగతాదో అదీ చూద్దాం. అంతగా అవసరమైతే మనమే కలెక్టర్ దగ్గరికి పోదాం. అంతేకదా..' అన్నాడు.

ఆ మాటతో సర్రున లేచింది నాగరత్నమ్మ. ఆమె మొహంలో కోపం, విసుగు కనపడుతోంది. 'మీ రాజకీయాలకు ఆడోళ్ళ ఉసురు తీకండి. మీకు పుణ్యముంటుంది. కులం, గిలం పక్కనబెట్టి పంతాలు వదిలి జరిగే పని చూడండి ముందు. ఇట్లాగే కులాల పేర్లు చెప్పుకొని ఎప్పుడో జరిగిండే గలాటాలు మనసులో పెట్టుకుంటే ఒక్క పనికూడా జరగదు. వయసు పిలకాయలు గానా దీంట్లోకి దిగినారంటే ఇంకా గబ్బు గబ్బు అయిపోతుంది, గలాటాలు పెద్దవైపోతాయి. మొత్తంపైన వాళ్ళిద్దరూ ఏందో తిరకాసుగానే మాట్లాడతావుండారు. అంత కానిపని మనమేం చేసినాం. అదే ఆలోచిస్తావుండా. మీకేమైనా అర్థమైందా వాళ్ళ మాటలు'.

ఆమె మాటలతో ఉలిక్కిపడ్డాడు గుర్రప్ప. ఆమె వైపు ఆశ్చర్యంగా, ప్రశంసాపూర్వకంగా చూస్తూ 'నిజమేనమ్మా నీ అనుమానం. వీళ్ళ బాధంతా మన రాజగోపాల్ గురించే'. ఆమె అనుమానాన్ని నివృత్తి చేసే ప్రయత్నం చేశాడు గుర్రప్ప.

'నాకు తెలుసులేన్నా. అందుకే అడిగినా. నాకు తెలీదని నువ్వు అనుకుంటా వుండావు. ఇట్లా విషయాలు ఏదైనా ముందు ఊర్లో ఆడోళ్ళకే తెలుస్తాయి. మళ్ళీనే మొగోళ్ళ దాకా వస్తాయి. అదికూడా మేం చెప్తేనే. రాజగోపాల్ కూతుర్ని ఇష్టపడతావుండాడంట కదా సర్పంచు నారాయణ రెడ్డి వాళ్ళ అన్నకొడుకు జనార్ధన్ రెడ్డి. మొన్న కాలేజీలో కూడా ఏదో గలాటా అయిందంటనే. ఈడ మాట్లాడితే ఊరంతా తెలిసిపోతుందని పంచాయతీ టౌన్‌లో పెట్టారంటనే. రాజగోపాల్‌నికూడా హెచ్చరించారంట కదా'. గుర్రప్ప నోరు తెరిచే పనిలేకుండానే తనే వివరాలు చెప్పుకొచ్చిన నాగరత్నమ్మవైపు గుర్రప్ప నోరు తెరుచుకొని చూస్తుండిపోయాడు. అతని మొహంలో ఆశ్చర్యం కొట్టొచ్చినట్లు కనపడుతోంది.

ఈ విషయాలన్నీ తెలిసినట్లే ఉన్నాయి కాబట్టి నారాయణ స్వామి మధ్యలో ఏమీ జోక్యం చేసుకోలేదు. నవ్వు మొహంతో గుర్రప్పవైపు చూస్తూ 'పెద్దయ్యా రాజగోపాల్‌కి ఏం సలహా చెప్పినావ్. ఇంతకీ ఏం చేద్దామనుకుంటా వుండావ్. ఇది తమాషా విషయం కాదు. ఒక్క సారిగానా తగ్గినామంటే బతుకంతా తగ్గి ఉండాల్సి వస్తుంది. ఇప్పుడు గానా జాగ్రత్త పడలేదంటే మన బలమేందో వాళ్ళకి చూపించకపోతే ఇంకా చాలా అవమానాలు పడాల్సి వస్తుంది. ముందు ముందు సమస్యలు లేకుండా ఉండాలంటే ఇప్పుడు అందురూ కూర్చొని ఒక మాటపైన నిలబడి ఏదో ఒక గట్టి నిర్ణయం తీసుకోవాల్సిందే. లేదంటే మనం బాధ పడేది కాకుండా మన పిలకాయలు కూడా బాధపడాల్సి వస్తుంది. ముందు కాలం నుండి మనం పెద్దోళ్ళు పెద్దోళ్ళని మర్యాద ఇచ్చుకుంటా మంచిగా ఉంటా ఉన్నాం. అంత మంచితనం ఈ కాలంలో పనికిరాదని అర్థమైపోతానేవుండాది. మనలాగానే మన పిల్లోళ్లు కూడా అణిగిమనిగీ ఉండాలంటే అది కుదిరేపనికాదు. పిలకాయల్ది ఉడుకురక్తం. అది గుర్తుంచుకో. మన కులంలో కూడా పెద్దోళ్ళుండారు. మండలస్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో, జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో మనకీ అంతో ఇంతో పరపతి ఉండాది. మనకుండే పెద్దోళ్ళు మనకూ వుండారు ఏమంటావు'.

నారాయణ స్వామి మాటలతో గుర్రప్ప మొహంలో కలవరం మొదలైంది. తలగోక్కున్నాడు. తలతిప్పి నాగరత్నమ్మవైపు చూశాడు. ఆమె మొహంలో ఏదో తెగింపు కనపడుతోంది. మళ్ళీ తల తిప్పి నారాయణ స్వామి వైపు చూశాడు. అతడి మొహంలో కూడా ఏదో తెగింపు కనబడుతోంది. ఇద్దరి మొహాలు ఉద్రిక్తంగానే ఉన్నాయి.

వాళ్ళిద్దరూ కూడా ప్రశ్నార్థకంగా గుర్రప్పవైపే చూస్తూ వున్నారు. ముందురోజు మధ్యాహ్నం హృదయ విదారకరంగా రాజగోపాల్ ఏడ్చిన ఏడుపు గుర్తొచ్చింది. ఎన్ని మాటలు అనిపించుకున్నాడో. ఎంత అవమానపడ్డాడో. తక్కువ కులంలో పుట్టడం నా కూతురి తప్పా అని కుమిలిపోయాడు. చివరిగా అతడు తనను అడిగిన ప్రశ్న చప్పున గుర్తుకొచ్చింది గుర్రప్పకు.

'...అయినా పెద్దయ్యా నాకు తెలియకుండా ఒక మాట అడుగుతాను. కాలం మారే కొద్దీ, చదువు, నాగరికత, సంపద పెరిగే కొద్దీ కులాల మధ్య అంతరాలు తగ్గిపోతున్నాయా? లేక రాన్రానూ కులాలు అంతకంతకూ ఎక్కడికక్కడ బలపడుతున్నాయా?'.

సిరాజ్

- సాదత్ హసన్ మంటో
అనువాదం: ఆర్.శశికళ

నాగ్‌పరా పోలీస్ పోస్ట్ ఎదురుగా ఓ చిన్న పార్క్, ఆ పక్కనే ఇరానీ టీ కొట్టు ఉండేది. ఛోండూ ఆ పరిసరాల్లోనే ఎప్పుడూ కన్పడేవాడు. విటుల కోసం ఎదురుచూస్తూ అక్కడున్న దీప స్తంభానికి ఆనుకుని ఉండేవాడు. సాయం సమయంలో అక్కడికి చేరుకొని ఉదయం నాలుగు గంటల వరకూ తన వృత్తిలో గడిపేవాడు.

అతని పేరేంటో ఎవరికీ తెలీదు. కానీ వెతికి పెట్టొంటాడు కనుక 'ఛోండూ' అని పిలిచేవారు. అతని వద్దకు వచ్చే విటులు ఆశించిన రీతిలో మహిళలను సమకూర్చేవాడు.

గత పదేళ్ళుగా ఈ పనిలోనే ఉంటున్నాడు. అతనికి వందలాది స్త్రీలు పరిచయం. మతం, జాతి, వర్గం, స్వభావం లాంటి తేడాల్లేవు. ప్రతి ఒక్కరితో అనుబంధం ఉండేది.

ఇరానీ టీకొట్టు ఎదురుగా ఉన్న దీప స్తంభానికి వేలాడుతూ ఉండేవాడు. అది సరిగా నాగ్‌పరా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఎదురుగా ఉంది. ఆ దీప స్తంభం అతని కార్యకలాపాల చిరునామా అయింది. నేను అటు వెళుతున్నప్పుడు ఛోండూ కోసం చూస్తున్నట్టుగా అన్పించేది. తలకు తైలం పూసుకొని వక్కాకు నములుతూ ఎలాగో ఉండేవాడు.

ల్యాంప్ పోస్ట్‌లా ఛోండూ కూడా పొడుగ్గా ఉండేవాడు. అనేక దిశల నుండి విద్యుత్ తీగలు అక్కడి భవనాల మీదుగా వేలాడుతూ, ఇతర ల్యాంప్ పోస్టులను కలుపుతూండేవి.

టెలిఫోన్ విభాగం కూడా చిన్న టర్మినల్‌కు అనుసంధానిస్తూ ఆ ల్యాంప్ పోస్ట్‌కే కలపబడి ఉంది. సాంకేతిక నిపుణులు అప్పుడప్పుడూ పరీక్షిస్తుంటారు. ఛోండూ కూడా అతని కస్టమర్లకు కావాల్సిన మహిళలను సమకూర్చే ఒక రకమైన టర్మినల్. ఆ నగరంలోని బడా మనుషులు, స్థానికుల లైంగిక అవసరాలు అతనికి తెలుసు.

ఈ వృత్తిలోని అనేక రకాల స్త్రీలు, వారివారి శరీర ధర్మాలు, స్వభావాలు, ఏ విటుని ఏ స్త్రీ సంతృప్తిపరచగలదో ఛోండూకు బాగా తెలుసు. కానీ సిరాజ్ మాత్రం అతనికెప్పుడూ అంతుబట్టదు. అతనికతీతం. ఆమె లోతుపాతులేంటో తనకు తెలియదని ఛోండూ నాతో చెప్పుండేవాడు. 'మంటో సాహెబ్! ఆమె ఓ వెర్రిబాగుల్ది. నేను బాగు చేయలేను. అటువంటి పిల్లను నేనింతవరకు చూల్లేదు. మారిపోతూంటుంది. ఒక్కొక్కప్పుడు సంతోషం, అంతలోనే ఏడుస్తుంది. ఎవరితోనూ సక్రమంగా ప్రవర్తించదు. ఆమెను కోరే ప్రతి విటునితో ఆమె పోట్లాడుతుంది. కొన్ని వేల మార్లు తమాయించుకోమని అడిగాను. కానీ ఎటువంటి ఫలితం లేదు. ఎక్కడి నుండి బొంబాయికి వచ్చిందో అక్కడికే వెళ్ళమన్నాను. మీరు ఆమెను చూశారా? మంచి దుస్తుల్లేవు, పైసా చేతిలో లేదు, నేను తీసుకొచ్చిన మగవారితో ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించేది. చాలా చాలా మొండిది.'

మొదటిసారి నేను క్లేర్ రోడ్‌లో ఆమెను చూశాను. చూపులు తిప్పుకోలేకపోయాను.. బక్కపలచగా అందంగా ఉంటుంది. కోల ముఖం, పెద్దపెద్ద కళ్ళు. ఆమె కళ్ళను కాసేపు చూడకపోతే బాగుంటుంది. అపుడు అమ్మాయిని సరిగా చూడొచ్చు కదా అన్పించేది.

ఆమె చిన్న అమ్మాయి. చెప్పాలంటే ఇంకా ఎంతో ఉంది. ఘాటైన పొంగి పొర్లబోతున్న సారా కల్గిన ఓ గాజు పాన పాత్రను తలపిస్తోంది. అసహనం, ఏదో విశిష్టత ఆమె వ్యక్తిత్వంలో ప్రస్ఫుటమవుతున్నాయి.

ఒత్తైన జుట్టు, కొటేరు లాంటి ముక్కు, చెక్కిన పెన్సిల్ లాంటి సన్నని చేతివేళ్ళతో విలక్షణంగా ఉంది. ఆమె ముఖంలోకి చూస్తే కళ్ళు అనిశ్చితిలో ఉంటాయి. అటు ఇటు పరిగెడుతూ ఆమె ప్రతిదానిలో విసిగిపోయిన భావన వ్యక్తపరుస్తాయి.

ఇవి కేవలం కథకుని అభిప్రాయాలే.

ఛోండూ భావనలు అతనికున్నాయి.

ఒక రోజు అతను నాతో అన్నాడు. మంటో సాహెబ్! ఊహించగలరా? ఆ పిల్ల ఈ రోజు ఏం చేసిందో ఆ అబ్బాయిని. నేను అదృష్టవంతున్నా, దేవుని దయ కాదా? వాస్తవానికి నాగ్‌పరా పోలీసులు ఎప్పుడూ నాపై దయ చూపిస్తారు. లేకుంటే నేనెక్కడ తేలేవాన్నో?

ఏమైంది?

'మామూలే, నాకేమయిందో తెలియదు. తలొంచాల్సిన పని అయింది. ఇదేదో మొదటిసారి కాదే. ఆమెను పిలుచుకొని పోవడం, చేతులు దులుపుకోవడం షరా మామూలే. ఆమె నాతల్లో, చెల్లో కాదు. ఆమెనెలా పోషించాలో అర్థం కావటం లేదు. మంటో సాహెబ్ ఏం చేయాలో తెలియటం లేదు'.

ఇరానీ టీకొట్టులో టీ తాగుతూ మేమిద్దరం కూర్చొని ఉన్నాం. ఛోండూ సాసర్‌లోకి కాఫీతో పాటు ఛాయ్ ఒంపుకొని తాగుతున్నాడు.

'నిజమేంటంటే ఈ పిల్ల సిరాజ్ ఉంది చూడు పాపం'

'ఎందుకు?'

'ఎందుకో దేవునికే తెలియాలి. నేను చేయాలనుకున్నది చేశాను'. టీ తాగాక సాసర్‌పై కప్పు బోర్లించాడు.

'మీకు తెలుసా! ఆమె ఇప్పటికీ కన్య. నూటికి నూరుశాతం. కావాలంటే పందెం కాస్తాను'.

'అదేలా సాధ్యం'? అడిగాను

'ఎందుకు కాదు. సిరాజ్ లాంటి పిల్ల ఈ వృత్తిలో జీవితాంతం ఉన్నప్పటికీ కన్యగానే ఉంటుంది. ఎవర్నీ తాకనీయదు తనను. ఆమె పనికి మాలిన చరిత్రంతా తెల్సునాకు. పంజాబ్ నుండి వచ్చింది. మేమ్ సాహెబ్ నడిపే ఓ ప్రయివేటు ఇంట్లో లిమింగ్‌టన్ రోడ్‌లో ఉండేది. అక్కడికి వచ్చే విటులతో ఆమె ఎడతెగకుండా పోట్లాడుతూనే ఉండేది. ఆశ్చర్యమేంటంటే అక్కడా మూణ్ణెళ్ళుంది. అక్కడా ఇరవై

మంది అమ్మాయిలుండేవాళ్ళు. ఎంతకాలం ఎవరైనా మిమ్మల్ని ఎలా పట్టించుకొంటారు మంటో సాహెబ్. ఒక రోజు మేడమ్ ఇంటి నుండి ఆమెను గెంటేసింది. ఆమెకు కట్టుబట్టలు తప్ప మేం లేవు. ఫరాస్‌రోడ్‌లో ఇంకో ఇంటికి వెళ్ళింది. అక్కడా ఆమె ప్రవర్తన మారలేదు. ఒక రోజు ఒకతన్ని కొరికింది.

అక్కడా రెన్నెళ్ళకంటే ఎక్కువ లేదు. ఆమె కేమయిందో నాకు తెలియదు. పూర్తిగా జీవనకాంతితో ఉంది. ఆ వేడిని ఎవ్వరూ చల్లార్చలేరు. ఫరాస్ రోడ్ నుండి కాట్వారి హోటల్‌కు పోయింది. ఎప్పట్లాగే అవే కష్టాలు. ఒక రోజు మేనేజర్ ఆమెను వెళ్ళిపొమ్మని ఆజ్ఞాపించాడు.. 'మంటో సాహెబ్' ఏం చెప్పేది? ఆమెకు ఎందులోనూ ఆసక్తి లేదు. బట్టలు, ఆహారం, నగలు, ఇలా ఏవైనా సరే! పేన్లు బట్టలపై పాకేంతవరకూ నెలల తరబడి స్నానం చేయదు. ఎవరైనా మాంసం ముక్కలు ఇస్తే సంతోషంగా కొన్ని ఎముకలు పీలుస్తుంది. కొన్ని సమయాల్లో హోటల్ బయటే నిలబడి పాటలు వింటూండడం చూశాను.'

'ఆమెను వెనక్కి పంపొచ్చు గదా'! అడిగాను. ఆమెకు ఈ వృత్తి ఇష్టం లేదు. కావాలంటే ఛార్జీలకు నేనిస్తాను' సూచించాను.

'మంటో సాహెబ్, ఆమెకు ఛార్జీలు పెట్టడం సమస్య కాదు. నేను చేయగలను, ధోందూకదిష్టం లేదు. నన్ను చంపొద్దు'

'మరయితే ఎందుకని సిరాజ్‌ను వెనక్కి పంపటం లేదు?'

చెవి వెనకల పెట్టుకున్న సిగరెట్ తీసి వెలిగించాడు. దీర్ఘంగా లోపలికి పీల్చి, ముక్కు గుండా పొగ బయటికి వదిలాడు. 'ఆమె వెళ్ళటం నాకిష్టం లేదు.'

'ఆమెను నీవు ప్రేమిస్తున్నావా?' అడిగాను

'ఏం మాట్లాడుతున్నారు, మంటో సాహెబ్', అతని రెండు చెవులు తాకి, 'ఖురాన్‌పై ప్రమాణం చేసి చెప్తున్నా, అటువంటి ఆలోచనేదీ నా తలలో లేదు. కానీ అమె అంటే ఇష్టం'.

'ఎందుకు?'

'ఎందుకంటే ఆమెకు ఇతరుల లాగా కేవలం డబ్బు కోసం ఆసక్తి లేదు. వేరే వాళ్ళలాగా కాదు ఆమె. అదే తేడా. ఎవర్నైనా కుదిరిస్తే ఇష్టంగానే వెళ్తుంది. టాక్సీలో కూర్చోబెట్టి పంపుతాను. వెళ్తారు. మంటో సాహెబ్, ఎవరైనా ఎందుకొస్తారు, వాళ్ళిచ్చే డబ్బుకు అందే సుఖం కోసం పాకులాడతారు, అయితే ఆమె ఏ ఒకర్నీ తాకనియ్యదు. అక్కడ కష్టం మొదలవుతుంది. కొట్టడం మొదలు పెడ్తుంది. మంచి వ్యక్తి అయితే నెమ్మదిగా తప్పుకొంటాడు. చెడ్డరకం అయితే నరకం కన్పడుతుంది. డబ్బులు వాపస్ చేయాలి. కాళ్ళు చేతులు పట్టుకొని బతిమాలాలి.

ఖురాన్‌పై ఒట్టు. ఇదంతా నేనెందుకు చేస్తాను. కేవలం 'సిరాజ్' కోసం.

'మంటో సాహెబ్', ఒట్టేసి చెప్తున్నా, ఈ పిల్ల వలన నా వ్యాపారం సగం తగ్గిపోయింది.'

ఒక రోజు ధోందూ ప్రమేయం లేకుండా సిరాజ్‌ను కలవాలనుకొన్నా. చెత్త కుండీలకు దగ్గరగా బైకుల్లా స్టేషన్ సమీపంలో ఓ చిన్న గుడిసెలో సిరాజ్ ఉంటోంది.

సిటి కార్పొరేషన్ పేదల కోసం ఆ పాటి గుడిసెలు కట్టించింది. సమీపంలోనే విశాలమైన ఎత్తైన భవంతులు. నేను వాటి గురించి రాయాలనుకోవడం లేదు. కథకు సంబంధం లేదు. ఈ ప్రపంచంలో పేదలు, ధనికులున్నారు. ధోందూ ద్వారా ఇది వరకే ఆమె గుడిసె తెల్సు కనుక అక్కడికే వెళ్ళాను. ఖరీదైన బట్టలు వేసుకున్నానన్న అపరాధ భావన వెంటాడుతోంది. అయినా ఇది నా గురించిన కథ కాదు.

గుడిసె బయట ఓ మేక ఉంది. అది అరుస్తోంది. నేను అక్కడికి సమీపించాను. ఓ వృద్ధురాలు కర్ర ఊతంతో బయటికొచ్చింది. తలుపుకు కర్టెన్ లాంటి ఓ పొడవాటి గుడ్డ ముక్క వేలాడుతోంది. చిరుగుల మధ్యలో నుండి బయటికి చూస్తున్న ఆమె పెద్ద కళ్ళు కన్పించాయి.

నన్ను గుర్తుపట్టి బయటకు వచ్చింది. ఏదో పనిలో ఉన్నట్లుంది. 'మీరిక్కడ ఏం చేస్తున్నారు?' అడిగింది.

'నేను మిమ్మల్ని కలుసుకోవాలని వచ్చాను'

'రండి లోపలికి'

'లేదు. నీవే నాతో రావాలి'

'అలాగా, అయితే 10 రూపాయలు', అంది వృద్ధురాలు.

నా పర్స్ బయటికి తీసి ఆమెకు డబ్బులిచ్చాను.

'రండి' సిరాజ్‌తో చెప్పాను.

పెద్ద కిటికీల్లాంటి కళ్ళు. నావైపు తేరిపార జూసింది. అందెగత్తె కానీ వెంటనే గగుర్పాటుతో తడబడ్డాను. మమ్మీల్లో రాణిలా అన్పించింది.

ఆమెను ఓ హోటల్‌కు తీసికెళ్ళాను. మురికి బట్టలతో నా ఎదురుగా కూర్చుంది. ఈ ప్రపంచాన్ని విప్పార్చుకొని చూస్తోంది. ఆమెకు నల్లభై రూపాయలు ఇచ్చాను.

ఆమె నెమ్మదిగా ఉంది. త్వరగా ఏదో ఒకటి తాగాలి. నాలుగు పెద్ద విస్కీ బాటిళ్ళు. తర్వాత ఇతరుల్లానే ఆమెపై చేతులు వేసి అనభ్యంగా ప్రవర్తించబోయాను. మందుగుండులా పేలుతుందనుకున్నా. ఆశ్చర్యంగా ఆమె ఏ మాత్రం చలించలేదు. పెద్ద కళ్ళతో విప్పార్చుకొని నన్ను చూస్తోంది.

'తాగండి' సూచించాను.

'వద్దు, నాకు ఎముకల జాయింట్లు కావాలి'

తెప్పించాను. వాటినెంతో ఇష్టంగా పీలుస్తోంది.

ఆ కళ్ళు తీక్షణత కోల్పోయాయి.

ఆమె ముఖం ధ్వంసమయిన నగరంలా ఉంది.

ప్రతి కదలికా ఏదో వినాశనాన్ని సూచిస్తోంది. పునాదులు లేవకముందే ధ్వంసమయి, నాశనం చేయబడిందా? ఆమె కన్యో కాదో నాకవసరం లేదు. కానీ నేను కేవలం ఆమెతో మాట్లాడాలి. ఆమె నాతో పోట్లాడాలి. కానీ ఉదాసీనంగా ఉంది. చివర్లో ఇంటికి తీసికెళ్ళాను.

సిరాజ్‌ను నేను కలిసినట్లు తెల్సిన ధోందూ బాధపడ్డాడు. ఓ స్నేహితుడు వ్యాపారిలా గాయపడ్డాడు. వివరించాలని ప్రయత్నిస్తే అతనవకాశం ఇవ్వలేదు.

'మంటో సాహెబ్, మీరు ఇలా చేస్తారని ఊహించలేదు' అని వెళ్ళిపోయాడు.

మరుసటి రోజు అతనక్కడ లేదు. బాగా లేదేమో అనుకున్నా. తర్వాత రోజు కూడా అతను రాలేదు. ఒక వారం గడిచింది. రోజుకు రెండు మూడు సార్లు ధోందూ ఉన్న చోటుకు పనికి వెళ్తుంటాను. ల్యాంప్ పోస్ట్ చూస్తే ధోందూను చూసినట్లే అన్పిస్తోంది.

సిరాజ్‌ను చూడాలనుకొని ఒక రోజు వెళ్తే, ఆ వృద్ధురాలే పలకరించింది. 'అది వెళ్ళిపోయింది. కానీ ఇంకోటి వస్తుందిలే' అని

చిరునవ్వుతో చెప్పింది.

ఆమె ఎక్కడ? ధోండూతో కలిసి పారిపోయిందా? కానీ అది అసాధ్యం. వాళ్ళిద్దరూ ప్రేమలో లేరు. ధోండూ అలాంటి వాడు కాదు. అతనికి భార్యా పిల్లలున్నారు. వారంటే అతనికెంతో ప్రేమ. అయితే వాళ్ళెక్కడికి పోయినట్లు? ధోండూ ఎట్టకేలకు సిరాజ్‌ను ఇంటికి తిరిగి పంపాలని నిర్ణయించుకొన్నాడన్నమాట. కానీ.. అతనెపుడూ ఘర్షణతో సతమతమయ్యేవాడు. ఒక నెల రోజులు గడిచిపోయాయి.

ఓ సాయంత్రం నేను ఇరానీ టీ హౌస్ వైపు వెళ్తున్నా. అతను ఎప్పట్లాగే లాంప్‌పోస్ట్‌కు ఆనుకొని కన్పడ్డాడు. నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు.

మేమిద్దరం టీ హౌస్‌లోకి వెళ్ళాం. అతన్ని నేను ఏమీ అడగలేదు. స్పెషల్ టీ ఆర్డర్ చేశాడు. నేను టీ తాగుతున్నా. కుర్చీ నావైపు తిప్పుకుంటూ 'మంటో సాహెబ్, ఇక్కడ ఎలా ఉంది అంతా?' అడిగాడు.

అంతా మామూలే ధోండూ. జీవితం నడుస్తూంది.

అవును మీరు చెప్పింది కరెక్ట్, ఇదొక కొత్త ప్రపంచం కదూ?

'మీరు మళ్ళా చెప్పగలరు'!

ధోండూ సాసర్‌లో టీ పోసి, ఒక చుక్క చప్పరించి చెప్పాడు.

'మంటో సాహెబ్, ఆమె మీ గురించి చెప్పింది. నీ స్నేహితుడు పిచ్చోడు అంది. నేను గట్టిగా నవ్వాను. ఎందుకు?

ఆమెను హోటల్‌కు తీసికెళ్ళి చాలా డబ్బులిచ్చారట. కానీ ఊహించుకున్నట్లుగా మీరు ఆమెను ఏమీ చేయలేదట. ఆ కథంతా నాతో చెప్పింది.'

'అదంతే ధోండూ' చెప్పాను

అతను నవ్వాడు. 'నాకు తెలుసు ఆరోజు మిమ్మల్ని బాధపెట్టాను. క్షమించండి. ఏదేమైనప్పటికీ మొత్తం వ్యవహారం అయిపోయింది.'

'ఏ వ్యవహారం?'

'ఆ సిరాజ్ వ్యవహారం. ఇంకేం ఉంటుంది?'

'ఏం జరిగింది?'

'మీకు గుర్తుందా? ఆ రోజు మీరు ఆమెను బయటకు తీసికెళ్ళారు. తర్వాత నన్ను కలిసి, ఆమె వద్ద నలభై రూపాయలు ఉన్నాయని లాహోర్‌కు తీసికెళ్ళమని చెప్పింది.

'ఏమైంది పిల్లా నీకు' అడిగా

'నా కోసం రా ధోండూ నన్ను తీసికెళ్ళు' అడిగింది.

మంటో సాహెబ్, మీకు తెలుసా ఆమెతో నేనెప్పుడూ కాదు అని చెప్పలేదు. 'నీవు కోరుకుంటే అలాగే అన్నాను'. ఎందుకంటే ఆమె అంటే నాకిష్టం.

రైలు టిక్కెట్లు కొన్నాం. లాహోర్‌లో దిగాం.

మేము ఏ హోటల్‌లో దిగాలో ఆమెకు తెల్సు.

ఆ మరుసటి రోజే, 'ధోండూ నాకు బుర్ఖా తెచ్చిపెట్టు' అంది.

నేను బయటికి వెళ్ళి తెచ్చాను.

ఇంక మేం తిరగటం మొదలుపెట్టాం.

పొద్దున మొదలు సాయంత్రం వరకు టాంగాలో లాహోర్ వీథుల్లో తిరుగుతూండే వాళ్ళం.

ఆమె ఏం వెతుకుతూందో నాకు చెప్పలేదు.

నేను మనసులోనే అనుకున్నా. 'ఈ పిచ్చి పిల్లతో బాంబే నుండి ఇంత దూరం, నీవు ఆటలో అరటిపండువు ధోండూ'

మంటో సాహెబ్, ఓ రోజు టాంగా వీథిలో ఒక చోట ఆపమన్నది. 'అదిగో అక్కడున్నాడే అతన్ని చూశావా? అతన్ని ఇక్కడికి పిల్చుకొని రాగలవా? నేనిపుడే హోటల్‌కు వెళ్తున్నాను' అంది.

నేను సందిగ్ధంలో పడ్డాను. టాంగా దిగి అతన్ని అనుసరించా. దేవుని దయతో ఆ వ్యక్తిని గుర్తుపట్టి మాటల్లో పెట్టాను. అతనెలాంటివాడో తెలుసుకోడానికి అట్టేసేపు పట్టలేదు.

అతనితో అన్నాను. 'బాంబే నుండి ప్రత్యేకమైన సరుకుంది, వస్తావా?' వెంటనే అక్కడికి తీసికెళ్ళమన్నాడు. 'తొందరెందుకు, డబ్బులున్నాయా?' అడిగాను. నోట్ల కట్టలు బయటికి తీసి నా ముఖంపై ఆడించాడు. లాహోర్‌లో అందరినీ వదిలి సిరాజ్ వీన్నే ఎందుకు వెతికి పట్టిందో నాకర్థం కాలేదు.

టాంగా తీసుకొని హోటల్ కెళ్ళాం.

నేను లోపలికి వెళ్ళి సిరాజ్‌తో 'ఆ వ్యక్తి బయట ఎదురు చూస్తున్నాడు' అన్నాను.

'లోపలికి తీసికొని రా, కానీ నీవు ఇపుడే వెళ్ళిపోవద్దు'

లోపలికి అడుగుపెడ్తూ ఆమె వైపు చూశాడు. పరిగెత్తి పారిపోవాలనుకున్నాడు. కానీ సిరాజ్ వాన్ని గట్టిగా ఒడిసి పట్టుకొంది.

వదల్లేదు. పట్టు బిగించింది.

ఎక్కడికి పోతున్నావు? నేను ఇంటి నుండి పారిపోయేట్లు చేశావు ఎందుకు? ఎంత ప్రేమించానో నిన్ను తెల్సా? గుర్తుందా? నన్ను ప్రేమించానని కబుర్లు చెప్పావు.

కానీ నీ మాయలో పడి నా తల్లిదండ్రులను, అక్కచెల్లెల్లను, అన్నదమ్ములను వదిలి నీతో అమృత్‌సర్ నుండి లాహోర్ వచ్చి ఈ హోటల్‌లోనే ఉన్నా గదా! గుర్తుందా!

నేను నిద్రపోతుంటే నన్ను వదిలేసి వెళ్ళిపోయిన రాత్రి..

నా ఇంటి నుండి పారిపోయేలా చేశావు. నిన్ను నమ్మాను. అన్నింటికి సిద్ధంగా ఉన్న నన్ను కిందకు పడిపోయేట్లు చేశావు. తిరిగొచ్చాను. ఇప్పటికీ నిన్ను ప్రేమిస్తున్నాను. నిన్ను కనుక్కున్నాను. ఏమీ మారలేదు.'

మంటో సాహెబ్, ఆమె అతని చుట్టూ చేతులు వేసి తోసింది. ఏడ్వడం మొదలుపెట్టాడు. క్షమాపణ అడిగాడు. తప్పు చేశానన్నాడు. కాళ్ళు వణుకుతున్నాయి. ఎప్పుడూ వదిలిపోనని చెప్తున్నాడు. దేవునికే తెలియాలి. ఇంకా ఏమి చెప్తున్నాడో?

అపుడు సిరాజ్ నన్ను రూం నుండి బయటకు పొమ్మన్నది. బయట ఓ ఖాళీ మంచంపై పడుకున్నా. కాసేపటికే నిద్రలోకి జారుకున్నా. ఆమె నన్ను లేపేసరికి తెల్లారింది.

'ధోండూ, వెల్దాం పద' అన్నది.

'ఎక్కడికి?'

'బాంబేకు'

'వాడేడి? ఎక్కడ?' అడిగా

'వాడు నిద్రపోతున్నాడు. బుర్ఖాతో వాడి ముఖం కప్పాను.' బదులిచ్చిందామె.'

ఇంకో స్పెషల్ టీ –కాఫీ కలిపిన టీ అతని కోసం ఆర్డరిచ్చాడు. నేను పైకి తలెత్తి చూశాను. సిరాజ్ హోటల్‌లోకి వస్తోంది. ఆమె కోల ముఖం వెలిగిపోతోంది.

కానీ ఆ పెద్ద కళ్ళు రెండూ పడిపోయిన రైలు సిగ్నల్లా ఉన్నాయి.

వ్యాసం

'కిస్ ఆఫ్ లవ్' ఒక అసభ్య దృశ్యమేనా?

- ఎం.కె.కుమార్

'కిస్ ఆఫ్ లవ్' (ముద్దు ప్రేమ) ఏ ఉద్దేశంతో మొదలైనప్పటికీ అది సమాజంలోని అన్ని బృందాలకు పాకుతోంది. ముద్దు సమరంగా ఇది భారతదేశాన్ని ఒక ఊపు ఊపుతోంది. వ్యక్తిగతంగా రాజ్యహింసను భిన్నరూపాల్లో ఎదుర్కొన్న వారు ఈ ఉద్యమంలోకి అడుగిడుతున్నారు. ఎగువమధ్యతరగతి వర్గానికి చెందిన యువత ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లినప్పటికీ అది మధ్యతరగతి యువతను విశేషంగా ఆకర్షిస్తోంది. వ్యవస్థీకృతమౌతున్న కొన్ని ఆధిపత్యహింసలకు వ్యతిరేకంగా పోరాటం చేయడం ఆనాదిగా వుస్తున్నదే. వారు ఎంచుకున్న నిరసన రూపాలు సమాజపు కట్టుబాట్లు, చట్టం, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థకు వెలుపల ఉన్నంతమాత్రన ఆ ఉద్యమాలను తప్పుపట్టలేం. వారు ఎంచుకున్న నిరసన రూపం ఒకర్నికొకరు ఇష్టపడ్డ ఇద్దరు యువతీ యువకులు బహిరంగంగా ముద్దుపెట్టుకోవడమే. నాల్గుగోడల మధ్య పరిమితమవ్వాల్సిన ఇద్దరి రహస్య ప్రేమ బహిరంగ పర్చడం హిందూసంస్కృతి ప్రకారం అనైతికమని కొన్ని హిందుత్వబృందాలు ఘోషిస్తున్నాయి. వారు ముందుకు తెచ్చిన ప్రజాస్వామిక డిమాండ్లను అనైతిక ముసుగులో తొక్కివేయాలని చూస్తున్నాయి. పోలీసు చేత వ్యక్తిగతంగా ఇబ్బందిపడ్డ ప్రవీణ్ అనే వ్యక్తి ఫేస్‌బుక్‌లో తన భార్యను ముద్దుపెట్టుకున్న దృశ్యాన్ని పోస్ట్ చేశాడు. అలాగే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, వెబ్ జర్నలిస్టులు, ప్రభుత్వ ఉద్యోగులు తమ భార్యలను ముద్దుపెట్టుకుంటున్న దృశ్యాలను సోషల్ నెట్‌వర్క్‌లో పెట్టి కిస్ ఆఫ్ లవ్ ఉద్యమానికి తమ సంఘీభావాన్ని ప్రకటిస్తున్నారు. వృద్ధులు, వివాహితులు, యువత చాలా మంది ఈ ఉద్యమానికి తమ మద్దతును ముద్దు ప్రేమ ద్వారానే తెలియపరుస్తున్నారు. ఆధిపత్యానికి, మోరల్ పోలీసింగ్‌కు వ్యతిరేకంగానే వీరంతా స్పందించారు. బహిరంగంగానే ముద్దులు పెట్టుకోవాలని వారు ఆకాంక్షించడం లేదు. ఇద్దరు యువతీయువకులు ప్రేమించు కోవడానికి, వారి ఇష్టాయిష్టాలను వ్యక్తపర్చుకోవడానికి భారతదేశంలో అనువైన వాతావరణం లేకపోవడం వల్లే ప్రేమికులు పార్క్‌లను, ఇంటర్నెట్ సెంటర్లను, ఏకాంత ప్రదేశాలను ఆశ్రయిస్తున్నారు.

కిస్ ఆఫ్ లవ్ ఉద్యమకారులు మోరల్ పోలీసింగ్‌కు వ్యతిరేకంగా ఎన్నుకున్న విధానం హర్షించేరీతిలో లేదు. అయితే తాము చేస్తున్నది ఒకానొక నిరసనరూపమేనని తెలియజేస్తున్నారు. గతంలో ఇంఫాల్‌లో ఆర్మీ అరాచకాలకు వ్యతిరేకంగా అక్కడ మహిళలు నగ్నంగా తమ నిరసనను తెలియజేయడాన్ని ఈ సందర్భంగా వారు వక్కాణిస్తున్నారు. పారామిలటరీ అస్సాం రైఫిల్స్ ఆర్మీ 2004లో 32 సంవత్సరాల మనోరమ అనే మహిళను ఆమె ఇంటినుండే కిడ్నాప్ చేసి, ఆమెపై అత్యాచారం జరిపి అమెను చంపివేశారు. తీవ్ర ఆవేశానికి గురైన ప్రజలు తమ ఉద్యమాన్ని ఫక్తు శాంతియుత పద్ధతిలోనే జరపాలని పౌరసమాజం కాంక్షించవచ్చు. చరిత్రను తిరగేసినపుడు ప్రజాఉద్యమాలన్నీ ప్రజలిష్టపడిన రీతిలోనే జరిగాయని అర్థమౌతుంది. కిస్ ఆఫ్ లవ్ నిరసనరూపం భారతీయసంస్కృతిని దిగజారుస్తుందని చాలామంది మేధావులు అభిప్రాయపడుతున్నారు. కేరళలోని ఒక రెస్టారెంట్‌లో ఏకాంతంగా ముద్దుపెట్టుకుంటున్న ఒక యువజంటను బిజెపి కార్యకర్తలు కొట్టడమే గాకుండా, ఆ రెస్టారెంట్‌ను ధ్వంసంచేయడాన్ని ఎవ్వరూ ఖండించడంలేదు. ఇంతవరకు దాడికి పాల్పడినవారెవ్వరిని ప్రభుత్వం అరెస్టు చేయలేదు. ఏకాంతంగా ఇద్దరు యువతీ యువకులు తమ అభీష్టం మేరకు ముద్దు పెట్టుకోవడం తప్పని రాజ్యాంగంలో ఎక్కడా పేర్కొనలేదు. సమాజంలో కొన్ని ఆధిపత్య బృందాలు సాంస్కృతిక అరాచకత్వాన్ని రాజ్యం అండతో కొనసాగిస్తున్నాయి. దీన్ని వ్యతిరేకిస్తూనే యువజంటలు వీధిబాట పట్టాయి.

నవంబరు 2న మెరైన్ డ్రైవ్, కొచ్చిన్‌లో ఫేస్‌బుక్ ఆధారంగా కిస్ ఆఫ్ లవ్ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఫేస్‌బుక్‌లో ఈ నిరసన రూపానికి లక్షజంటలు తమ ముద్దు సీన్లను పంపాయి. వీరు తీసుకున్న బహిరంగపర్చే ప్రేమ హిందూ సనాతన ధర్మానికి వ్యతిరేకమని, ఐపిసి సెక్షను 294 ప్రకారం నేరమని, ఇందులో పాల్గొన్న ఉద్యమకారులపై కేసులు పెట్టాలని హిందూత్వసంస్థలు, అభిమానులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఆధునికత పేరుతో పాశ్చాత్య సంస్కృతి భారతదేశంలో సృష్టిస్తున్న విధ్వంసాన్ని అందరూ ప్రశ్నించాలని వీరు కోరుతున్నారు. పాశ్చాత్య పెట్టుబడిని భారతదేశంలో అనుమతించకూడదని మాట్లాడని వారంతా, ఈరోజు ఆ పెట్టుబడితో పాటు దిగుమతి అవుతున్న పాశ్చాత్య సంస్కృతిని వ్యతిరేకిస్తున్నారు. కేరళలో మోరల్ పోలీసింగ్ పేరుతో పెద్ద ఎత్తున హింసాయుత వాతావరణాన్ని కొన్ని వర్గాలు నెలకొల్పుతున్నాయి. 2011లో వివాహితతో సంబంధాలను నెరపుతున్నాడనే ఉద్దేశంతో ఒక యువకుడ్ని కొంతమంది కొట్టి చంపేశారు. అక్టోబర్ 2014లో దాడికి పాల్పడ్డవారందరికి కోర్టు జీవితఖైదీ విధించింది. జూన్ 2014లో సినీరంగానికి చెందిన ఇద్దరు యువతీ, యువకుడు రాత్రి పూట కలసి ప్రయాణం చేస్తున్నారని పోలీసులు అక్రమనిర్బంధం జరిపిన సందర్భంలోనూ ఫేస్‌బుక్ ఉద్యమాలు నడిచాయి. 2012లో ఒక బాలింత ఒంటరిగా

కన్నూరు బస్టాండ్‌లో కూర్చున్న సందర్భంగా, కొంతమంది ఆమెను లైంగికంగా వేధించారు. 2011లో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు బైక్‌పై పోతుండగా, బైక్ తోలుతున్న యువతిని అల్లరిమూక లైంగికంగా హింసించింది. కొజికోడ్‌లోని ఒక కేఫ్‌లో ఒక యువజంట చాటుగా ముద్దపెట్టుకుంటున్న సందర్భంలో భారతీయ జనతా యువ మోర్చాకు చెందిన వ్యక్తులు ఆ యువజంటను తీవ్రంగా కొట్టడంతోపాటు, కేఫ్‌ను నాశనం చేసిన దృశ్యాలను కాంగ్రెస్ పార్టీకి చెందిన జైహింద్ అనే మళయాళం న్యూస్ ఛానల్ టెలికాస్ట్ చేయడంతో తాజా కిస్ ఆఫ్ లవ్ ఉద్యమం ప్రారంభం అయింది. ఐపిసి సెక్షను 294 (ఎ) ప్రకారం బహిరంగ ప్రదేశాలలో అసభ్యంగా ప్రవర్తిస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవచ్చని, వారికి గరిష్టంగా 3 నెలల వరకు శిక్ష వేయవచ్చని చెపుతోంది. అసభ్యకర ప్రవర్తన అనే పదాన్ని సరిగ్గా నిర్వచించకపోవడం వల్ల పోలీసులు తమ ఇష్టానుసారం చట్టాన్ని దుర్వినియోగపరుస్తున్నారు. నటుడు రిచర్డ్‌గెరె, నటి శిల్పాశెట్టిని ఒక బహిరంగ వేదికపై ముద్దుపెట్టుకున్న సంఘటనపై జైపూర్ కోర్టు ఇచ్చిన అరెస్టు వారెంట్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు విస్పష్టమైన తీర్పును వెలువరిస్తూ, ఇద్దరు వ్యక్తులు తమ ఇష్టానుసారం కౌగలించుకున్నా, ముద్దుపెట్టుకున్నా వారిపై కేసులు పెట్టకూడదని చెప్పింది. హిందూ, ముస్లిం మతాలకు చెందిన పెద్దలు ఈ ఉద్యమాన్ని తప్పుపట్టారు. హిందుత్వవాదులు కొంతమంది దీన్ని లవ్ జీహాద్‌గా పేర్కొన్నారు. సోషియల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా, సున్నీ యువ జన సంఘం లాంటి ముస్లిం పార్టీలు, సంస్థలు ఈ ఉద్యమాన్ని తూర్పారపట్టాయి.

మోరల్ పోలీసింగ్‌ను ఒక సామాజిక బాధ్యతగా చేపట్టినట్టు దాడులకు పాల్పడుతున్నవారు భావిస్తున్నారు. ఆపేరున వారు ఇతరుల వ్యక్తిగత స్వేచ్ఛను హరిస్తున్నట్లు వారు గుర్తించడంలేదు. పురుషాధిక్యత సమాజం స్త్రీని ఎప్పుడూ నాల్గుగదుల ఇంట్లోనే బందీగా వుంచాలని ప్రయత్నిస్తుంటుంది. ఒకవేళ బయటకి వెళ్లదలిస్తే ఎవరో ఒక పురుషుడ్ని తప్పకుండా వెంట తీసుకెళ్లాలి. అతను వయస్సు రీత్యా ఆమెకు పెద్దాయన అయిండాలి. ఆమె భర్తతో వెళ్లినా, అన్నతో వెళ్లినా సవాలక్ష ప్రశ్నలకు జవాబులు చెప్పుకోవాల్సివుంటుంది. ముఖ్యంగా మళయాళీ పురుషులు తమ చిన్నతనం నుంచి మహిళలకు దూరంగా ఉంచబడుతున్నారు. కేరళలో ఎక్కువ కో ఎడ్యుకేషన్ పాఠశాలు లేకపోవడం వల్ల పురుషుడికి స్త్రీ ఆలోచనల్ని, భావాల్ని, అభిరుచుల్ని అర్థం చేసుకునే అవకాశాలు లేకుండా పోయాయి. అందువల్ల ఆమెను అతను లైంగికవస్తువుగానే గుర్తించే ధోరణి పెరుగుతుంది. సహజమైన, స్వచ్ఛమైన స్త్రీ, పురుషుల మధ్య స్నేహం కేరళ రాష్ట్రంలో కరువౌవతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. కేరళలోని దాదాపు అన్ని విద్యాలయాల్లో టీ షర్టులు, జీన్స్‌లు నిషేధించారు. మరోవైపు టీవీల్లో, సినిమాల్లో నటీనటులు అవే వేసుకుంటున్నారు. అభిమానాన్ని, ప్రేమను, అప్యాయతను ఎలా ప్రకటించాలో తెలీని విచిత్ర పరిస్థితుల్లో ఇప్పుడు యువత వుంది. మనం పొగుడు కుంటున్న భారతీయసంస్కృతి వారికేమీ నేర్పలేకపోయింది. బహిరంగంగా ముద్దుపెట్టుకోవడం తప్పంటున్న పోలీసింగ్, దేవాలయాల గోపురాలపై వున్న బూతు బొమ్మలగురించి మాత్రం మాట్లాడదు. తాజాగా సినిమా డాన్స్‌లను కేరళ ప్రభుత్వం పాఠశాలల్లో నిషేధించారు. ఆ సినిమా పాటలపై పిల్లలకున్న క్రేజ్ అక్కడ చాలా వింత పరిస్థితులను కల్పిస్తోంది. పిల్లలను ఎక్కువగా ఆకర్షిస్తోన్న సినిమా పాట డాన్స్‌లతోనే టీవీషోలు విపరీతమైన రేటింగ్‌లు సాధిస్తున్న తరుణంలో కేరళ పిల్లలు తమ సృజనాత్మకతను, అభినివేశాన్ని ఏ విధంగా వ్యక్తీకరించుకోవాలో ప్రభుత్వాలు వారికి తెలపడంలేదు. కేరళలో ఆధిపత్య సంస్కృతి, భావ వ్యక్తీకరణను సైతం క్రిమినలైజ్ చేసే ప్రయత్నం జరుగుతోంది. ఇది యువత టాటూలు వేసుకోవడం నుండి వారు ప్రేమ వ్యక్తీకరించుకునే క్రియలవరకు దేన్ని వదిలిపెట్టకుండా ప్రభావితం చేయాలని చూస్తోంది. త్రిసూర్ జిల్లాలో ఓ పోలీసు ఆఫీసర్ జీన్స్ వేసుకున్న యువతను అరెస్టు చేస్తామని పత్రికా ముఖంగా ప్రకటించి విమర్శల పాలయ్యాడు. వ్యవస్థలోని అస్థిరత, ఉపాధిలేమి, అభద్రత, అసమానత యువతలో ఒకరకమైన నిస్తేజాన్ని నింపుతున్నాయి. తమ సమస్యలకు పరిష్కారం కనుగొనడానికి కావలసిన పనిముట్లు వారి దగ్గర లేకపోవడంతో ఏ చిన్న నిరసన రూపాన్నైనా వారు విశ్వవ్యాపితం చేస్తున్నారు. వ్యక్తులను హీరోలను చేసి, ఒక వ్యక్తే ఈ దేశ భవిష్యత్తును మార్చి వేస్తారనే ఉపన్యాసాలు యువతలో నమ్మకాన్ని పెంచుతున్నాయి. మరోవైపు తమ భావాలపై, అభిరుచులపై, వ్యక్తీకరణపై జరుగుతున్న మానసిక, భౌతిక దాడులను తిప్పికొట్టడానికి తమకి తెలిసిన మార్గాలను వారు ఎంచుకుంటున్నారు. ఇన్‌స్టెంట్ యుగంలో నిరసనలు ఇన్‌స్టెంట్ రూపాలనే సంతరించుకుని తుపాన్‌లా దేశాన్నిఊపేస్తున్నాయి. వాటి ప్రభావం చాలా కొద్దిరోజులే వుంటున్నప్పటికీ, వాటి పర్యావసానాలు సామాజిక పరివర్తనలో ఎంతోకొంతమేర ప్రభావం చూపకమానవు. తాజాగా కిస్ ఆఫ్‌లవ్ ఉద్యమం వెస్ట్ బెంగాల్‌లోని కలకత్తాకు పాకింది. కేరళ, వెస్ట్‌బెంగాల్ రెండు రాష్ట్రాలు దీర్ఘకాలం కమ్యూనిస్టుల పరిపాలనలోవుండటం గమనించవలసిన విషయం. కాషాయికీరణ ఒక గెంతు దశకు వచ్చిందని నమ్ముతున్న రైటిస్టులు ఉధృతంగా అమలుపరుస్తున్న హిందుత్వ పెట్టుబడిదారీ నమూనా కొన్ని ప్రక్రియలను వేగవంతం చేయడంతో పాటు, ఉద్యమాలకు దూరంగా వున్న యువతను ఉద్యమాలవైపు అనివార్యంగానే నెడుతోంది. యువత సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానాలు సంప్రదాయ, పాశ్చాత్య సంస్కృతులలోనూ దొరకనపుడు వారి అసహనం నిరసనల రూపాల్లోకి మారుతోంది. ఆ నిరసనరూపాలు ప్రస్తుత సమాజం, చట్టం ఆమోదించలేని పరిస్థితుల్లో వున్నప్పుడు వారిని సంఘవినాశకరశక్తులుగా చిత్రీకరించడానికి ఈ పౌరసమాజం వెనకాడదు.

సాహిత్య వ్యాసం

ఇరవయ్యో శతాబ్దపు మలిదశ - స్త్రీల కథ

- నల్లూరి రుక్మిణి

స్వాతంత్ర్యోద్యమం మహిళలకు గొప్ప ఉత్తేజాన్నిచ్చింది. అప్పటి వరకు సంసారమే సర్వస్వం అని భర్తకు అత్తమామలకు సేవ చేయటమే పవిత్ర కార్యమన్న స్థితి నుండి, ఇంటి బయట కూడా సామాజిక కర్తవ్యాన్ని నిర్వహించాలనే జిజ్ఞాస ప్రారంభమైన కాలమది. సారా వ్యతిరేక, విదేశీ వస్తు బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహాలలో తమ కుటుంబ సభ్యులతో పాటు స్త్రీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బండారు అచ్చమాంబ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ, కొటికలపూడి సీతమ్మ, ఆదుర్తి భాస్కరమ్మ వంటి వాళ్ళు సామాజిక కార్యకలాపాలలో పాల్గొనటంతో పాటు స్త్రీల విద్యకు ప్రాధాన్యత నిచ్చి కృషి చేసారు. ఆ దశలో అక్కడక్కడ ప్రత్యేక మహిళా సంఘాలు కూడా ఏర్పడ్డాయి. సంస్కరణోద్యమ కాలం నాటి నుండే కందుకూరి, గురజాడ, గిడుగు రచనలు తెలుగు సమాజంపై, ముఖ్యంగా మహిళలపై ప్రభావాన్ని కలిగి ఉండటం వల్ల ఈ కాలం నాటికి స్త్రీలు మరింత చైతన్యవంతమై రచనా రంగం వైపు కూడా దృష్టిని పెట్టారు.

అయితే తొలి తరం రచయిత్రుల ఆలోచనలన్నీ కుటుంబ పరిధిలోనే సాగాయి. అప్పటికున్న భూస్వామ్య, పితృస్వామ్య భావజాలం వల్ల, పెళ్ళి కొరకే చదువులనీ, భర్త అడుగుజాడలు అనుసరించటమే స్త్రీల ధర్మమన్నది సాహిత్యంలోనూ ప్రతిబింబించింది. బండారు అచ్చమాంబ – 'స్త్రీ విద్య' కథలో భార్యా భర్తల సంవాదం, భర్తను క్షేమ సమాచారం తెలియజేయమనటంతో కథ ప్రారంభమౌతుంది. అప్పుడతను నీవు కూడా చదువు నేర్చుకుంటే మంచిది కదాని! సాగించిన సంభాషణే ఈ కథ. చివరకు ఆమె భర్త అభిప్రాయాన్ని గౌరవించి చదువుకోవటానికి అంగీకరిస్తుంది. కనుపర్తి వరలక్ష్మమ్మ 'ఐదు మాసముల ఇరువది దినముల' కథలో భర్త జైలుకు వెళ్ళగా అతని అభిప్రాయాలను గౌరవించి తన విదేశీ వస్త్రాలను త్యజించటమే కాక రాట్నం వడికి స్వదేశీ వస్త్రాలను ధరిస్తుంది. మరొక కథ బసవరాజు వెంకట లక్ష్మి 'ఎవరి అదృష్టంలో' సాంప్రదాయానికి భిన్నంగా ఇష్టపడి మతాంతర వివాహం చేసుకోవటం వల్ల నష్టపోతామని, తల్లిదండ్రులు చేసే వివాహం మంచిదని సూచించింది. అయితే కథానాయక చివరలో భర్తను ప్రశ్నిస్తుంది. ఈ మేరకు ఆ కథ ఓ సానుకూల అంశాన్ని ప్రతిపాదించినప్పటికీ, సాంప్రదాయాన్ని ధిక్కరించరాదనే భావజాలాన్ని ప్రతిబింబించిన నెగటివ్ కథ. ఇలా సాగిన స్త్రీల రచనలు స్వాతంత్ర్యానంతరం కూడా ఆ ఒరవడిని దాటలేదనే చెప్పాలి. అయితే అందుకు భిన్నంగా 'లలిత' వంటి కథ రాసిన ద్రోణంరాజు సీతాదేవి, 'కొండమల్లెలు' కథ రాసిన ఇల్లెందుల సరస్వతీ దేవి వంటి వారు అందుకు మినహాయింపుగా లేకపోలేదు.

ఆనాటి ఉద్యమాల ప్రభావంతో చాలా మంది మధ్య తరగతి స్త్రీలు చదువుల్లోకి ఎదిగి వచ్చారు. బ్రిటీష్ వాడు దేశం వదిలిపోవటం, కమ్యూనిస్టు ఉద్యమం కూడా విరమణ ప్రకటించటంతో సమాజంలో ఓ స్తబ్దత ఆవరించింది. దీని వల్ల స్త్రీలకు ఏ విధమైన సామాజిక కార్యాచరణ లేకపోవటంతో, చాలామంది కుటుంబాలకు పరిమితమై పోగా, కొద్ది మంది సాహిత్యం వైపు దృష్టిని మరల్చారు. ఆయా ఉద్యమ కాలాలలో సమాజాన్ని ఉత్తేజం చేయటానికి సాంప్రదాయ సాహిత్యాన్ని విరివిగా ప్రచారం చేయటం, సభలు, సమావేశాలల్లో గేయాలు, కీర్తనలు వంటి వాటిని ఆలపించటం చేసారు. కమ్యూనిస్టులు కూడా గోర్కీ 'అమ్మ', దాస్తోవిస్కి 'నేరము శిక్ష' వంటి అనువాద రచనలు ప్రచురించటంతో ఆ ఉద్యమ కాలాల్లో సంఘంలో ఓ సాహిత్య వాతావరణం ఏర్పడి ఉంది. దానివల్ల స్త్రీలు అనంతర కాలంలో ఈ మార్గాన్ని ఎన్నుకోవటానికి దారి చూపినట్లయింది. సామాజిక కార్యాచరణ దూరమై నిస్పృహగా ఉన్న దశలో రచనను ఒక ఆలంబనగా చేసుకున్నారు.

దీనితో పాటు నీటి వనరు కలిగిన తీరప్రాంతాలలో వరి, చెరుకు వంటి పంటలలో వ్యవసాయాభివృద్ధి చెందటంతో కోస్తా ప్రాంతాల నుండి స్త్రీలు ఎక్కువ మంది చదువుల్లోకి వచ్చారు. జాతీయోద్యమంలో పాల్గొన్న స్త్రీలలో ఎక్కువ మంది ఈ ప్రాంతపు మధ్య తరగతి, ధనిక రైతు కుటుంబాల నుండి వచ్చిన వాళ్ళేనన్నది ఒక వాస్తవం. ఈ నేపథ్యం నుండి ఈ ప్రాంతపు మహిళలే ఎక్కువగా రచనలు సాగించారు. ఈ కాలంలో వచ్చిన కథల్లోనూ, నవలల్లోనూ వరకట్న సమస్య, పునర్వివాహాలు, విడాకుల హక్కులు, మనోవర్తి హక్కుల సమస్యలే కాక అప్పుడప్పుడే ఉద్యోగాల్లోకి వస్తున్న స్త్రీల కష్ట సుఖాలకు సంబంధించిన అంశాలు ప్రాధాన్యత వహించాయి. ఆ కథలు కూడా రాజీధోరణితోనే ముగిసినా, ఆలోచనలు ప్రేరేపించేవిగా ఉండేవి. కొందరు చైతన్యంతో ప్రతిఘటించినట్లు ముగింపు ఇచ్చిన కథలు కూడా ఉన్నాయి.

1955లో జానకీ రాణి 'నా జీవితం నాకిచ్చేయ్' కథ భర్తను ఎదిరించి కూతురు సహకారంతో విడాకులు పొందుతుంది. తల్లి పార్వతమ్మ తరఫున సీత కోర్టులో సాక్ష్యం చెపుతుంది. విడాకులు, మనోవర్తి కూడా మంజూరు అవుతుంది. కాని కోర్టులోనే భరణం డబ్బులు పార్వతి భర్త మొహాన విసిరేస్తుంది. ఇరవై యేళ్ళుగా నా దుఃఖం, నేననుభవించిన కష్టాలు డబ్బులు ఇస్తే తీరుతాయా? అన్న అర్థంలో 'నా జీవితం నాకిచ్చేయ్' అంటుంది పార్వతమ్మ. వాహిని రాసిన 'నీతి లేని కమల', వి. సుశీలా దేవి రాసిన 'చీకటి వెలుగులు' మనుషుల ఆలోచనలలో వస్తున్న మార్పును సూచించేవి.

తూములూరి కృష్ణవేణి 1951లో రాసిన 'ఆడ బ్రతుకు' స్త్రీల హక్కుల గురించి ప్రస్తావించిన కథ...' పాకీ వాళ్ళ దగ్గర నుండి పెద్ద ఆఫీసర్ల దాకా సమ్మె చేస్తూ ఉంటే ఆడవాళ్ళు అంత అసమర్థులేనా మీ అభిప్రాయం 'మేమూ చేయదలుచుకొన్నాము' అంటుంది కథానాయక దుర్గ. స్త్రీల హక్కుల ఆత్మగౌరవ దృక్పథాన్ని ప్రదర్శించిన కథ ఇది.

ఇట్లా 20వ శతాబ్దం తొలిదశలో రెండవ తరం రచయిత్రులు కొంత భిన్నమైన దృక్పథాన్ని ప్రదర్శించిన వాళ్ళు మనకు కనిపిస్తారు. జయంతి, నిడమర్తి నరసమాంబ, సమయ మంత్రి వందేమాతరం,

కందాళం కనకమ్మ, పంతం అమ్మాజీ, గుమ్మిడదల దుర్గాబాయి, గండికోట సావిత్రీ దేవి, పైడి రేణుకాదేవి, వెలిదండ చూడి కుడుతమ్మ వంటి ఎందరో రచయిత్రులు పేరు ప్రఖ్యాతుల్లోకి రాకుండానే పోయారు. వీరంతా ఆ కాలం ప్రభావంతో రచనలు చేసిన వాళ్ళు. తరువాత కాలంలో నిత్య జీవితంలో ఒదిగిపోయారు. వారి జీవితాలకి లక్ష్యంగా ఏ ప్రేరణా కన్పించలేదు. అరవయ్యో దశకం చివరి నాటికి చాలా మంది రచయిత్రులు చదువుకున్నవారు కూడా తమ వ్యాపకాలను కుటుంబాలకు పరిమితం చేసుకున్నారు లేదా చేసుకొనేటట్లు చేసింది సమాజం.

ఇరవయ్యో శతాబ్దపు తొలిభాగంలో బ్రిటిష్ వారు పోవాలని జనం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి స్వేచ్ఛా భారతిని కలలు కన్నారు. గురజాడ బండి వాడు కూడా బ్రిటిష్ వాడు పోతే ఈ కానిస్టేబులు దాష్టీకం తగ్గుతుందని పిసరంత ఆశపడ్డాడు. అయితే అందరి ఆశలు నిరాశ కావటానికి ఎంతో కాలం పట్టలేదు. స్వరాజ్యం వచ్చినా ప్రజల జీవితాలలో మారింది ఏమీ లేదు. జమీందారి రద్దుగాని, దున్నేవానికి భూమి వంటి, నినాదాలుగాని, పేద బడుగు జనాలకి ఒరగబెట్టింది లేదు. భూపరిమితి చట్టాలు వచ్చినా అవన్నీ జమిందారుల స్థానాల్లోకి ఎక్కి వచ్చిన ధనిక భూములు బడా భూస్వాములు బినామి పేర్లతో భూములను తమ కంట్రోల్‌నే పెట్టుకున్నారు.

మరోవైపు మొదటి పంచవర్ష ప్రణాళికలో నిర్దేశించుకున్న 'వ్యవసాయాభివృద్ధి, వృత్తుల పెంపుదల' లక్ష్యం వల్ల నీటి వసతి, రవాణా సౌకర్యాలున్న తీరప్రాంతం మరింత అభివృద్ధిలోకి రాగా మిగిలిన ప్రాంతం ఎక్కడ వేసిన గొంగళి అక్కడేగా ఉండిపోయింది. ఇది ఇలా ఉండగానే రెండవ పంచవర్ష ప్రణాళిక ప్రజల ముందుకు వచ్చింది. వ్యవసాయానికి అంతా చేసినట్లుగా ఈసారి 'పారిశ్రామి కాభివృద్ధి'ని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. దీనితో మిక్స్‌డ్ ఎకానమి పుణ్యమాని పారిశ్రామిక రంగంలోకి వచ్చిన ప్రైవేటు పారిశ్రామిక వేత్తల హవా కొనసాగింది. వాళ్ళంతా జమీలు రద్దయి భారీగా రాజభరణాలు పొందిన వారు, లేదూ ధనిక రైతాంగం నుంచి వచ్చిన వారూనూ. ఆ కాలంలో ఈ వర్గం మీద చదువుకున్న మధ్య తరగతికి ఆదరాభిమానాలు బాగానే ఉండేవి. కొత్తగా అభివృద్ధిలోకి, ఆధునిక శైలిలోకి వచ్చిన వీరిపట్ల అటు సినిమాలలోను, ఇటు సాహిత్యంలోను మోజు పెరిగింది. గతించిపోయిన వైభవం తాలూకా జమీందారీ ఫాయాకు గుర్తుగా వుండే పాత్రల సృష్టిలో తెలుగు నవలల సీరియళ్ళ హవా సాగింది. (బహుశా జానపద సినిమాల జోరు కూడా ఈ సందర్భమేనేమో) ఆరడగుల అందగాడు, ధీరత్వం ఉట్టిపడే మగవాడు వారపత్రికల పాఠకుల వూహల్లో తేలుతుండేవాడు.

అప్పటివరకు తెలుగు పత్రికలన్నీ సమాజంలో వస్తున్న ఉద్యమాలకు, మార్పులకు అనుకూలంగానో, ప్రతికూలంగానో చూపిస్తూ వచ్చాయి. ఎప్పుడైతే ఉద్యమ వాతావరణం లేకపోయిందో పత్రికలు తమ వ్యాపారాల, లాభాల వేటలో పడిపోయాయి. పత్రికా వ్యాపారం పుంజుకున్నది. అందుకు స్త్రీలు మంచి వనరుగా కనబడ్డారు.

పైన చెప్పినట్లే కాక అందుకు భిన్నంగా సామాజిక వాస్తవాలతో వట్టికొండ విశాలాక్షి, రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి, కె. రామలక్ష్మి వంటి కొద్ది మంది రచయిత్రులు చైతన్యంతో కూడిన రచనలు చేసి తెలుగు సాహిత్యాన్ని సీరియళ్ళ వరద తాకిడికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేసారు. అయితే వారి రచనలలో కూడా స్త్రీల జీవితాలలో ఎదుర్కొంటున్న సమస్యలకు మనుషులు మంచిగా మారితే బాగుపడతాయన్న పరిమిత దృక్పథం ఉండేది.

ఏది ఏమైనప్పటికి ఊహాలోకపు మాయాజాలంగానీ మరొకటి గానీ సమాజంలో వస్తున్న అశాంతిని ఏ మాత్రం అడ్డుకోలేక పోయాయి. మొదటి పంచవర్ష ప్రణాళిక గ్రామీణ, సన్న, చిన్నకారు రైతాంగం మీద ప్రభావం చూపితే రెండవ పంచవర్ష ప్రణాళిక మిక్స్‌డ్ ఎకానమీ దెబ్బతో ఉద్యోగ కల్పన భ్రమాపూరితమై విద్యావంతులు, యువకుల మీద మరింత ప్రభావం చూపింది. దివాళాకోరు రాజకీయాలతో పార్లమెంటు కంపులో పడి రాజకీయం కొట్టుమిట్టాడింది. జాతీయ ఉద్యమ స్ఫూర్తిగాని, సోషలిజం మాట గాని ఊహలో లేకుండా పోయింది.

ఈ నేపథ్యంలో 70వ దశకం చివరికి అటు గ్రామీణ రైతులు, ఇటు పట్టణ కార్మికులు, విద్యార్థులు తమ తమ రంగాలలో అన్నిటి పట్ల అసంతృప్తితో ఆగ్రహపూరితులైనారు. దీనిక అంతర్జాతీయ పరిస్థితులు కూడా తోడయ్యాయి. ఫ్రెంచి విద్యార్థుల తిరుగుబాటు, చైనా సాంస్కృతిక విప్లవం వీరిని ప్రభావితం చేసాయి. వామపక్ష పార్టీలలో కూడా పార్లమెంటరీ రాజకీయాల మీద గొప్ప ఘర్షణ పెరిగింది. నక్సల్బరీ ఆవిర్భవించింది. శ్రీకాకుళం గిరిజనులు ఆ పిలుపునందుకున్నారు. అక్కడ నుండి రెండు దశాబ్దాల పాటు విప్లవోద్యమం అన్ని రంగాలను ప్రభావితం చేసింది.

నక్సల్బరీ శ్రీకాకుళ ఉద్యమాల తరువాత సామాజిక సమస్యల పరిశీలనలో మార్పు వచ్చింది. మార్క్సిజం సాహిత్యంలో చోటు చేసుకున్నది. సాహిత్యానికి, సంస్కృతికి రాజకీయాలకున్న అంతర్గత సంబంధాలను విప్లవ సాహిత్యోద్యమం విరివిగా ప్రచారంలోకి తెచ్చింది. 'బంబార్డ్ ది హెడ్ క్వార్టర్స్' అన్న నినాదం భారతదేశ రాజకీయ సాంస్కృతిక రంగాలలో మారుమోగింది. ఆ దన్నుతో 'తల్లీ భారతీ అంటూ' అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టు పెట్టిన అందం నీది' అని కవి నిర్భయంగా అనగలిగాడు. అప్పటి నుండి ప్రజాపోరాటాల గురించి తప్ప మరొకటి ఏది రాసినా ప్రజల ఆమోదం పొందలేదు.

ఈ కాలంలో వచ్చిన కవిత్వం ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగిస్తూ నినాద గీతాలయ్యాయి. మార్క్సిస్టు దృక్పథంలో కొడవటిగంటి కుటుంబరావు, కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి వంటి సుప్రసిద్ధ రచయితలెందరో గొప్ప కథా సాహిత్యాన్ని సృష్టించారు. అయితే స్త్రీల వైపు నుండి కథా ప్రక్రియలోకి వచ్చిన వాళ్ళు లేరనే చెప్పాలి. అయితే దీనికి మినహాయింపుగా నల్లూరి రుక్మిణి 1974లో సృజన పత్రికలో 'గోరంత దీపం', ఎరుపు ప్రత్యేక సంచికలో 'వాన రానుంది' కథలతో తొలి విప్లవ కథకురాలుగా నమోదయ్యారు. ఈ కథల్లో స్త్రీల సమస్యల గురించి కాక మొత్తంగా సామాజిక మార్పును కోరే ఆకాంక్ష వుంది. ఈమె తరువాత కాలంలో సాహిత్యం మీద కంటే విప్లవోద్యమం మీద ఆసక్తితో సాహిత్య కృషి కొంత విరామం తీసుకున్నప్పటికి తదనంతరం 90ల నుండి విప్లవ కథా రచనలో తన వంతు కృషి చేస్తున్నారు. ఆమె గాక మరికొంత మంది రచయిత్రులు 90ల తరువాత విప్లవ కథను పరిపుష్టం చేస్తున్నారు. మిడ్కో తాయమ్మ కరుణ, షహీదా, అనూరాధ, మరికొందరు వైవిధ్యమైన రచనలు చేస్తున్నారు. మిడ్కో – 'మెట్లమీద' విప్లవోద్యమ నేపథ్యం వున్న కథ. ఉద్యమం నుండి బయటకు వచ్చి బయటి జీవితంలో ఇమడలేక పడుతున్న ఘర్షణను చూపించింది. ఈ క్రమంలో ఉద్యమంలోని ఆటుపోట్లు తనదైన రీతిలో చూపించింది.

ఇదొక ప్రధాన పార్శ్వంగా సాగినప్పటికీ సమాజంలో భిన్న పార్శ్వాలు ఎప్పుడు ఉంటూనే ఉంటాయి. అలా ఈ దశాబ్దంలో కూడా వచ్చిన సాహిత్యంలో స్త్రీల కథలను గమనించినట్లయితే వాసిరెడ్డి సీతాదేవి, అబ్బూరి ఛాయాదేవి, కె. రామలక్ష్మి, యమ్. ఫిరోజిమా, ఓగేటి ఇందిరాదేవి, శీలా సుభద్రాదేవి, ఆలూరి విజయలక్ష్మి వంటి ఎందరో రచయిత్రులు స్త్రీల సమస్యలకు సానుకూల దృక్పథంలో సాంప్రదాయాన్ని ప్రశ్నించే వైపుగా చిత్రించిన వారున్నారు.

ఓగేటి ఇందిరా దేవి 1978లో రాసిన 'ఫేర్‌వెల్ టు మై హస్బెండ్' అనే కథలో – భర్త పై చదువులకి వెళ్ళి వేరొక ప్రాంతంలో ఉంటే భార్య పిల్లలను పెట్టుకొని చదువులు చెప్పిస్తూ ఉంటుంది. ఈ క్రమంలో భర్తని ఆశ్చర్యపరచాలన్న దృష్టితో ఓసారి అతడికి ముందుగా చెప్పకుండా అతనుండే ఊరు వెళ్తుంది. అక్కడకు వెళ్ళాక తన భర్త మరొక ఆమెను వివాహం చేసుకున్న విషయం తెలుస్తుంది. దానితో అతనితో ఘర్షణ పడి – ఇక నువ్వు అక్కర్లేదని చెప్పి వెళ్ళిపోతుంది. రెండవ భార్య కూడా అతన్ని తన్ని తగలేయటంతో కథ ముగుస్తుంది. ఈ కథలో ఎవరో ఒకరు రాజీపడి అతనితో ఉన్నట్లు చూపించకుండా ఇద్దరూ అతన్ని ఛీత్కరించి నెట్టివేసినట్లుగా చూపించటం మంచి పరిణామం.

ఎం. ఫిరోజిమా 1973లో 'కట్నం కొద్దీ మొగుడు' కథలో సరళకు పెళ్ళి చేయాలనుకుంటాడు తండ్రి. ఊళ్ళో సంబంధం తక్కువ కట్నానికి చేసుకుంటానన్నా తల్లి అంగీకరించదు. ఎక్కువ కట్నం ఇచ్చి చేస్తేనే గొప్పతనం అని భావిస్తుంది. ఎక్కువ జీతం వచ్చే మరొక సంబంధానికి సరళ తండ్రి సిద్ధపడగా వాళ్ళు అంగీకరించి తీరా సంబంధం ఖాయం చేసుకుందామనుకునేటప్పటికి వరుడి జీతం పెరిగిందని తిరిగి ఇంకా కొంత కట్నం కావాలంటారు. మిగిలిన కట్నం సర్దుబాటు కోసం తన స్నేహితుడి దగ్గరకు వెళ్ళగా అతను హితోపదేశం చేసి సరళను సంగీతంలోకి ప్రవేశపెడతారు. ఆమెకు పేరు ప్రఖ్యాతులు రాగానే అంత క్రితం సంబంధం వద్దన్న వాళ్ళే ఆమెను చేసుకుంటామని వస్తారు. కాని సరళ అతన్ని తిరస్కరిస్తుంది. అలా ఈ దశకంలో స్త్రీలకు పెళ్ళిళ్ళే సర్వస్వం కాదని వివాహం లేకుండా బతికే స్వేచ్ఛ వుందని, 'ఈ దారి ముందుకే', 'మాకీ భర్త వద్దు', 'మాఘ సూర్యకాంతి' వంటి కథలు భర్తల హింసలను సహిస్తూ వుండాల్సిన అవసరం లేదని చెప్పిన కథల దగ్గర నుండి – ఇదే దశకంలో 'పునిస్త్రీ' 'తొణికి స్వప్నం' వంటి కథలు సాంప్రదాయాలను తిరస్కరించటం మీద విమర్శతో పాటు ఆత్మహత్యలు పరిష్కారంగా చూపినవారు ఒకరిద్దరున్నారు. అయితే ఇది ప్రధాన స్రవంతి కాదు.

ఇలా సాగిన ఈ దశకం మధ్య నుండే విప్లవోద్యమ స్ఫూర్తిలో 1975 నాటికే ప్రగతిశీల మహిళా సంఘం ఏర్పడింది. అయితే అది నిలదొక్కుకుని పని ప్రారంభించక ముందే ఎమర్జన్సీ ప్రకటించటంతో ఆగిపోయినది. ఈ క్రమంలో హైదరాబాదులో జరిగిన రమీజాబీ ఘటన ఆంధ్రదేశంలో సంచలనం కలిగించింది. స్త్రీలపై అత్యాచారానికి వ్యతిరేకంగా నిరసనతో పాటు, అప్పటికి ఆంధ్రదేశంలో మొత్తంగా రాజ్యవ్యవస్థ చేస్తున్న దుర్మార్గాలకు ఈ ఘటన ప్రతీకగా నిలిచి చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని పొందింది. ఆంధ్రదేశంలో ఉన్న ఈ పరిస్థితులకు తోడు అంతర్జాతీయ మహిళా దశాబ్దపు ప్రకటన మరింత స్త్రీలకు ఉత్తేజాన్ని ఇచ్చింది.

ఇటువంటి సన్నివేశంలో విప్లవోద్యమం నిర్బంధానికి గురికావటం, ఉద్యమంలో చీలికలు రావటం, కార్యకర్తలలో గందరగోళం, అనుమానాలు కలగడానికి ఆస్కారం ఏర్పడింది. ఉద్యమ కాలంలో వుండే ఏకత ఇటువంటి సందర్భంలో విభిన్నంగా చీలడం సహజమే. అట్లా విప్లవోద్యమంలో పనిచేసిన కార్యకర్తలే ముందుగా మహిళా హక్కుల చర్చను సమాజం ముందు పెట్టారు. స్త్రీల చరిత్ర మీద గుర్తింపుల మీద వామపక్ష పార్టీలపై పదునైన విమర్శలు సంధించారు. ఆంధ్రదేశంలో ప్రత్యేక మహిళా సంఘాల సందడి ప్రారంభమైంది. వీటిలో కొన్ని సంఘాలకు ఏదో ఒక రూపంలో విదేశీ నిధులు సమకూరాయి. అయితే ప్రతి దానిలోను మనకీ కొంత మంచి కలుగుతున్నట్లుగానే, ఈ సంఘాల ప్రారంభం తెలుగు సమాజంలో సంచలనం కలిగించింది. స్త్రీ వాద ఉద్యమం పట్టణ చదువుకొన్న మధ్య తరగతి మీద గాఢమైన ప్రభావాన్ని చూపింది. ఇది సాహిత్యం మీద, సామాజిక జీవితంలోను కొత్త ఆలోచనలను రేకెత్తించింది. విప్లవోద్యమంలో వచ్చిన ఒడిదుడుకుల ఖాళీలల్లోకి ఈ ప్రత్యేక మహిళా సంఘాలు దూసుకు వచ్చాయి. ఈ సంఘాలలో పని చేసిన మహిళా కార్యకర్తలు చాలామంది విప్లవోద్యమం నుండి వచ్చిన వాళ్ళే.

స్త్రీల సమస్యలకు వ్యక్తులు మంచిగా మారితే సరిపోదని... స్త్రీల చరిత్రను, సమస్యలను శాస్త్రీయ దృష్టితో చూడాలనే అవగాహనను స్త్రీవాద సాహిత్యం ముందుకు తెచ్చింది. రాజకీయ పరిభాషలోకి స్త్రీల హక్కుల చర్చను అనువదించారు. 'జండర్' దృష్టికోణం నుండి స్త్రీల సమస్యల పునాది అంశంగా చూడాలనే ప్రతిపాదన ముందుకు వచ్చింది. 'వ్యక్తిగతం అంతా రాజకీయమే' అన్న అంశం స్త్రీవాదం ఎప్పుడైతే ముందుకు తెచ్చిందో అది మధ్య తరగతి, పట్టణ మహిళల మీద గాఢమైన ప్రభావం చూపింది. జండర్ స్పృహ, మాతృత్వం, ఇంటి చాకిరిపై చర్చ స్త్రీలను కదిలించింది. 1985ల తరువాత స్త్రీలు తమ వ్యక్తిగత అనుభవాల నుండి రచనలు చేస్తూ పెద్ద సంఖ్యలో సాహిత్య రంగంలోకి వచ్చారు.

ఆలోచనా, అవగాహన లేని దశలో కుటుంబం స్త్రీలకు రక్షణ కల్పిస్తుందనే నిశ్చింతతో బతికిన తరాలు ఉండేవి కావచ్చు! అయితే స్త్రీలకు విద్య, ఉద్యోగ అవకాశాలతో బాహ్య ప్రపంచంలోకి నడిచి వచ్చాక గానీ, తాము స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ఇష్టా ఇష్టాలు లేని ఎటువంటి జీవితం గడుపుతున్నామో అర్థం కాలేదు. అయినా తెగించి తమ బాధలు బయటికి వచ్చి చెప్పుకోలేకపోయారు. సంసారం గుట్టుకింద నలిగిపోయారు. కుటుంబ అవసరాలు, పిల్లల పెంపకం, అత్తా, భర్తల పెత్తనాలు, అదనంగా ఉద్యోగ బాధ్యతలతో ఇంటా బయట చాకిరీలతో మానసిక ఘర్షణలకు లోనైయ్యారు. అటువంటి వత్తిడిని అనుభవిస్తున్న మధ్య తరగతి మహిళలకు స్త్రీవాద ఉద్యమం గొప్ప రిలీఫ్ నిచ్చింది. వ్యక్తిగత అనుభవాలను, దుఃఖాలను ఒక్కసారిగా ఆర్తితో సమాజం ముందు వెళ్ళబోసుకున్నారు. తాము అనుభవిస్తున్న హింసను, సంకెళ్ళను తెంపుకుంటూ పురిటి నొప్పుల నుండి, మానవత్వం మమకారం లేని భార్యాభర్తల లైంగిక సంబంధాల దాకా అనేకం కథా, కవితా వస్తువులయ్యాయి. స్త్రీలు విరివిగా ఓ దశాబ్దం కాలం పాటు విరామం లేకుండా రచనలు చేశారు. కొన్ని పదుల కవిత, కథ, నవల, వ్యాస సంపుటాలు వచ్చాయి. ఈ 'జండర్' చర్చను బలంగా ముందుకు తెచ్చిన వారిలో ఓల్గా, అన్వేషి లలిత, సుశీతారు వంటి వారిని ముందుగా చెప్పాలి. ఓల్గా 'రాజకీయ కథలు' మొదటిసారిగా స్త్రీల శరీర

అవయవాలను గురించి జండర్ దృక్పథంతో కొత్తగా ఆలోచింప చేశాయి. అవి సాహిత్య వస్తువులూ అయ్యాయి.

అయితే ఇదే సమయంలో మార్క్సిస్టు అవగాహనతో ఏర్పడిన మహిళా సంఘాలు - పితృస్వామ్యం పోవాలంటే అధికార వ్యవస్థలనన్నీ ఎదిరించాలన్న దృష్టితో పని చేసి ఆ వైపుగా సాహిత్యాన్ని కొనసాగించాయి. ఈ సంఘాలు ప్రధానంగా పేద, గ్రామీణ, దళిత స్త్రీల జీవితాలను పట్టించుకొని, ఆ జీవితాలను తమ కథలలో చిత్రించారు.

ఏ కొత్త తరంగమైనా సమాజంలోకి వచ్చినప్పుడు మొట్ట మొదట ఉధృతంగా ఉండటం సహజం. తరువాత కాలంలో స్థిరపడి నిలకడగా సాగడమో చల్లారిపోవడమో ఆయా ఉద్యమాల వస్తుగత బల, బలహీనతలను, బట్టి ఉంటుంది. అలానే స్త్రీవాద ఉద్యమ కాలంలోనూ వ్యక్తిగత అనుభవాలకు పరిమితమై మాత్రమే రాసిన వాళ్ళు చెప్పిందే మళ్ళీ మళ్ళీ చెప్పటానికి విసుగుచెందారు. పైగా మధ్య తరగతి స్త్రీల అనుభవాలు కొద్ది కొద్ది తేడాలతో అవే కావటంతో ఒక దశ దాటాక కొత్తదనం లేకపోవటం వల్ల పాఠకులలో నిరాసక్తత చోటుచేసుకుంది. దానితో స్త్రీవాద సాహిత్యం మందగించింది.

పైగా స్త్రీవాద రచనలకు తోడుగా స్త్రీవాద ఉద్యమం అనేది పేరుకే వుంది గాని... అది నిజంగా ఎవరి మీదా, ఏ పోరాటాన్ని నిర్మించలేదు. స్త్రీలపై హింసకు పురుషాధిపత్యమే కారణం అన్నవాళ్ళు, పురుషాధిపత్యం మూలాలు ఏమిటి? ఏ ఆధిపత్యాన్ని, వర్గాన్ని కాపాడటానికి అన్న అవగాహనను కలిగించలేదు. అది తెలిసిన స్త్రీవాదులు కూడా ఆ విషయమై మౌనంగానే ఉన్నారు. కనుక నీడతో యుద్ధం నిజమైన యుద్ధం కాకుండా పోయింది. వ్యక్తిగత అనుభవాలకు వ్యక్తులు కారణం అనుకొని స్త్రీ, పురుషులు ఎదురు బొదురయ్యారు. అసలు రావలసిన చైతన్యం కంటే దీనికంతా స్త్రీలు కారణమని పురుషులూ, పురుషులు కారణమని స్త్రీలూ, అపనమ్మకాలతో సాగే పరిస్థితులు కల్పించబడ్డాయి.

ఇదే కాలంలో 1985లో కారంచేడులో దళితులపై జరిగిన దాడి ఆంధ్రదేశంలో దళిత ఉద్యమానికి నాంది పలికింది. ఇది బ్రాహ్మణీయ, అగ్రకుల ఆధిపత్య సమాజాన్ని నిలదీసింది. అన్ని రంగాలలో ఉన్న దళిత అణచివేతను ప్రశ్నించింది. అప్పటి వరకు వచ్చిన దళిత సాహిత్య వైఖరికి దళిత ఉద్యమం తరువాత వచ్చిన సాహిత్యానికి ఎంతో వైవిధ్యం ఉంది. దళితులు తమదైన జీవితాన్ని, అలవాట్లను విలువలను ప్రతీకలుగా సగౌరవంగా సాహిత్యంలో నిలబెట్టారు. తమ పేరు చివర తమ కుల గుర్తును ఆత్మగౌరవంగా ప్రకటన చేసారు. అగ్రకులాల దాష్టీకం, అంటరానితనం, దళిత స్త్రీల పై అత్యాచారాలు కథావస్తువులు అయ్యాయి. సాంప్రదాయ సాహిత్యాన్ని దళిత కోణం నుండి పునర్ వ్యాఖ్యానం చేసారు. శంభూకుడు, బకాసురుడు, ఏకలవ్యుడు కథానాయకులయ్యారు. అంబేద్కర్, పూలేలు మొదటిసారిగా తెలుగు నేల మీద ఆవిష్కరింప బడ్డారు.

ఈ నేపథ్యం నుండి సాహిత్య రంగంలోకి పురుషులు వచ్చినంత విస్తృతంగా స్త్రీలు తక్కువనే చెప్పాలి. గోగు శ్యామల సంపాదకత్వంలో వచ్చిన 'నల్లపొద్దు', కె. లక్ష్మినారాయణ (అనంతపురం) తెచ్చిన దళిత స్త్రీల కథలు దళిత సాహిత్యంలో గొప్ప ప్రయత్నమని చెప్పాలి.

ఈ కాలం కంటే ముందు, తొలి దశలో 'తాడి నాగమ్మ' లాంటి రచయిత్రులు మనకు ఉండడం చాలా అరుదైన ఘటన. ఏ అవకాశాలు లేని కాలంలో చదువుకోవటమే కాక రాజకీయ రంగంతో కూడా పరిచయం కలిగి ఉండడం ఆశ్చర్యం గొలిపే విషయం. 'ముద్దు' కథలో ఆనాడే ప్రపంచ రాజకీయాలు, దేశంలో పరిణామాలు, చరిత్ర ఘటనల ఉటంకింపులు చూస్తుంటే ఆమెకెంత లోకజ్ఞానం, అనుభవం ఉందో అర్థం అవుతుంది. బ్రిటీష్ కాలం నుండి తొలి తరం దళితులు చదువుల్లోకి రావటంతో అరవైల నాటికి అతి కొద్ది మంది దళిత స్త్రీలు సాహిత్య రంగంలోకి రాగలిగారు 1965లో నంబూరి పరిపూర్ణ, సెంటినా సరోజిని, మానుకొండ జ్యోతి, మామిడి సత్యవతి వంటి వాళ్ళు కనబడతారు. పరిపూర్ణ రాసిన 'స్ఫూర్తి' కథ నిజంగా స్ఫూర్తినిచ్చిన కథ. విమల మధ్య తరగతి మహిళ, తన భర్త చేస్తున్న పనులు సహించలేక, అతన్ని ఎదిరించనూ లేక సతమతమౌతుంది. అయితే ఆమె దగ్గర పనిచేస్తున్న మస్తానమ్మ తన భర్త చేస్తున్న ఆగడాలను ఎదిరించి బుద్ధి చెబుతుంది. మస్తానమ్మ చర్య విమలను ఆలోచింపచేస్తుంది.

అక్కడ నుండి తొంభైల తరువాత జాజుల గౌరి, చల్లపల్లి స్వరూపరాణి, వినోదిని, జూపాక సుభద్ర, గుజ్జర్లమూడి నిర్మలారాణి, పుట్ల హేమలత వంటి రచయిత్రులు దళిత స్త్రీల కథా సాహిత్యానికి మంచి చేర్పును కూర్చారు. జాజులగౌరి రాసిన 'మన్ను బువ్వ' కథ దళిత జీవితాలలోని కష్టాల లోతునూ, గాఢతను తెలియజేస్తుంది. ఆకలికి తట్టుకోలేక తల్లిని అన్నం అని అడిగి బాధపెట్టనూ లేక ఆ చిన్న బిడ్డ మన్ను తిని నీళ్ళు తాగి కడుపు నింపుకోవటం దళితుల దుర్భర దారిద్ర్యానికి నిలువుటద్దం లాంటిది. అలాగే జి. నిర్మలా రాణి - 'కాటేసిన కరువు' కథలోనూ దారిద్ర్యానికి 'పతనం' అనే వాక్యం అర్థం లేని మాటగా కనిపిస్తుంది. తండ్రి చనిపోగా అన్న కనిపించకుండా పోగా తల్లిని తనని పోషించుకోవటం కోసం శారీరక వృత్తిలోకి బలవంతంగా దింపబడుతుంది. అయితే ఆ చిన్నపిల్ల దగ్గరకు వచ్చే రాక్షసులు పెట్టే బాధ భరించలేక నేను ఆ పనికి వెళ్ళనని తిరస్కరించి ఎటో వెళ్ళిపోతుంది కూతురు. కాని కడుపు నింపుకోవటం కోసం తీసుకున్న అడ్వాన్స్‌వల్ల ఆ వయసు మళ్ళిన తల్లి ఆ పనికి తాను వస్తానని తయారవుతుంది. దళితుల జీవితాలలో అనంతమైన దుఃఖాన్ని చూపిస్తుందీ కథ! ఇట్లా దళిత సాహిత్యం కొత్త ప్రశ్నలను వేస్తూ అగ్రకుల సమాజాన్ని నిలదీస్తూ సమాజం ముందుకు వచ్చింది. అయితే ఈ అగ్రకుల ఆధిపత్యాన్ని నిలబెడుతున్న రాజ్యాధికార వ్యవస్థలను ప్రశ్నించాల్సినంతగా ప్రశ్నించటం లేదు. ఆకలినీ, కరువును చూపించినంతగా - అదెందుకట్ల పరిణామం చెందిందో చెప్పటం లేదు.

అయితే ఈ అస్తిత్వ ఉద్యమాల ప్రశ్నలు ప్రశ్నలుగా ఉండగానే వీటిని తోసి రాజంటూ ప్రపంచీకరణ దేశ ప్రజల ముందుకు తోసుకువచ్చింది. 1990లలో ప్రారంభమయిన గ్లోబలైజేషన్ దెబ్బ అన్ని వర్గాల ప్రజలకు ఊపిరి సలపనట్టైంది. సెజ్‌ల పేరుతో అభివృద్ధి పేరుతో దళితుల నుండి, బలహీన వర్గాల నుండి, ఉన్న ఆ కాస్త చారెడు భూమిని కూడా లాగేసుకున్నారు. వారి ఆవాసాలను ధ్వంసం చేసారు. వారంతా నిలవ నీడలేక జీవిక కోసం పట్టణాలకు వలసలు పోయి దినసరి కూలీలు అయ్యారు. మరోవైపు కార్పొరేట్ ఉద్యోగ కల్పనతో మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతులకు మారిపోయింది. సన్న, చిన్నకారు రైతు కుటుంబాలు సహితం అంతో, ఇంతో భూములమ్మో, అప్పు చేసో, తమ పిల్లలను చదివించి ఉద్యోగాల కోసం విదేశాలకు పంపారు.

వీరు సహితం స్థిమితమైన స్థితికి ఎక్కి వచ్చారు. గ్లోబలైజేషన్ మగవాళ్ళతో పాటు ఆడవాళ్ళకు కూడా ఉద్యోగ అవకాశాలను కల్పించింది. ఇదొక మంచి అవకాశం కాగా ఉద్యోగాల పేరుతో 18వ శతాబ్దపు కార్మికుల కంటే గొడ్డు చాకిరీని సృష్టించి తమ విలువైన కాలాన్ని ఉద్యోగపు బానిసత్వానికి తాకట్టు పడిపోయారు. యువతరం మనస్సనేది ఒకటున్నదనేది మరిచిపోతున్నారు. విశ్రాంతిలేని వారి జీవితాలలో మానసిక అవసరాల ప్రశ్నలేదిప్పుడు. జీతం లెక్క పెట్టుకోవటం జీవితాన్ని ఎంజాయ్ చేయటంలా మిగిలిపోయింది. చార్లీ చాప్లిన్ 'మోడ్రన్ టైమ్స్'లో ఎప్పుడో చెప్పింది ఈ రోజు కళ్ళ ముందు నిజమై కనబడుతున్నది. ఈ మార్పులు రచయితల మీద బలమైన ముద్రనే వేసింది. అప్పటి వరకు సామాజిక స్పృహతో, ప్రజా ఉద్యమాలకు సానుకూలంగా ఉండే వర్గాలు కూడా - కార్పొరేటీకరణ మాయకు గురైయ్యాయి. వారి వారి భావజాలలలోను అది పొడచూపింది. అందువల్లే దీనికి వ్యతిరేకంగా గట్టిగా గొంతెత్తలేకపోయారు. నాస్తాల్జియాను ఆశ్రయించారు. 'పెట్టుబడి' పరమ ఆకర్షణ శక్తి అయ్యింది.

అదలా వుంచితే ఈ పరిణామాలనన్నీ తెలుగు సాహిత్యం పట్టుకుంది. పి. సత్యవతి 'మంత్రనగరి', కుప్పిలి పద్మ 'సాలభంజిక', గీతాంజలి 'నేను పోలేపల్లి పీనుగను', ప్రతిమ 'చావుదారులు', నల్లూరి రుక్మిణి 'మిడిసిపాటు' వంటి రచనలెన్నో రచయిత్రుల నుండి వచ్చాయి.

అందువల్ల 90ల నుండి సమాజంలో అన్ని వర్గాలలో ప్రశ్నించే తత్వం పెరిగింది. ప్రతి ఒక్కరూ తమ తమ మూలాలను వెతుక్కోసాగారు. తమ రచనలలో వాటిని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యం నుండే బహుజన వాదం, ముస్లిం మైనారిటీ వాదం ముందుకు వచ్చాయి. అన్ని కులాలలో ఉన్న ఉపకులాలు తమ వృత్తులు ధ్వంసం అయిపోవటం గురించీ, వృత్తి కులాలలో ఉన్న కష్టనష్టాల గురించి వ్యక్తం చేసారు. ఈ క్రమంలో కె. వరలక్ష్మి, అనిసెట్టి రజిత, జి. విజయలక్ష్మి, జ్వలిత వంటి రచయిత్రులు ముందుకు వచ్చారు. కె. వరలక్ష్మి తొంభైల కంటే ముందే బహుజన కుటుంబాలలోని ఆర్థిక ఇబ్బందులు, సాంప్రదాయాలను దాటలేక వెనుకబాటు తనంతో స్త్రీలు పడుతున్న హింసలను చిత్రించారు. 'మట్టి - బంగారం' కథా సంపుటి బహుజన స్త్రీల అస్తిత్వవాదానికి మంచి గుర్తింపు. 'ఇదా పెళ్ళంటే' కథలో టైలరింగ్ మీద ఆధారపడిన దిగువ మధ్య తరగతి కుటుంబంలోని ఆడపిల్ల పెళ్ళికి ఆ కుటుంబం పడ్డ అవస్థలు కళ్ళముందు కదిలేట్టు చిత్రించారు.

ఈ దశకంలోనే ముస్లిం మైనారిటీల గుర్తింపు చర్చ ముందుకు వచ్చింది. ముఖ్యంగా గుజరాత్ ఘటన తరువాత మైనారిటీలలో అభద్రత మరింత పెరిగింది. నిజానికి ముస్లిం మైనారిటీల సమస్య చాలా సుదీర్ఘమైనది, ఎంతో కీలకమైనది. నిజానికి నాలుగు తరాల నుండి వాళ్ళీ నేలకు వారసులై వుండి కూడా ఇంకా అభద్రత ఎదుర్కోవలసి రావటం సిగ్గుపడాల్సిన విషయం. అది అలా వుంచి ఈ అస్తిత్వ వాదాల పరిణామాల నేపథ్యంలో ముస్లిం రచయితలు, విద్యావంతులు ఈ చర్చను తెలుగు సమాజం ముందుకు బలంగా తెచ్చారు. ఖాదర్ మొహియుద్దీన్ 'పుట్టుమచ్చ' దీనికి ప్రారంభం. ఓ వైపు హిందూ సమాజం నుండి వస్తున్న ఘర్షణ - వత్తిడుల గురించి రాస్తూనే మరొక వైపు ముస్లిం జీవితాలలోని దుర్భర దారిద్ర్యాన్ని తమ రచనలలో వ్యక్తం చేసారు.

వీరి కంటే కూడా మహిళలు మరింత ప్రజాస్వామికంగా ఎంతో సంయమనంతోనూ తమ మతంలోనే ఉన్న అప్రజాస్వామిక విలువలను షాజహాన, ఫాతిమా, ఫరీదా, షమ్‌షాద్ బేగం వంటి కొందరు రచయిత్రులు నిర్భయంగా రాయగలిగారు. ముస్లిం స్త్రీలే కాక ముస్లిమేతర రచయిత్రి అయిన గీతాంజలి వారి జీవితాలలో ఉండే సంఘర్షణను, అణచివేతను అనేక కథలలో కళ్ళకు కట్టినట్లు చూపించారు. షాజహాన 'సండాస్' కథ దారిద్ర్యానికి దిగువన ఉండే కుటుంబాలలో పరదా చాటున పడుతున్న హింస ఎటువంటిదో చూపిస్తుంది. ముస్లిం స్త్రీ కావటం వల్ల 'చెంబు' తీసుకొని బయటకు పోలేక ఇళ్ళల్లో ఉండే కక్కసు దొడ్ల మురికిని భరించలేక పంటిబిగువులో జీవితాన్ని వెళ్ళబారుస్తున్న వారి స్థితిని చూస్తే ఆక్రోశం కలుగక మానదు.

ఈ అన్ని అస్తిత్వ ఉద్యమాలతో పాటు ప్రత్యేక తెలంగాణ ఉద్యమం 2000 నాటికి ప్రారంభమయ్యింది. అప్పటి నుండి ప్రాంతీయ ఉద్యమ సాహిత్యం కూడా మొదలైంది. అయితే ఈ ప్రాంతం నుండి ప్రత్యేక ఉద్యమానికంటే ముందు నుండి ఎంతో సాహిత్యం వచ్చింది. కానీ ఆ రచనలు ప్రాంతీయ అస్తిత్వ స్పృహతో రాసినవి కావు. బండారు అచ్చమాంబ, పి. యశోదారెడ్డి, ముదిగొండ సుజాతా రెడ్డి, బొమ్మా హేమలత వంటి తొలి తరం తెలంగాణ రచయిత్రులు తెలంగాణ కుటుంబాలలోని స్త్రీల పాత్ర, సాంప్రదాయాల వల్ల ఎట్లా నలిగిపోతున్నారో చూపించారు. గోగు శ్యామల, గోపి భాగ్యలక్ష్మి, అనిశెట్టి రజిత వంటి యువ రచయిత్రులు రచనలతో పాటు ఉద్యమంలో కూడా పాలు పంచుకుంటున్నారు. 'ఎల్లమ్మ దస్కింది' - ఈ క్రమంలో వచ్చిన మంచి కథ. ఆంధ్రా నుండి వచ్చిన వాళ్ళకు తక్కువ రేటుకు భూమిని అమ్మటాన్ని నిరసిస్తూ వచ్చిన కథ. నిజానికి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం 'బేస్' కూడా ఈ అవగాహన నుండి వచ్చిందే. ఈ ఉద్యమ క్రమంలో తెలంగాణ చరిత్ర, సంస్కృతి, భాషా, రాజకీయాల మీద కొత్త చర్చను సమాజం ముందుపెట్టారు.

ఏది ఏమైనా 1960ల నుండి 2000ల వరకు ఆంధ్రదేశం అనేక పరిణామాలను చవిచూసింది. ఈ పరిణామాలన్నింటికీ దేశం లోపలి, వెలుపలి ప్రభావాలు ఎన్ని పనిచేసినప్పటకీ - అసలు విషయం ఆయా సమూహాల, ప్రాంతాల, అంతర్గత వైరుధ్యాలే కీలకాంశమన్నది గుర్తించాల్సిందే.

ఈ అన్ని మార్పులను, దశలను తెలుగు సాహిత్యం పట్టించుకున్నది. అయితే ఏ దేశంలోనైనా ఏదో ఒక వాదమో, ఉద్యమమో ప్రధానంగా ముందుకు రావచ్చు. అంత మాత్రాన మిగిలినవేవి ఆయా కాలాలలో లేవని చెప్పలేం. ఒక్కో దశలో విప్లవోద్యమం, స్త్రీ వాదం, దళిత, మైనారిటీ అస్తిత్వ, ప్రాంతీయ ఉద్యమాలు ప్రాధాన్యతను పొంది ఉండవచ్చును, కాని సాహిత్యంలో గీటు గీసినట్టుగా ఆ కాలంలో ఆ విధమైన సాహిత్యం మాత్రమే వచ్చే అవకాశం లేదు. ఆయా సామాజిక పరిణామాలను ప్రతిబింబిస్తూ ప్రధాన ధోరణిగా వచ్చిన సాహిత్యాన్ని ఆ ఉద్యమ కాలానికి ప్రతీకగా తీసుకోవటం సహజం.

అట్ల ఈ వ్యాసంలో ఈ యాభై యేళ్ళ కాలంలో వచ్చిన పరిణామాలలో స్త్రీల కథా సాహిత్య గమనాన్ని చెప్పటానికి చేసిన చిన్న ప్రయత్నమే ఇది.

(2014 అక్టోబర్ 13, 14 తేదీల్లో ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక, సాహిత్య అకాడమీ ఢిల్లీలో సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో సమర్పించిన పత్రం.)

ప్రజా ప్రత్యామ్నాయ రాజకీయ వేదికకు సంకేతం

హుస్నాబాద్ అమరుల స్థూపం

- మేకల వీరన్నయాదవ్

అప్పటి పీపుల్స్‌వార్ - నేటి మావోయిస్టు పార్టీ మట్టి అక్షరాలతో మానవత్వాన్ని నింపిన మట్టి మనుషులకు, ఇదే మట్టిలో ప్రజల భాగస్వామ్యంతో ఆసియాలోనే రెండవ అతి పెద్దదైన, దేశంలోనే పెద్దదైన హుస్నాబాద్ స్థూపం నిర్మించడం చరిత్ర. పీడిత, తాడిత ప్రజలకోసం అనేక పోరాటాలు చేసి అనువులు బాసిన అమరుల త్యాగాలకు, అక్కడి ప్రజల చైతన్యానికి ఒక చిహ్నాన్ని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి పోయేలా ఆవిష్కరించిన వేళ అది. అసలైన ఎర్రజెండా కింద, పేద, బీదా బిక్కి అందరూ భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి 'దున్నేవానికే భూమి' అనే కార్యాచరణతో ఊరూరా కదిలి, ఎర్రజెండాల సాక్షిగా కరడుగట్టిన భూస్వాములు, దొరల నుండి భూములను స్వాధీనం చేసుకున్నారు. సాగుబాటు చేశారు. అప్పుడొక స్వేచ్ఛను సాధించిన సందర్భం. అదొక సమస్యల సాధనకు, ప్రజల చైతన్యానికి నెలవు.

పేద, మధ్యతరగతి ప్రజలకు ఏ సమస్యలున్నా క్షణాల్లో పరిష్కారం. అదొక ప్రజా ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక. కరడుగట్టిన భూస్వాముల నుండి రక్షించుకోడానికి పేద, మధ్యతరగతి ప్రజలకు ఆ ప్రాంతం ఒక రక్షణవలయం. ప్రజలు అప్పటి పీపుల్స్‌వార్ నాయకత్వంలో జరిగిన పోరాటాల్లో చాలామంది అమరులైనారు.

అప్పటికి హుస్నాబాద్ ప్రాంతంలోని హుస్నాబాద్, గాంధీనగర్, తోటపల్లి, చౌటపల్లి, అక్కన్నపేట, అంతకపేట, గోవర్ధనగిరి, పోతారం, పందిల్ల, మీర్జాపూర్, రామవరం, గౌరవెల్లి, జనగాం, కట్కూర్, ఇందుర్తి, రేకొండ, ఒగులాపూర్, గట్లనర్సింగాపూర్, మల్లంపల్లి ప్రజలు దొరలు, భూస్వాములు కింద దోపిడీకి గురయ్యారు. వెట్టిచాకిరీ చేయాల్సి వచ్చేది. మాల, మాదిగ, మంగలి, కుమ్మరి, సాకలి, సాలే, కమ్మరి, వడ్రంగి, గౌండ్ల, తెనుగు, గొల్లలు ఆ భూస్వాముల కింద వెట్టిచాకిరీ చేయవలసిందే. వాళ్లు చెప్పినట్లు వినవలసిందే. వినకపోతే చంపివేయడమే. ఆ రకంగా భూస్వాములదే పెత్తనం. మొత్తంగా రాజ్యమే వారిది. వారి తాబేదార్ల కింద నగిలి పోవలసిందే. పోలీసు పటేండ్లు వారి కావలి కుక్కలు. భూస్వాములు చెప్పినట్లు చేయాల్సిందే. భూస్వాముల కచ్చీరులోనే ప్రతి సమస్య పరిష్కారం కావాలి. ప్రజలు తమ బతుకు గురించి మాట్లాడే హక్కులేదు. మహిళలు భూస్వాముల క్రూరత్వానికి బలికావల్సిందే.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వెట్టి చాకిరీ నుండి కొంతమేరకు ప్రజలను విముక్తి చేసింది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చైతన్యాన్ని అందుకున్న ప్రజలు తిరిగి పోరాడే శక్తులుగా పోరాటాలను నిర్మించారు. ఆ క్రమంలో జరిగినదే 1977 జగిత్యాల రైతాంగ పోరాటం. వెట్టిచాకిరీ నుంచి పూర్తిగా విముక్తి చేయడానికి, కూలీరేట్లు శ్రమను గౌరవించే రీతిలో పెంచడానికి, అణగారిన కులాలకు, బడుగు, బలహీన వర్గాలకు, అగ్రకులాలలో ఉన్న పేదలకు భూమి రావడానికి జగిత్యాల రైతాంగ పోరాటాలు ఆదర్శంగా జరిగాయి.

భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో పీపుల్స్‌వార్ ఉద్యమం వ్యాప్తి చెందడానికి, బీద, బిక్కి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉండడానికి పీపుల్స్‌వార్ ఉద్యమ త్యాగాలే చిహ్నం. జల్, జంగిల్, జమీన్ మీద పూర్తి హక్కులను సాధించడానికి కొమురంభీం పోరాట వారసులుగా ఉద్యమాన్ని నిర్మించారు. ఆదివాసుల జీవితాలలో పూర్తిగా మమేకమై, తమలో ఒకరిగా ఉంటూ ఆదివాసులపై దాడిచేసిన భూస్వాములను ఎదిరించి, ఆదివాసుల జీవితాలకు భరోసానివ్వడమే కాకుండా 'మా గూడెంలో మా రాజ్యం' అనే పోరాట చైతన్యాన్ని అమలు పరచారు. నిత్య నిర్బంధాన్ని పాలకులు అమలు చేసినప్పటికి స్వేచ్ఛా వాతావరణాన్ని ఆదివాసీ సమాజానికి కల్పించారు.

'విద్యార్థులు గ్రామాలకు తరలండి' అనే పోరాట నినాదంతో ముందుకు వెళ్ళి పన్నెండు వేల గ్రామాల్లో మూడు కోట్లకు పైగా ప్రజల బతుకు దృశ్యాలను అధ్యయనం చేసింది. అందరిని సమీకరించింది. పోరాటాల వైపుగా కదిలించింది. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ఐక్యంగా ఆత్మగౌరవంతో బతికే ప్రజానీకాన్ని తయారు చేసింది. లక్ష్యాన్ని సాధించింది.

ఇక సింగరేణిలో సింగరేణి కార్మిక సమాఖ్య (సి.కా.స)గా భారతదేశ బొగ్గుగని కార్మికుల చరిత్రలోనే ఒక నూతన ఒరవడిని సృష్టించి కార్మికోద్యమాన్ని నిర్మించింది. సింగరేణి బొగ్గులో జరుగుతున్న శ్రమదోపిడీని ఎదిరిస్తూ అనేక పోరాటాలు చేసి కార్మికులకు అండగా నిలిచింది. అందుకే సి.కా.స.ను కార్మిక లోకం గుండెల్లో దాచుకున్నది. ఇది సహించని పాలకపక్షం సి.కా.సపై నిర్బంధం విధించింది.

ఈ విధంగా అప్పటి పీపుల్స్‌వార్ నాయకత్వంలో ప్రజలు వివిధ ప్రాంతాలలో, వివిధ రూపాలలో వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలను నిర్మించారు. ఆ క్రమంలో 1977 నుండి 1990 వరకు కరీంనగర్ జిల్లాలో అమరులైన అమరుల త్యాగాలకు చిహ్నంగా 88 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఈ స్థూప నిర్మాణానికి ఏడాది కాలం పట్టింది.

కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్ కేంద్రంగా ఉన్న స్థూపం నిర్మాణంలో హుస్నాబాద్, హుజూరాబాద్ సరిహద్దునే ఉన్న వరంగల్ జిల్లాలోని చేర్యాల, మద్దూరు, తరిగొప్పుల ప్రాంతాల ప్రజలు భారీ సంఖ్యలో రోజువారీ వంతున పాల్గొన్నారు. ప్రజలు మట్టిని తవ్వడం, రాయిని కొట్టడం, వాటిని ఎడ్ల బండ్లలో అక్కడికి చేర్చడం, నీళ్ళు తేవడం, సుతారి వాళ్ళు సుతారి పని చేయడం, సిమెంటును ప్రజలనుండి స్వచ్ఛందంగా అడగడం, పాలరాయి, అతిపెద్దదైన

(మిగతా.... 38వ పేజీలో)

స్పందన

అజాద్ విగ్రహం కూల్చివేత నేర్పుతున్న పాఠం

- శాఖమూరి రవి

కొన్ని విషయాలు అంత ప్రాధాన్యత లేకపోయిన పత్రికల్లో పతాకశీర్షికన నిలబడతాయి. కొన్ని విషయాలు ప్రపంచానికి తెలవాల్సినవైనా జిల్లా పేజికో, డివిజన్ పేజికో పరిమితమై పోతుంటాయి. అట్లాంటిదే ఈ సంఘటన.

ఆగస్ట్ 13వ తేది అర్ధరాత్రి వరంగల్ జిల్లా చిట్యాల మండలం వెలిశాల గ్రామంలోని గాజర్ల సారయ్య అలియాస్ అజాద్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. ఈ విగ్రహం ఏర్పాటు చేసిన దాదాపు నాలుగు నెలల తర్వాత ఈ సంఘటన చోటు చేసుకుంది. సమైక్యాంధ్ర సర్కారు పాలనలో ఆజాద్ స్థూపాన్ని నిర్మించతలపెట్టినప్పుడు స్థూపం రెండడుగులు కూడా పూర్తికాకముందే 'గుర్తు తెలియని' వ్యక్తులు దానిని ధ్వంసం చేశారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఆజాద్ కొడుకులు నవీన్, కిరణ్‌లు తమ తండ్రి 6వ వర్ధంతిని పురస్కరించుకొని ఏప్రిల్ 6న విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ప్రజాస్వామిక హక్కులు పరిరక్షించబడతాయనే నమ్మకంతో వాళ్ళు ఆ విగ్రహ ప్రతిష్ఠాపనకు పూనుకున్నారు. నాలుగు నెలలు కళ్ళారా తండ్రి విగ్రహాన్ని చూసి సంతోషపడ్డారో విగ్రహం కూల్చివేతకు గురైంది. సమైక్యాంధ్ర ప్రదేశ్‌లో జరిగిన సంఘటనే తెలంగాణ రాష్ట్రంలో కూడా పునరావృతమైంది.

మన రాష్ట్రంలో మనకు ఇలా జరగటం ఏమిటా అనుకొని స్థానిక ప్రజల ద్వారా ఎన్నికైన తెలంగాణ శాసనసభా స్పీకర్ సిరికొండ మధుసుదనాచారి దృష్టికి ఈ విషయం తీసికెళ్లారు. అయినా ఎలాంటి ఫలితం లేకపోయింది.

గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్ ఇరవై ఏళ్ళు విప్లవోద్యమంలో పని చేశాడు. తాను నమ్మిన విలువల కోసం తన ఇద్దరి సోదరును విప్లవం వైపు నడిపించాడు. రైతు సేవాసమితి నిర్మాణంలో కీలకభూమిక పోషించాడు. తెలంగాణ జనసభ వైపుకు అనేక మంది యువకులను నడిపించి ప్రజాస్వామిక తెలంగాణ కోసం పనిచేయించాడు. నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలను తృణప్రాయంగా విడిచిపెట్టాడు.

అట్లాంటి మహోన్నత వ్యక్తి గుర్తుగా నిలబెట్టిన విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేసి దానిని చిట్యాల పోలీస్ స్టేషన్ సమీపంలో సబ్‌స్టేషన్ వద్ద పడవేసి వెళ్ళారు.

మావోయిస్టుల స్థూపాలు, విగ్రహాలు కూల్చటం తెలంగాణ ప్రాంతానికి కొత్త కాదు. కాని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత జరిగిన మొట్టమొదటి కూల్చివేతగా దీనిని పరిగణించవచ్చు. ఈ కూల్చివేత సమాజానికి ఏం సందేశమిస్తోంది? కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడ పాత దుర్మార్గాలే పునరావృతం అయితే వాటిని ప్రజలు ఎట్లా అర్థం చేసుకోవాలి? అమరుల విగ్రహ నిర్మాణం సహించలేని వాళ్ళు మావోయిస్ట్ ఎజెండాను అమలు చేస్తామంటే ఆ మాటలను నమ్మడం ఎలా? పాత ప్రభుత్వాల దుర్మార్గాలను కొనసాగిస్తూ పోతే ఇక కొత్త రాష్ట్రం ఏర్పడి ప్రయోజనం ఏమిటి?

ఎవరు ఈ విగ్రహాన్ని కూల్చివేసినా అందుకు పోలీసులు, ప్రభుత్వమే బాధ్యత వహించాలని విప్లవ రచయిత వరవరరావు డిమాండ్ చేశారు. విరసం, బంధుమిత్రుల సంఘం సభ్యులు వెలిశాల దాకా వెళ్ళి వచ్చి అజాద్ విగ్రహాన్ని పోలీసులే కూల్చేసారని ప్రకటించారు. లేక దోషులెవరో ప్రభుత్వమే గుర్తించాలని డిమాండ్ చేసారు.

ఇరువై యేళ్ళు ప్రజల కోసం పని చేసిన వ్యక్తికి బయట శత్రువులు ఎవరుంటారు? ఒకవేళ బయటివాళ్ళే కూల్చివేస్తే ప్రభుత్వం ఎందుకింత వరకు నేరస్తులను గుర్తించలేదు? ఆ బాధ్యత తెలంగాణ రాష్ట్ర పోలీసులది, ప్రభుత్వానిది కాదా?

అందరి యువకుల వలనే అజాద్ కుమారులు నవీన్, కిరణ్‌లకు తెలంగాణ ప్రభుత్వం మీద చాలా ఆశలు ఉన్నాయి. ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుందని నమ్ముతూ వచ్చారు. కాని జరిగిన సంఘటన వాళ్ళ నమ్మకానికి భిన్నంగా ఉంది. ఏ విలువలు కోసం అయితే ప్రజలు కొట్లాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారో ఆ ప్రజాస్వామిక విలువలు నెరవేరకపోతే వాటి సాధన కోసం ప్రజలు తిరిగి పోరాడవలసిన అవసరం ఏర్పడుతుంది. ఈ విషయం అందరూ గుర్తించాల్సిన సందర్భమిది.

పుస్తక సమీక్ష



ఛాయా చిత్ర చరిత్ర మాలిక

- రివేరా

స్థానిక కథనాల సమాహారాన్నే చరిత్ర అని అనవచ్చునేమో! స్వాతంత్ర్యోద్యమకాలంలో ప్రజల్లో జాతీయ భావాలు ఎంతగా నాటుకున్నా అవి స్థానిక కథనాల రూపంలోనే నిక్షిప్తం అయ్యాయి. అలాగే స్థానిక సమాజ మూలాల్లో జాతీయ ఛాయలు కనిపించాయి. అంతర్జాతీయంగా ఎలాంటి పరిణామం చోటుచేసుకున్నా స్థానికంగా దొర, కంపెనీ యజమాని, వడ్డీ వ్యాపారి, పోలీస్ పటేల్‌లకు; ఊరి జనాలకు మధ్య సంబంధంలోనే అది వ్యక్తం అవుతుంది. అదేవిధంగా ఊరి పెత్తందారులుగా ఉండే వీరితో ప్రజలకు ఉండే సంబంధం జాతీయస్థాయిలో పాలకవర్గాల స్వభావాన్ని, అంతర్జాతీయంగా మార్కెట్ శక్తుల స్థితిని సూచిస్తుంది. భారత ఉపఖండంలో సాగిన జాతీయోద్యమాన్ని లిఖితబద్ధం చేయడంలో ఎందుకనో ఈ సమ్యక్, సమన్వయ దృష్టి కొరవడిందని అనిపిస్తుంది. ఈ తప్పుని సరిచేయడానికి జరుగుతున్న ప్రయత్నాలన్నీ చరిత్రకు తమ ఆకాంక్షలను పులిమి సంతృప్తిపడటంగానే మిగిలిపోతున్నాయి. సయ్యద్ నశీర్ అహమ్మద్ ఛాయాచిత్ర సహితంగా ఏర్చికూర్చిన 'చరితార్థులు' ఈ లోటును కొంతైనా తీర్చగల ఒక మంచి ప్రయత్నం. 190 ఏళ్ల జాతీయోద్యమ చరిత్ర (1757-1947)ని భారత ఉపఖండంలోని ముస్లింల జీవనం, వికాసం నుంచి నిక్షిప్తం చేసేందుకు నశీర్ ప్రయత్నించారు. ఈ క్రమంలో 155 పోర్ట్రాయిటులు, తెలుగు, ఇంగ్లిష్‌లోని ముస్లిం దేశభక్తుల సంక్షిప్త చరిత్రలను ఓపిగ్గా సేకరించి ఒక్క దగ్గర కూర్చారు. ఇదంతా ఒక ఎత్తు అయితే, అవశ్యం నమోదు కావాల్సి ఉండి విస్మరణకు గురయిన గాథలను గుర్తుకు తీసుకురావడం ఆయన కృషిలో ప్రధానమైన అంశం. 1992 బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం ముస్లిం విద్యాధిక సమాజంలో పెరిగిన అస్తిత్వ స్పృహ నేపథ్యంగా ఆయన ఈ పనికి పూనుకొని ఉండవచ్చు. లేదంటే 'దేశభక్తి'ని మీదు మిక్కిలిగా చాటుకోవాల్సిన అనివార్యత ఆయనతో ఈ పని చేయించి ఉండవచ్చు. లేదంటే ప్రధాన స్రవంతి భావజాలంలో ముస్లింలనూ భాగస్వాములను చేసే ప్రయత్నం కావచ్చు. దానివల్ల దేశభక్తి భావనకు గల అలవాటైన, సంప్రదాయ చట్రాన్ని ఆయన దాటి బయటకు రాలేకపోవచ్చు. ఇన్ని రకాల పరిమితులు ఉన్నప్పటికీ, జాతీయోద్యమంలో కొద్దిమంది ముస్లింల పేర్లు, అదీ గాంధీ అనుయాయులుగా మిగిలిపోయిన వారిగురించే వినే పరిమితి నుంచి మాత్రం మనల్ని ఈ గ్రంథం బయటపడేస్తుందని చెప్పవచ్చు.

ఎవరిని జాతీయ నాయకులు అనాలనే చర్చ ఇప్పుడు ముందుకొచ్చింది. జాతీయోద్యమ కాలంలో విభేదాలతోనైనా ఒక లక్ష్యం కోసం కలిసి పనిచేసిన నాయకులను ఇప్పుడు విరుద్ధ శిబిరాల్లోకి లాగేస్తున్నారు. ఈ చర్చ ఎందుకోసం, ఎవరిని తొక్కేయడం కోసం మొదలయినా, చరిత్ర రచనాకారులకు పనికివచ్చే విషయాలు కొన్నయినా ప్రస్తావనకు వస్తున్నాయి. బార్డోలీ సత్యాగ్రహం, సోమనాథ్ ఆలయ పునరుద్ధరణ తదితర అంశాలను మాట్లాడాలనేవాళ్లకు ఆ హక్కు ఉంటుంది. అయితే, ఒకసారంటూ అలాంటి చర్చ మొదలయితే అది వారి చేతుల్లోనూ నిలవదు. కోరుకున్న బిందువు దగ్గరో, ప్రయోజనం దగ్గరో మాత్రమే ఆగిపోదు. పైగా స్థానిక సమాజ చరిత్రల్లోకి చర్చ విస్తరిస్తున్నకొద్దీ వారే ఇబ్బందుల్లో పడిపోతారు. అప్పుడు అసలు ఏది జాతీయోద్యమం, ఏది జాతీయ నాయకత్వం అనేది తేలిపోవాల్సిన అంశంగా ముందుకొస్తుంది. అప్పుడు మూడు నాలుగు పేర్ల చుట్టూ తిరిగే స్వాతంత్ర్యోద్యమ చరిత్ర కోట్లాది మంది అసంపూర్ణ ఆకాంక్షలను తాకి..అనంతర పోరాటానికి రంగం సిద్ధం చేస్తుంది. అందువల్లనే నశీర్ 1947ని గీటురాయిగా పెట్టుకొన్నా, ఆయన పరిచయం చేసినవారిలో ఎక్కువమంది ఆ కాలాన్ని దాటుకొని ముందుకొచ్చేయడం కనిపిస్తున్నది. సాధారణంగా చారిత్రక ఘట్టాల్లో పాల్గొనేవారు తాము చరిత్రని సృష్టిస్తున్నామని అనుకోరు. అంతర్జాతీయ సంచలనాలకు స్థానిక ప్రతిస్పందనలుగా వారు ముందుకొస్తారు. సోవియట్ విప్లవం నుంచి జాతీయోద్యమంలోని రాడికల్ ధోరణులు, వహాబీ, ఖిలాఫత్ ఉద్యమాల నుంచి భారతదేశంలోని విద్యాధిక ముస్లిం యువత ప్రేరణని పొందటం చూశాం. అయితే, ఈ ప్రేరణలకు ఒక కొనసాగింపు ఉంటుంది. జాతీయోద్యమ లక్ష్యాలను ఉద్దీపించడంతోనే అవి ఆగిపోవు. ఈ ఉద్యమానికి సమాంతరంగానో, ప్రత్యామ్నాయంగానో జరిగే ప్రయత్నాలను చరిత్ర పునాదిపై నిలబెడతాయి. అందువల్లనే జాతీయోద్యమంలో కాంగ్రెస్ పిలుపులకు అటూఇటూగా స్పందిస్తూనే కమ్యూనిస్టు పార్టీ, ముస్లిం లీగు సొంతదారిని ఎంచుకొన్నాయి.

గాంధీ ప్రవేశంతో జాతీయోద్యమ నాయకత్వం పూర్తిగా దళారి బూర్జువాల చేతుల్లోకి పోయి, మితవాద హిందుత్వ భావజాలంలోకి జారిపోయింది. అంతర్జాతీయ రాజకీయ అవగాహనతో పనిచేసే కమ్యూనిస్టు పార్టీ, లీగులు..ఉద్యమంలో మారిన నాయకత్వ కూర్పుపై నేరుగా నిరసన ప్రకటించాయి. అలాగని అవి దేశభక్తి ఉద్యమాలు కాకుండా పోతాయా? మనిషిని మనిషి దోచుకోని సమాజం కోసం ప్రాణార్పణ చేసిన సోషలిస్టు విప్లవకారులు దేశభక్తులు కారా? అలాగే..కలకత్తా తీరంపై దాడిచేసిన ఈస్ట్ ఇండియా కంపెనీని ఎదుర్కొనడంలో నవాబు సిరాజుద్దౌలాను కుటుంబ పోరే ప్రేరేపించవచ్చుగానీ..ఆయన తెగువ జాతీయోద్యమానికి తొలిపాదులు తీసింది. వలసలను పెంచుకొంటూ, మార్కెట్‌ని విస్తరించుకొనే క్రమంలో ఇంగ్లండ్, ఫ్రెంచీల మధ్య రగిలిన ఆధిపత్యపోరు టిప్పుసుల్తాన్ వధకు దారితీయవచ్చు. కానీ, సామ్రాజ్యవాదానికి కత్తిని చూపించిన స్వతంత్ర రాజుగానే టిప్పు గుర్తుండిపోతాడు. ఇలా అనేకనేక కారణాలతో బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా సమీకృతం

అనువాదం:

ఇంతకూ సమాజంలో సాహిత్యకారుల పాత్ర ఏమిటి?

- నిక్ హోల్డ్‌స్టాక్

అనువాదం: **మిసిమి**

రచయితకు ప్రపంచం బాధ పట్టాలా వద్దా అని ఈ మధ్య నాకో సందేహమొచ్చింది. ఇదేదో యథాలాపంగా విసిరే మామూలు ప్రశ్న కాదు. నేనో విషయం తెలుసుకోవాలనుకుంటున్నాను. రచయితలు, ముఖ్యంగా సృజనాత్మక రచయితలు ప్రాపంచిక ఘటనలతో ఎంత సన్నిహితంగా ఉండాలి? స్పష్టంగా చెప్పాలంటే మనమంతా దు:ఖానికి స్పందించే వాళ్ళం కదా. తెర మీద బాంబు దాడుల దృశ్యాలో, ఆకలి చావులో చూసినప్పుడు బాధపడతాం. ఒక్కోసారి ఆవేశపడతాం. మన మిత్రులతో, సహోద్యోగులతో వాటిని గురించి చర్చిస్తాం. ఫేస్‌బుక్‌లోనో, ట్విట్టర్‌లోనో షేర్ చేసుకుంటాం. రాయబార కార్యాలయాల బయట కరపత్రాల వంటివి పంచడమో, కొన్ని వేల మంది గుంపుతో కలిసి నగర కూడళ్ళలో ర్యాలీ చేయడమో కూడా చేస్తాం. మొత్తం మీద నేనేమనుకుంటానంటే మనం సామాజికంగా, రాజకీయంగా ఎంతో కొంత బాధ్యత ఉన్న పౌరులుగానే ఉంటాం (ఉండాలని అనుకుంటాను, కనీసం). నా ప్రశ్నేమిటంటే సాహిత్యకారులకు ఏదైనా ఇంకాస్త ఎక్కువ చేయాల్సిన నైతిక బాధ్యత ఉండదా అని.

ఈ అంశానికి సంబంధించినవే అయిన రెండు సభల్లో ఈ ఏడాది నేను పాల్గొన్నాను. ఒకటి న్యూయార్క్ పట్టణంలో జరిగిన 'పెన్' వరల్డ్ వాయిసెస్ ఫెస్టివల్ (ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రచయితలను, ముఖ్యంగా దాడులకు వెరవక భావాలను నిర్భయంగా, స్వేచ్ఛగా ప్రకటించే రచయితల సాహిత్యోత్సవం అని దీని గురించి నిర్వాహకులు చెప్తారు. పెన్ అనే అంతర్జాతీయ సాహిత్య వేదిక 2005 నుండి ప్రతి ఏటా వరల్డ్ వాయిసెస్ ఫెస్టివల్ నిర్వహిస్తోంది. సల్మాన్ రష్దీ కొంత కాలం దీనికి అధ్యక్షుడిగా ఉన్నాడు- అనువాదకురాలు). రెండు క్రొయేషియాలోని జాగ్రెబ్‌లో జరిగిన సబ్‌వర్సివ్ ఫెస్టివల్ (ఉద్యమ సాహిత్యాన్ని బలపరిచే సాహిత్యోత్సవం. వరల్డ్ సోషల్ ఫోరమ్ 2008 నుండి దీనిని ప్రతి ఏటా నిర్వహిస్తుంది -అనువాదకురాలు). పెన్ భావప్రకటనా స్వేచ్ఛను బలపరిచే ఒక అంతర్జాతీయ సంస్థ. చాలా దేశాల్లో పెన్ స్థానిక శాఖలు ఉన్నాయి. అయితే అమెరికా యూనిట్ పెద్దదిగా, అత్యంత ప్రభావశీలంగా కూడా పనిచేస్తోంది. ఈ ప్రపంచ భావ ప్రకటనా ఉత్సవానికి కార్పొరేట్ స్పాన్సర్లు ఉండటంతో మన్‌హట్టన్ విలాసవంతమైన పెన్‌హౌస్ బార్లలో పార్టీలు ఏర్పాటు చేశారు. ఈ తరహా ఏర్పాట్లు చాలా మంది రచయితలకు కొత్త. స్టాండర్ట్ హోటల్ వరండాలో నిల్చుని చేతిలో ముదురు నారింజ రంగు నిగ్రోని(ఒక కాక్‌టైల్ తరహా మద్యం -అను)తో రాత్రి పూట హడ్సన్ నది మీదుగా చూపులు సారిస్తున్నప్పుడు నా బుర్రలో చాలా విషయాలు దొర్లుతూ పోయాయి. కాని వాటిలో తీవ్రమైన సామాజిక సమస్యలను నవలా ప్రక్రియలో పొందుపర్చడం గురించిన ఆలోచన మాత్రం లేదు.

కేవలం కొన్ని డ్రింక్స్‌తో చిన్నా చితకా రచయితలు ఎలా పడిపోతారనడానికి ఇది మాత్రమే రుజువు కాదు. పెన్ ఉత్సవం ప్రధానంగా ఒక 'సాహిత్యోత్సవం'. వారం వరకు నేను పాల్గొన్న కార్యక్రమాల్లో 'నిర్భయంగా రచనలు చేయడం' (బ్రేవరీ) అనే ఈ ఏడాది చర్చనీయాంశం గురించి కొద్దిపాటి చర్చ కూడా చోటు చేసుకోలేదు. రచన జీవన్మరణ సమస్యగా ఉంటూ వచ్చిన, లేదా ఇంకా ఉంటున్న కొన్ని దేశాల (బర్మా, పాలస్తీనా, దక్షిణాఫ్రికా) సాహిత్యానికి అక్కడి చర్చల్లో స్థానం ఉందంటే ఉంది. జెండర్, లైంగికత వంటి విషయాల్లో ఉన్న ప్రామాణికతల్ని ప్రశ్నించే సాహిత్యం గురించిన చర్చల్లానే అది కూడా. సాహిత్యం ఫలానా కర్తవ్యాన్ని నిర్వర్తించాలి అని ఎవరూ చెప్పినట్లుగా నాకు గుర్తు లేదు. కాని సాహిత్యం చేయదగ్గ పనుల్లో అసమానతల్ని, అన్యాయాన్ని ఎత్తి చూపడం 'కూడా' ఉండవచ్చుననే అంగీకారం ఉన్నట్లుంది.

ఒక రచయిత రాసిన అంశంతో సంబంధం లేకుండా కొన్ని సార్లు చర్చలు సాగుతుంటాయి. ఈ సాహిత్యోత్సవంలో అంతరించిపోతున్న భాషల గురించిన చర్చను నిర్వహించే ప్యానల్‌లో నేనూ ఉన్నాను. భాషలు అంతరించిపోవడానికి గల కారణాలను అది విశ్లేషించింది. ఒక అంచనా ప్రకారం ప్రతి రెండు వారాలకు ఒకానొక బాష మాట్లాడే చిట్ట చివరి మనిషి చనిపోతున్నాడని, ఈ

అయినవారు చరిత్రలో ఎందరో కనిపిస్తారు. అటువంటి చక్రవర్తులు, సంస్థానాధీశులు, రాజులు, అధికారులు, ఉన్నత విద్యావంతులు, మౌల్వీల కృషిని దేశభక్త ఆవరణలోకి తీసుకుర్రావడం మంచి విషయం. ఐతే, 1857 సిపాయిల తిరుగుబాటుకు ముందు జీవించినవారి ఘర్షణకూ, ఆ తరువాతితరం సమస్యలకూ మధ్య మౌలికంగానే తేడా ఉంది. చరిత్రలోని కొన్ని మైలురాళ్లు, గీటురాళ్ల పట్ల అప్రమత్తత అవసరం. లేదంటే వేర్వేరు కాలాల్లో జీవించినవారి జీవన వ్యక్తిత్వాలన్నీ ఒకే మూసలోకి చేరిపోతాయి. చారిత్రక ఘట్టాల మధ్య ఉండే ఏకసూత్రతని పట్టుకోవాల్సిందేగానీ, ఆ ప్రయత్నం భిన్నకోణాలను బలిపెట్టేదిగా ఉండరాదు. భారతీయ ముస్లిం సమాజానికి చరిత్ర వేదికపై గౌరవ ప్రతిష్టలను కల్పించే పనిలో ఉన్న నశీర్.. ఈ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి.

చరితార్థులు (ముస్లిం యోధుల చిత్రపటాలు, సంక్షిప్త వివరాలు), రచయిత : సయ్యద్ నశీర్ అహమ్మద్, వెల : రూ. 1000/-, పేజీలు : 352 (ఏ4 సైజు), ప్రతులకు : ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్, 3-506, అప్పాఘర్, ఉండవల్లి సెంటర్, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా - 522 501; సెల్ : 94402 41727

శతాబ్దం చివరికల్లా ప్రస్తుతం ఉనికిలో ఉన్న భాషల్లో సగానికి సగం అంతరించిపోతాయని తెలిసింది. మెజారిటీ భాష ఫలానా అని ప్రభుత్వాలు నిర్దేశించడం వల్ల, అణచివేత, వివక్షతలతో మిగితా భాషలను అంచులదాకా నెట్టివేయడం వల్ల ఈ పరిస్థితి దాపురిస్తోంది. వెల్ష్ భాష, బ్రిటిష్ కొలంబియా, మెక్సికో మూలవాసుల భాషల గురించి చర్చిస్తున్న సందర్భంలో ఈ విషయాలు మేం మాట్లాడాం. అందులో ఒకరు కలగజేసుకుంటూ 'ఒక దేశ పౌరసత్వానికుండే భాషా నిర్వచనాన్ని సవాలు చేయడం ప్రమాదకరమని, అట్లా భాషను ఉపయోగించడం ఒక రాజకీయ చర్య అవుతుందని' అభ్యంతరం లేవనెత్తారు.

రాజకీయాలు పౌరులకన్నా రచయితకు మరింత ఆవశ్యకమని ఆలోచిస్తూ నేను న్యూయార్క్ నుండి బయలుదేరలేదు. కాని రచయితగా నువ్వలా లేకపోతే కనీసం కొంచెమైనా అలా ఉండే ప్రయత్నం చేయవచ్చని ఆలోచించేలా చేసింది న్యూయార్క్.

* * *

జాగ్రెబ్ సభల్లో పెన్ వారి క్రొయేషియా శాఖ కూడా పాలుపంచుకుంది. సబ్‌వర్సివ్ ఫెస్టివల్ యూరోపియన్ రాడికల్ వామపక్షాల రెండు వారాల సుదీర్ఘ సమావేశం. అందులో ఒక ఫిల్మ్ ఫెస్టివల్‌తో పాటు స్థానిక వనరులపై స్థానికుల హక్కులు, జాతీయవాదం, నయాఉదారవాదం, యూరోపియన్ యూనియన్ ఊహా స్వర్గం, యూరోప్ వామపక్షాల పాత్ర వంటి అంశాల మీద రాజకీయ వర్క్‌షాపులు ఉన్నాయి. పెన్ నిర్వహించిన ప్రపంచ భావ ప్రకటనా ఉత్సవం మాదిరిగానే దీనికీ ప్రఖ్యాత రచయితల ఆకర్షణ ఉంది. స్లావోజ్ జిజాక్, తారీఖ్ అలీ, సస్కియా ససెన్ వంటి వాళ్ళు పాల్గొన్నారు. తేడా ఏమిటంటే వీరు పాల్గొన్న కార్యక్రమాల్లో అందరికీ ప్రవేశం ఉంది.

సబ్‌వర్సివ్ ఫెస్టివల్ గురించి మొట్టమొదట చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే దీనిని నిర్వహించే వేదిక యూరోప్ వ్యాప్తంగా నయాఉదారవాద విధానాల వల్ల పెల్లుబికిన సామాజిక ఆర్థిక సంక్షోభాలను విస్తృతంగా చర్చించేందుకు నిజాయితీగానే ప్రయత్నిస్తున్నది. అతి ముఖ్యమైన సామాజిక సమస్యలను అది చర్చించడమే కాక వివిధ సమూహాల మధ్య అనుసంధాన కర్తగానూ, నేను విన్న కొన్ని సుదీర్ఘమైన గంభీరోపన్యాసాల వాహికగానూ అది అక్కడ పనిచేస్తున్నది. వాటిని వింటున్న ప్రజలు ప్రపంచ ద్రవ్య పెట్టుబడిని నిరసిస్తూ ఒక గంట వ్యవధిలో అయిదుసార్లు ఆగ్రహావేశాలు ప్రదర్శించకపోయి ఉంటే అది కేవలం ప్రహసనంగా ఉండేది. నేనేదో అలవోకగానో, విమర్శగానో ఈ వ్యాఖ్య చేయడం లేదు. ఆ వాతావరణం ఎంత రాజకీయ కమిట్‌మెంట్‌తో నిండి ఉందో చెప్పాలనే నా ఉద్దేశం. అంటువంటి చోట ఒక సాహిత్యకారుని సృజన సామాజిక, రాజకీయ అంశాలతో ముడిపడి ఉండాలా అని ప్రత్యేకించి అడగడం కూడా అసంబద్ధం అవుతుంది. అది బాగానే ఉంది కాని ఈ అంశం మీద ఒక రెండు గంటల చర్చను నేను నిర్వహించవలసి వచ్చింది. అలాంటి ప్రశ్న అడిగినప్పుడు 'అంతేగా మరి' అని కళ్ళు తిప్పుతూ రచయితలు ఒక్క నిమిషంలో సమాధానం చెబితే ఇంకా గంటా యాభై తొమ్మిది నిమిషాలు మిగిలే ఉంటాయి.

ఇక నాకు మిగిలిందల్లా డెవిల్స్ అడ్వకేట్ పాత్ర పోషిస్తూ చర్చకు ప్రేరేపించే ప్రశ్నలు వ్యూహాత్మకంగా వేసి వారు నాకు క్లాసు పీకి వదిలిపెట్టేదాకా ఉండటమే. కాల్పనిక సాహిత్యాన్ని రాజకీయ వేదికగా ఉపయోగించే ప్రయత్నం ఎందుకు చేయకూడదనడానికి నేను మూడు కారణాలను ఆలోచించాను.

మొదటిది, ఒక కథో, నవలో రాజకీయ ప్రసంగంగా తయారయ్యే ప్రమాదం ఉంటుంది. అప్పుడది ప్రచార వేదిక అవుతుంది కాని సాహిత్యం అవ్వదు (నా ఉద్దేశంలో సాహిత్యం భిన్న కోణాల నుండి ఆలోచనలను ప్రేరేపిస్తూ ఓపెన్ ఎండెడ్‌గా ఉండాలని సవినయంగా చెప్పాను). అప్‌టన్ సిన్‌క్లెయిర్ దారుణమైన నవలలు వామపక్ష రాజకీయ సాహిత్యపు ఒక వైపు ఉదాహరణ అయితే మరో వైపు అయాన్ రాండ్ పరోక్ష ఫాసిస్టు నవలలు నిలుస్తాయి. అయితే మరి సామాజిక దృక్పథంతో మంచి కాల్పనిక సాహిత్యం ఉండదా? క్యాచ్ 22, బ్రేవ్ న్యూ వరల్డ్, బ్రోకన్ ఏప్రిల్ వంటి అద్భుతాలు ఉన్నాయి.

సామాజిక సమస్యల్ని సాహిత్యంలోకి తీసుకురావద్దనడానికి రెండో కారణం రచయితలు ప్రాపంచిక విషయాల గురించి అజ్ఞానాన్ని, మూర్ఖత్వాన్ని వేరెవ్వరికన్నా ఎక్కువగా మాట్లాడే అవకాశం ఉంది కాబట్టి. మీ నవలకో, కథకో మీరెంతో పరిశోధన చేశారని మీరనుకోవచ్చు. ఏదైనా అంశం మీద అయిదో, పదో పుస్తకాలు చదవడమో (ఇంకా చెప్పాలంటే అయిదో పదో ఇంటర్నెట్ పేజీలు తెరవడమో) చేసినంత మాత్రాన అది ఇస్లాం గురించో, ఆక్యుపై ఉద్యమాల గురించో, కాందిశీకుల గురించో నిర్ధారణలు చేయడానికి మీకు అర్హత ఉన్నట్లు కాదు. ఒక చక్కటి వాక్యం (లేదా ఒక పేరా) రాయడం చేతనైనంత మాత్రాన మీరు రాజకీయ వ్యాఖ్యాత కాలేరు.

మూడోది– నాకే ఇంకా స్పష్టంగా లేదు. కాని మొదటి రెండు పాయింట్ల మీద న్యాయమైన, తగినంత గట్టి ప్రతిస్పందన ఉంటుందనుకుంటాను.

మా ప్యానల్ ఒక ఇరుకు గదిలో కూర్చుంది. ఒకదానికొకటి సారూప్యత లేని కుర్చీలు దాదాపు సగం స్థలం ఆక్రమించాయి. నాతో పాటు మరో ముగ్గురు రచయితలున్నారు. వారి గురించి నాకు పెద్దగా పరిచయం లేదు. వారి బయోగ్రఫీల్లో ఉన్న విషయాలు తప్ప. మొదలు పెట్టడం వివాదరహితంగా ఉంటే బాగుంటుంది అనుకున్నాను. ఆ తర్వాత నా ఉత్తుత్తి అభ్యంతరాలను పెట్టొచ్చు. మొదట పానల్‌లో ఉన్న వాళ్ళను ఎంగేజ్డ్ లిటరేచర్, అంటే స్పష్టంగా కనిపించే రాజకీయ దృక్పథంతో చేసే రచన అని దానిని నిర్వచిస్తూ దాని మీద మాట్లాడమని అడిగాను. ఆన్‌డ్రెజ్ నికొలాయ్‌డిస్ మొదట మాట్లాడుతూ ప్రధాన స్రవంతికి ఎదురీది చైతన్యవంతం చేయడం రచయిత బాధ్యత అన్నాడు. మరొక రచయిత్రి ఇవానా సాజ్‌కో సాహిత్యం ప్రజల్ని చైతన్యవంతం చేయడం అనేది సాధారణంగా ఉండదని మాట్లాడింది. రచయిత సంఘర్షణ ప్రధానంగా తనతో తాను చేసేదే అయి ఉంటుందని ఆమె అభిప్రాయం. ప్యానెల్‌లో మూడో వ్యక్తి గ్రజీనా ప్లెబనెక్ దానిని మరింత దూరం తీసుకుపోతూ ఆమె సామాజిక కార్యాచరణలో భాగమైనప్పుడు ఒక పౌరురాలిగానే ఉంటుంది కాని రచయితగా కాదు అని చెప్పింది.

ఇది నాకు చాలా ఆసక్తికరంగానూ అదే సమయంలో చాలా రెచ్చగొట్టేదిగానూ ఉంది. సాహిత్యానికి మార్పును తీసుకొచ్చే పురోగామి రాజకీయ శక్తి ఉంటుందని వాళ్ళు ఒప్పుకునేలా చర్చను మళ్లించే ప్రయత్నం చేశాను. రాజకీయ కార్యాచరణలో నేరుగా భాగస్వామ్యం అయ్యే రచయితల సంగతేంటని అడిగాను. పెద్దగా ప్రయోజనం లేకపోయింది. కొన్ని మంచి మాటలు, చాలా సంక్షిప్తంగానైనా గతంలో బాల్కన్ ప్రాంతాల్లో సాహిత్యాన్ని ప్రతిపక్షంగా ఎలా వాడుకున్నారో వినిపించాయి. వెంటనే రాజకీయ ప్రత్యర్థుల్లాగా వాదనలు గడగడా వచ్చేసాయి. 'నాకే రాజకీయాల గురించి తెలీదు', 'ప్రజాస్వామ్యం వంటి విషయాలు బోర్ కొట్టిస్తాయి'.

'మరి ఇంటర్వ్యూల సంగతేమిటి?' అనడిగాను. 'రచయితను సామాజిక సమస్యల గురించి స్పష్టంగా అడుగుతారు కదా?'

నిజమేనని ఒప్పుకున్నారు. అయితే ఇది చర్చకు ఏ మాత్రం పనికొచ్చేది కాదు. ఆండ్రెజ్ నవ్వుతూ అన్నాడు. థామస్ పిన్‌ఛన్ లాగా (ఎవరితోనూ కలవని ఈ అమెరికన్ రచయితను ఎప్పుడూ ఎవరూ ఇంటర్వ్యూ చేయలేదు) రచయిత తన పుస్తకాల్లో మాత్రమే ఉండాలేమో. నిజంగా ఆయన అట్లా ఉంటేనే మేలని కసిగా అనుకున్నాను.

రచయిత ప్రభావశీలత పట్ల సాధారణంగా ఉండే విశ్వాసాన్ని వారు బయటపెట్టుకునేలా చివరి అస్త్రాన్ని వదిలాను. సాంస్కృతిక స్థాయి వల్ల, పాఠకుల వల్ల రచయితలు సామాజిక రాజకీయ అంశాల మీద సమాజంలో అవగాహనను పెంపొందించే అవకాశమైతే ఉంటుంది కదా అంటే.. 'ఒక్కోసారి ఉండొచ్చు. ఆ పని చేయడానికి రచయిత సోషల్ మీడియాను ఉపయోగించుకోవచ్చు.'

ఓహ్! ట్విటర్‌ను ఉపయోగించి రచయితలు సమాజాన్ని ప్రభావితం చేయవచ్చనే విప్లవాత్మక ఆలోచన ఎంతో కొంత నవ్వులు పుట్టించింది. 'ఒక సామాజిక కార్యకర్త కన్నా బాగా ట్వీట్ చేయలేనప్పుడు నువ్వాపని చేయక్కర్లేదు' అని ఓ తక్షణ ప్రతిస్పందన. 'హింసను గురించి కథ రాయాలి. ట్వీట్ కాదు' మరోటి. ఇంకొంత నిర్దిష్టమైన అభ్యంతరం '140 అక్షరాల్లో ఇమిడే దానికి భిన్నంగా ఉంటాయి మన రాతలు' అని. అప్పుడు నేనే అన్నట్లు నవల రాయడం, ట్వీట్ చేయడం పరస్పర వ్యతిరేకమైన చర్యలేం కావు. ఒక సమస్య పట్ల రకరకాల ప్రతిస్పందనలుంటాయి.

నా చిట్ట చివరి ఆశ కనీసం ప్రేక్షకుల నుండి ప్యానల్‌ను సవాలు చేసే ప్రశ్నలు వస్తాయని. కానీ సామాజిక ప్రయోజనంతో ప్రమేయం లేని సాహిత్యం అంటున్నప్పుడు వాళ్ళకూ ఇబ్బంది ఉన్నట్లు కనపడలేదు. ఒక వ్యక్తి అన్నాడు 'మీరు మమ్మల్ని గుహలో నుండి బైటికి తేవాలనుకుంటున్నారా? నినాదాలు చేయడమో, జెండాలు పట్టుకుని పోవడమో చేయక్కర్లేదు. మీరు మమ్మల్ని ఆలోచించేలా చేయాలి. మార్పు అవసరమా కాదా అని. అసలు ఏ మార్పూ అవసరం లేదని కొందరనుకుంటారు. మీ రాతల మంచి చెడ్డల గురించి ఆలోచించండి చాలు.'

సాహిత్యంలో కళాత్మక శిల్పమే అన్నిటి కన్నా ముఖ్యమని నేననలేను. అట్లని రచయిత పాత్ర, సామాజిక కార్యకర్త పాత్ర ఒకటి కాదు. ప్రజల ఆలోచనల్ని, విశ్వాసాలను ప్రభావితం చేయాలని మనమకోనప్పుడు అసలు రాయడమెందుకు? ఏ రచనలోనైనా ఎంతో కొంత ఉపదేశించే కోణం ఉండదా? సాహిత్యం ఎందుకు అనే ప్రశ్న పాతబడిపోయినదో, అనవసరమైనదో కాదు. గొప్ప స్వీడిష్ రచయిత స్వెన్ లిండ్‌క్విస్ట్ అడిగినట్లు

'ఈ ప్రపంచం కన్నా గొప్పదా కళ? సామూహిక శ్మశాన వాటికలు కూడా సామాన్యంగా కనపడేలా చేయడమా కళ చేయాల్సిన పని?'

(నిక్ హోల్డ్‌స్టాక్ గత ఏడాది రెండు అంతర్జాతీయ సాహిత్యోత్సవాల్లో పాల్గొన్న అనుభవం గురించి నవంబర్ 2013లో రాసిన వ్యాసం. ఇంటర్నెట్ నుండి సేకరణ)

(33వ పేజీ తరువాయి...)

గ్లోబును, దానిపై ఉంచడానికి సుత్తి – కొడవలి, ఇలా అనేకం ప్రజల నుండి సేకరించి స్థూపం నిర్మించారు.

ఈ స్థూప నిర్మాణం జరుగుతున్నపుడు మధ్యలో కూలిపోయి ఒక సుతారి ప్రాణాలను కోల్పోయాడు. కరీంనగర్ జిల్లా విప్లవోద్యమ నాయకుడుగా అమరుడైన మాసాని రవీందర్ తల్లి అక్కడే గుడిసె వేసుకుని ఉండి ఆ నిర్మాణ – బాధ్యతలను చూసుకుంది. అక్కడికి వచ్చే ప్రజలు ఇచ్చిన బియ్యం, చింతపండు, ఉప్పు, పప్పులతో అన్నం, కూర వండి నిర్మాణంలో పాల్గొన్న ప్రజల ఆకలిని తీర్చింది. ఈ విధంగా నిర్మాణమైన స్థూపాన్ని 25 అక్టోబరు 1990న ఇదే ప్రాంతానికి చెందిన పీపుల్స్‌వార్ నాయకుడు పులిరాములు తండ్రి పులి మల్లయ్య ఆవిష్కరించాడు. అదే సంవత్సరంలో విరసం నేత వరవరరావు, అజ్ఞాతం వీడిన గద్దర్ సమక్షంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు, పౌరహక్కుల సంఘాల నాయకులు భారీ సంఖ్యలో జనం పాల్గొన్నారు. ఇది ప్రజల చైతన్యాన్ని నింపిన ప్రకాశవంతమైన స్థూపం. 1992 సంవత్సరంలో మొదటి సారిగా క్రాంతిసేన పేరుతో స్థూపాన్ని కూల్చారు. ఆ తర్వాతి కాలంలో పీపుల్స్‌వార్ అగ్రనేతలు నల్లా ఆదిరెడ్డి, శీలంనరేష్, ఎర్రంరెడ్డి సంతోష్ రెడ్డి ఎన్‌కౌంటర్‌కు నిరసనగా హుస్నాబాద్‌లో 1999 డిసెంబర్ నెలలో మాజీ ఎం.ఎల్.ఎ. బొప్పరాజు లక్ష్మీకాంతరావు ఇంటిని నక్సల్స్ పేల్చివేశారు. దీంతో గ్రీన్ టైగర్స్ పేరుతో డిసెంబర్ 31న ఈ అమరుల స్థూపాన్ని డైనమేట్‌లతో కూల్చివేశారు. అయినప్పటికీ ప్రజల గుండెల్లో మాత్రం చిరస్థాయిగా నిలిచిపోయింది. ఈ రోజు కొన్ని బూర్జువా రాజకీయ పార్టీలు సైతం మావోయిస్టు పార్టీ ఎజెండానే మా ఎజెండా అని చెప్పుకుంటున్నాయి. అంటే బీదా, బిక్కి పీడిత ప్రజల వైపున చేస్తున్న పోరాటాలను సమర్థించినట్లే కదా. ఒప్పుకున్నట్లే కదా. అటువంటప్పుడు తెలంగాణలో మావోయిస్టు పార్టీపై నిర్బంధాన్ని కొనసాగించడం ఎందుకు? ఎత్తివేయాలి.

(25 అక్టోబర్ 2014 నాటికి హుస్నాబాద్ అమరుల స్థూపానికి 24 ఏళ్ళు)

సాహిత్య వ్యాసం

ఇటీవలి విప్లవ కవిత్వం నిర్మాణ, అవగాహన సమస్యలు

- రివేరా

(2)

(గత సంచిక తరువాయి...)

అరుణతార- కవితల పరిశీలన

తాజా అరుణతారలో (జూన్ - జూలై సంచిక) మూడు పాటలు, ఎనిమిది కవితలు, కథలు మూడు, ఒక గల్పిక, సంపాదకీయాలు సహా ఐదు వ్యాసాలు.. ఇంకా కరపత్రాలు, సంస్మరణ, జ్ఞాపకాలు, లేఖ, నివేదికని ప్రచురించారు. కవితల విభాగంలో 'గ్లోబల్ మమ్మీ' అనే కవితను ప్రచురించారు. నిజానికి ఈ కవితా వస్తువు ముప్ఫై ఏళ్ల క్రితమే వచన కవిత్వంలోకి ప్రవేశించింది. ప్రపంచీకరణ క్రమంలో వేలంవెర్రిగా తయారయిన వస్తు వినియోగ సంస్కృతి, యాంత్రికతల పట్ల కవి నిరసన ఇక్కడ సందర్భం. ఇలా బాగా నలిగిపోయిన విషయాలకు కవులు దూరంగా ఉండటమే మంచిది. లేదంటే, చెప్పే పద్ధతి అంటే స్వరం నుంచి వ్యక్తీకరణల వరకూ ప్రతి విషయంలోనూ జాగ్రత్త తీసుకోవాలి. ఇలాంటి వస్తువులకు కవిత్వ రూపం ఇవ్వడం అత్యంత నిర్మాణ శ్రద్ధతో చేయాల్సిన పని. ప్రపంచీకరణ సందర్భం అనేక వైపుల నుంచి అనేక కోణాల్లో జీవన ప్రాంగణంలోకి ప్రవేశిస్తూ ఉంటుంది. వాటిని స్వీయాత్మక అనుభవంలోకి గాఢంగా ఇంకించుకుంటే ఇలాంటి వస్తువునూ రాసి మెప్పించవచ్చు.

అయ్యా! / ప్రపంచ అధ్యక్షా / తెగిన చెవుల కన్నా / పోయిన చెవికమ్మల కోసమే / గోడు గోడున ఏడ్చే వాళ్లమని / మా గురించి మా కన్నా మీకే బాగా తెలుసు (వాస్కోడిగామా. కామ్, దీర్ఘ కవిత, 2000). 'గ్లోబల్ మమ్మీ' కవితతో పోల్చితే ఇది మరింత సరళమైన వ్యక్తీకరణ. వందల ఏళ్ల వలస పాలన, ఎంతకీ వదిలిపెట్టని భూస్వామ్య పీడన, భ్రమాజనిత కలల ప్రపంచంలో పదిలంగా సేదతీరే పట్టణ మధ్యతరగతి కలిసి.. ప్రపంచీకరణ రాకకు నేపథ్యాన్ని ఎలా సమకూర్చి పెట్టాయనేది అద్భుతంగా చెప్పిన కవితాపాదాలివి. సరళ కవితా నిర్మాణం కవిత్వ శక్తిని ఎంతగా పెంచుతుందనేందుకూ ఈ కవిత మంచి ఉదాహరణ. కాబట్టి 'గ్లోబల్ మమ్మీ' కవితలోని సరళ గుణమే పాఠకుడి అనుభూతిని చంపివేసిందని చెప్పలేం. సామాజిక వస్తువు ఇచ్చే భిన్నమైన అనుభవాన్ని గ్రహించలేకపోవడంలోనే అసలు సమస్య ఉంది. అదే శిల్ప శ్రద్ధ కొరవడటంగా వ్యక్తం అయింది. అరుణతారలో ఇలాంటి కొత్త కలాలను తప్పక ప్రోత్సహించాలి. అవసరమైతే కొన్ని మార్పులుచేర్పులతోనైనా వారి కవితని ప్రచురించాలి. అలా ప్రచురిస్తూనే, ఆ కవి దృష్టికి అతని లోపాలను తీసుకొని వెళ్లాలి. ఈ సంప్రదాయం అరుణతారలో తొలినాటినుంచీ ఉంది. ఎందుకనో ఈమధ్య కవిని ఎడ్యుకేట్ చేసే పనిఅంతగా జరగడం లేదు.

ఇదే సంచికలోని మరో కవిత 'సమాధుల్ని శుభ్రం చేయాలిప్పుడు..'. అమరత్వాలను ఎత్తిపట్టాలనే అర్థఛాయ ఈ కవితలో ఉంది. అయితే, ఇప్పుడే ఈ పనిని ఎందుకు కవి చేయాలంటున్నాడో, ఆ నిర్దిష్టత లేక స్పష్టత కనిపించదు. పైగా కొన్ని సందేహాలను మిగుల్చుతున్నది. అమరత్వ ప్రమాణాలను సమీక్షించాలని కవి అడుగుతున్నాడా? స్థాయీభేదం లేకుండా అన్నిరకాల అమరత్వాలకు ఒకే విలువ ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నాడా? విప్లవ కృషిలోభాగంగా సంభవించే అన్నిరకాల మరణాలనూ గుర్తించాలని కోరుతున్నాడా? కవి నిలిచిన నిర్దిష్ట స్థల సందర్భాల నుంచి బూటకపు ఎన్‌కౌంటర్లు, కోవర్టు ఆపరేషన్లు, అనారోగ్యం వంటి రూపాల్లోని మరణాలనే కాక, ఇతరేతర మరణాలనూ అమరత్వంగా గుర్తించాలని, ఈ పనిని తిరిగి మొదటి నుంచి ఎత్తుకోవాలని సూచిస్తున్నాడా? ఇవన్నీ కాకుండా, సామాజిక జీవితంలో ఎన్నడూ లేనంత నిరాశ, నైరాశ్యం పేరుకుపోయినందున, గతంలో కన్నా ఇప్పుడే విప్లవం, విప్లవకారుల అవసరం ఉన్నదని గుర్తు చేస్తున్నాడా? లేదంటే కొంతకాలం పనిచేసి, ఆ తరువాత వేరే ప్రాంతాలకు తరలిపోయిన విప్లవోద్యమం తలపుల్లో కవి మసలుతున్నాడా? అలాగైనా, ఇలాగైనా.. ఎలా అర్థం చేసుకోవాలన్నా కవి వీలు కల్పించడం లేదు. ఈ విషయంలో ప్రతీకలు, పదబంధాలు, పదచిత్రాలు మనకు సాయం చేయడం లేదు. కవిత నడకలోనూ క్రమం లేదు. పంట పండక రైతులు, కలలు పండించుకోలేక యువత చేసుకుంటున్న ఆత్మహత్యల ప్రస్తావనా కనిపిస్తున్నది. ఆయన చెప్పే యోధులు, వీరుల పక్కనే వీరి సమాధులు కూడా ఉన్నాయి. వస్తువుని స్వీకరించడంలోని గందరగోళమే కవిత్వ నిర్మాణంలో సంక్లిష్టతగా వ్యక్తం అయింది. ఈ సంక్లిష్టత కవి సృష్టిస్తున్నదే. దాన్ని విప్లవ కవిత్వానికో, విప్లవ సాహిత్యోద్యమానికో ముడిపెట్టలేం.

సరళ వ్యక్తీకరణ

ఇదే అరుణతార సంచికలో 'మనిషి చిహ్నం' అనే కవిత ఉంది. హిందూత్వ రాజకీయాల పట్ల సమాజాన్ని కవి అలర్ట్ చేస్తున్నాడు. చారిత్రక చైతన్యం, పోరాట నేపథ్యం, దానివల్ల అలవడిన సరళ కవితా నిర్మాణం.. మంచి కవితని చదివిన అనుభూతిని మిగుల్చుతుంది. ఇదనే కాదు, ఈ సంచికలోని మిగతా కవితలను పరిశీలించినా, వస్తు విస్తృతిని, పరిణామ శీలతని విప్లవ కవిత సాధించిందనేది అర్థం అవుతూ ఉంటుంది. పలు ధోరణులుగా చెలామణి అవుతున్న ఇతర కవిత్వాల్లో ఇంత లోతు గానీ, విస్తృతి గానీ కనిపించవు. కవుల రీత్యా చూసినా.. ఈ సంచికలో దాదాపు 25 ఏళ్ల నుంచి రాస్తున్నవారి నుంచి, ఇప్పుడిప్పుడే రాస్తున్నవారి దాకా కనిపిస్తారు. ఇంతటి తరాల వైవిధ్యం.. ఏ ఇతర కవిత్వంలోనూ చూడలేం. అవన్నీ ఒకరిద్దరు కవుల పేరుతోనే ఉనికిలోకి వచ్చి,

వెళ్లిపోతుంటాయి. వస్తు విస్తృతిని పరిశీలిస్తే.. ఈ సంచికలోని ఎనిమిది కవితల్లోనూ వేర్వేరు అనుభవాలు, సందర్భాల పరిచయం ఉంది. ఉత్తర తెలంగాణ ఉద్యమ నాయకుడు సుధాకర్, ఆయన సహచరిల అమరత్వాన్ని, వారి కుమారుడివైపు నుంచి ఎత్తిపట్టడం మొదలు, 'లైబ్రరీలో చదువుకునే హక్కు' కోసం సిఫెల్‌లో సాగిన ఉద్యమం, ఆర్డీఎఫ్ నేత సాయిబాబా అరెస్టు, ప్రపంచీకరణ మార్కెట్, చారిత్రక చిహ్నాలను మత చిహ్నాలుగా కాక, మనిషి చిహ్నాలుగా చూడాలన్న సందేశం, పోలవరం ముంపు, గంటి ప్రసాదం అమరత్వం.. ఇలా సమాజంలోని ప్రతి స్పందనా కవిత్వంలోకి వచ్చింది. ఇందులో ఒక కవిత 'ప్రొటెస్ట్'.. .పొలిమికల్ డిబెట్‌తో నడిచింది. ఈనాడు ఇది ఎంతో అవసరమైన, అందరం సాధించాల్సిన శిల్ప పద్ధతి. మావోయిస్టుల రాజకీయాలు మాట్లాడొద్దని ప్రభుత్వాలు శాసిస్తున్న దశని చూస్తున్నాం. కొత్తగా ఏర్పాటయిన తెలంగాణ రాష్ట్రంలో అప్పుడే మావోయిస్టు పార్టీపై నిషేధం అమల్లోకి వచ్చేసింది. అభివృద్ధికి మావోయిస్టులు అడ్డంకి అనే ప్రచారాన్ని కేసీఆర్ ప్రభుత్వం, అధికార యంత్రాంగం మొదలుపెట్టాయి. ఆంధ్రాలో మావోయిస్టు రాజకీయాలను కాదు కదా.. గ్రీన్‌హంట్ సందర్భంలో ఆదివాసీ హక్కులను గురించి మాట్లాడటాన్ని కూడా చంద్రబాబు ప్రభుత్వం సహించడం లేదు. మావోయిస్టు రాజకీయాలను ప్రజలు ఎందుకు మాట్లాడకూడదని కవులంగా మనం గట్టిగా ప్రశ్నించాల్సిన తరుణం ఇది. పొలిమికల్ డిబెట్‌ని కవిత్వంలోకి ఎంతగా తీసుకొస్తే.. అంతగా ఈ పనిని మనం చేయగలుగుతాం. దబ్బైల దశకం అంతా కవిత్వంలో ఇదే ప్రధాన వ్యక్తీకరణగా ఉండేది. సామాజిక, సాహిత్య వరణంపై నక్సలైట్ రాజకీయాలు బలమైన విమర్శని పెట్టి.. ప్రజా సంప్రదాయాలను స్థాపించిన దశ అది. ఇప్పుడా సంప్రదాయాలు అత్యున్నత దశకు చేరి.. దండకారణ్యంలో జనతన సర్కారుగా రూపాంతరం చెందాయి. కవి అన్నట్టు.. పసిపాప కళ్లతో/ నవ్వే దండకారణ్యం / నేటి కవి సమయం (కవితా ఝుంకార్, గెరిల్లా ప్రేమలేఖ, 2012). ఈ దశలో మరోసారి.. మరింత అభివృద్ధి చెందిన రూపంలో పొలిమికల్ డిబెట్‌ను కవిత్వంలోకి తీసుకురావాల్సి ఉంది. ఇంకొక అత్యవసర శైలీ పద్ధతి వ్యంగ్యం. బలవంతుడి మీద బలహీనుడి శక్తివంతమైన ఆయుధమీ వ్యక్తీకరణ. లక్షల్లో సైన్యం, దేశం ఆ మూల నుంచి ఈ మూలకు క్షణాల్లో చేరుకోగల గగన, భూతల రవాణా సామర్థ్యం. సెల్ ట్యాపింగ్ నుంచి ఉద్యమ కదలికలను బంధించగల ఉపగ్రహ నిఘా వ్యవస్థని కలిగి అన్నివిధాల తీరిఉన్న భారత ప్రభుత్వాన్ని పడగొట్టడం అయ్యేపనేనా? సర్కారు స్థైర్యాన్ని దెబ్బతీయకుండా, దాని కర్కశమైన చర్యల వెనక దాగిన 'కాగితం పులి' భయాన్ని, పిరికితనాన్ని ఎగతాళి పట్టించకుండా అది సాధ్యం కాదు. కవిత్వంలో ఈ పనిని సమర్థంగా చేయగలగింది వ్యంగ్యం. చల్లనీళ్లు తాగుతుంటే / కోపంగా బానని బద్దలు కొట్టిన మమ్మీ / నాక్కూడా నాలుగు చీవాట్లు పెట్టి.. 'గ్లోబల్ మమ్మీ'లోని ఈ పాదాల్లో మంచి వ్యంగ్యం ఉంది. ఒక రకంగా ఇప్పుడు తెలుగు కవిత్వం నవ్వడం మరిచిపోయింది. రాజ్యం గరుకు పెదాలపై సుతారంగా పద్యం రాస్తాను (మీకోసం నేనొక పద్యం రాస్తాను, చనుబాలధార, 2002) అని మన కవి ఉన్నట్టు.. ఈ పనిని కూడా విప్లవ కవిత్వమే చేతుల్లో తీసుకోవాలి. వ్యంగ్యం అంటే రాజకీయ హాస్యం. ఉలిపిరి కాగితం గాలిపటం / ఆకాశంలో చిరంజీవిగా ఎగరడం / శాకాహారుల మధ్య పెరిగిన పిల్లి / అహింసాత్మకంగా బతకడం ఎంత అసహజమైన ఆలోచన! / కంటి చూపానని / ప్రూఫురీడరున్న ప్రెస్‌లో / అచ్చయిన కేలండర్ని తిట్టుకొని లాభం లేదు. (నీ గుండెల నల్ల రాళ్ల మీద, అమ్మచెట్టు, 1979). ఇదీ వ్యంగ్యమే. కానీ పెదవులు కదలకుండా నవ్వడం. కానీ, నవ్వితే బళ్లున తెల్లారాలి. చావు ద్వారం వద్ద నిలబడి పిలుస్తుంటే / గేలి చేస్తూ పగలబడి నవ్వేదెవరు? కబళించిన చావుని తిరిగి గోడకు దిగ్గొట్టేదెవరు? శభాష్! నా వీరులారా / మీరు చావుకే ఘోరీలు కడుతున్నారు

(సముద్రుడి సమయం, 1993) అన్న మన కవి ధిక్కారం, మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే / మమ్మల్ని విభజించి పాలిస్తోందని..

(బందిపోట్లు, కవితా ఓ కవితా సంకలం, 1990) అన్న కవి ఆక్షేపణ కలగలసిన వ్యంగ్యాన్ని కవిత్వంలోకి తీసుకురావాలి.

దేశం ప్రశాంతంగానే ఉంది / అయోధ్యలో ఒక పాత మసీదు నేలమట్టం అయిందంతే / ఎనభై కోట్ల జనాభాలో ఆఫ్ట్రాల్ రెండు వేల మంది ప్రాణాలొదిరాలంతే / అంతకుమించి ఏమి కొంప మునిగిందని/ కర్ఫ్యూలకు భంగం వాటిల్లకుండా కాల్పులు జరిపాం / మనుషులు చచ్చిపోయినా శాంతిని కాపాడటానికి ఎంత కష్టపడ్డామని / భక్తులు రాముడికి పాదసేవ చేసి చేసి విసిగిపోయారు పాపం / వెరైటీగా ఉంటుందని ఒక్కసారి మసీదులో కరసేవ చేసుకోమన్నాం (దేశం ప్రశాంతంగానే ఉంది, 1993, జనవరి అరుణతార)

ఇక ఇదే సంచికలో రెండు ఎలిజీలు కూడా ఉన్నాయి. వాటిని కుమారుడు, మనవడి వైపు నుంచి నిర్వహించిన పద్ధతి.. విప్లవ సాహిత్యోద్యమ పరిణామశీలతకు నిదర్శనం. నిజానికి, వస్తు పరిణామాన్ని సాధించడం ఒకరిద్దరు కవులతో అయ్యేది కాదు. సామాజిక పరిణామ క్రమాన్నంతా ఇంకించుకొని వ్యక్తీకరించడం ద్వారా విప్లవ కవిత్వం పరిణామశీలమవుతూ ఉంటుంది.

చలనం.. ఘర్షణాత్మమూ.. పరిణామశీలమూ..

పరిణామాన్ని చర్చిస్తున్నామంటే స్థితినీ సూచిస్తున్నట్టే. ప్రకృతిలోని ప్రతిదీ సాపేక్ష చలనంలో ఉంటుందనేది మార్క్సిస్టుల ప్రాథమిక అవగాహన. ఒక వస్తువు చలనంలో ఉండటం అంటే పరిణామశీలంగా ఉండటమూ.. ఘర్షణాత్మకంగా ఉండటమూ. ఇవి రెండూ వేర్వేరు కాదు. అలాగే, వేర్వేరుగా చోటుచేసుకోవడం లేదు. విరుద్ధ అంశాల మధ్య ఘర్షణ పరిణామానికి దారితీస్తే ఆ పరిణామం వస్తు చలనం రూపంలో దర్శనమిస్తున్నది. చలనానికి కారణమవుతున్న ఘర్షణాత్మక క్రమాన్నే స్థితి అంటున్నాం. ఉదాహరణకు ఒక స్త్రీ తల్లిగా మారడం అనేది ఆమె జీవితంలో ఒక ముఖ్యమైన పరిణామం. పురిటినొప్పులు అనే ఘర్షణాత్మక క్రమం ద్వారానే ఇది పూర్తి అవుతుంది. ఇందులో ఏది ముందు.. ఏది వెనక అనేది చెప్పడం కష్టం. అలాగే ఇది పరిణామం, ఇది స్థితి అని వేరు చేసి చూడలేం. కాకపోతే.. మన సౌలభ్యం కోసం పరిణామాన్ని చారిత్రక భౌతికవాద పద్ధతుల్లో, స్థితిని గతితార్కిక భౌతికవాద పద్ధతుల్లో పరిశీలిస్తాం.

ఉదాహరణకు, దండకారణ్యాన్నే తీసుకుందాం. రమారమీ మూడు దశాబ్దాల క్రితం దండకారణ్య పోరాట వస్తువు కవిత్వంలోకి ప్రవేశించింది. మరి అప్పటికీ ఇప్పటికీ దండకారణ్య పోరాటం, ఆ పోరాట వస్తువు ఎంతగా మారాయి! ఇదంతా ఒక్కరోజులో జరిగిందా? ఈ ముప్పై ఏళ్లలో.. ఆటుపోట్లు, సంక్షోభాలు, సంఘర్షణల మధ్య నుంచి దండకారణ్యం ఎంత ఎదిగిందో.. అంటే పరిణామం చెందిందో చూస్తూనే ఉన్నాం.

గోండ్వానా నుంచి గోల్వారావరకు / ఎదిగిన అడవి గురించి / ఎవడికీ రాయక తప్పడం లేదిప్పుడు / ఇప్పవనాల గాలిప్పుడు / తుపాకీమందు వాసనేస్తోంది (ఇప్పవనాల గాలి, 1984).. ముప్ఫయేళ్లపైబడిన ప్రయాణంలో ఈ గాలి అడవంతా అల్లుకుపోయింది. జంగ్లోతోల్లను ఎదిరించి ఆదివాసీలకు అండగా నిలిచింది. పై పాదాల్లో కవి పదబంధం చేసినట్టు.. ఇప్పపూల రేటు సమస్యపై వారిని సంఘటితం చేసి పోరాటానికి నడిపించింది. ఒక చేతికి ఆయుధాన్ని, మరోచేతికి నిర్మాణ పనిముట్లని అందించింది. అడవి-ఆదివాసి-పార్టీ అనే గతితార్కిక బంధం ఇన్నేళ్లలో ఎంత గాఢతరమయిందంటే..

ఒక ఆదివాసీ ఆడామె ముందు నాగలి దున్నుతోంటే / వెనక మగడు విత్తనాలు వేసే తొలకరి ఇది / ఆదివాసీ అస్తిత్వ చిత్రకారుల కుంచెకు ఎన్నడూ కలగని ఊహ ఇది (సగానికిపైగా పైగా, 2012). ఇన్నేళ్ల పరిణామాన్ని రెండు దశలుగా చెప్పుకోవచ్చునేమో! అడవిలో ఆదివాసీ బతుకును జంగ్లోతోళ్లు బుగ్గి చేయడం మొదలు నేరుగా భారత సైన్యాలే ఈనాడు దాడిచేసి అటవీకి, ఆదివాసీకి అగ్గి పెట్టేదాకా.. నిర్బంధ రూపం అత్యున్నతదశకు చేరుకుంది. అదేసమయంలో నాడు జంగ్లోతోళ్లను ఎదుర్కొనేందుకు ఒక్కటయిన ఆదివాసీల సంఘటిత శక్తి.. ఈనాడు జనతనసర్కారు రూపంలో అత్యున్నత దశకు.. అంటే గుణాత్మక దశకు.. అంటే గెంతుకు.. చేరుకోవడం గమనిస్తున్నాం. ఈ గెంతు దశకు చేరుకోవడానికి ఉద్యమం ఎంత కన్నీటిని, నెత్తుటిని మోసింది! ఎన్ని రకాల పోరాట ఎత్తుగడలను రచించింది? వాటిలో ఎన్ని అభావం చెంది.. అంటే రూపాంతం చెందుతూ, ధ్వంసం అవుతూ, కలుపుకుంటూ.. ఎలా మెరుగైన ఎత్తుగడలను అందించాయి? ఈ అంతర్గత సంఘర్షణ, పెనుగులాట క్రమంలోనే నక్సల్బరీ సంతాల్, శ్రీకాకుళం ఆదివాసీ, ఆదిలాబాద్- కరీంనగర్ గోండు.. పై పాదాల్లో చెప్పినట్టు.. శ్రమ సంబంధాల్లోని లింగ వివక్షను, పురుషాధిపత్యాన్ని రద్దు చేయడానికి సశాస్త్రీయ ఆయుధ సంధానం చేసిన దండకారణ్య మావోయిస్టుగా రూపాంతరం చెందాడు. చరిత్ర తప్ప మరే ఆసరా లేని స్థితిలో అవకాశవాద, దివాళాకోరు రివిజనిస్టు పంథాలతో తలపడి నిలబడ్డాడు నక్సల్బరీ సంతాల్. ఉద్యమాన్ని నడిపించే నాయకులను తమలోంచే తయారుచేసుకున్నాడు శ్రీకాకుళం ఆదివాసీ. ఉద్యమ గమనానికి అడ్డంకి అనుకున్నప్పుడు ఆ నాయకత్వాన్ని కూడా తీసి పక్కనబెట్టడానికి వెనకాడలేదు కరీంనగర్ - ఆదిలాబాద్ గోండు. శిశువుకి ప్రాణం పోవడానికి తల్లి దాదాపు మరణం అంచులను తాకుతుంది. అలాగే ఉద్యమం కూడా. తన గమనానికి ప్రతిబంధకం అనుకున్న అడుగుని, భావాన్ని, ఎత్తుగడని, నాయకత్వాన్ని తొలగించుకుంటూ.. అంతకన్నా మెరుగైన అడుగుని, భావాన్ని, ఎత్తుగడని, నాయకత్వాన్ని సంతరించుకుంటుంది. ఈ గతితార్కిక పరిణామ క్రమాన్ని ఈ కవితా పాదాల్లో పరిశీలించవచ్చు.

ఎవరి గురించైనా బాధపడేందుకు / కత్తికోతల నడుమ / రక్తం తుడుచుకుంటూ.. / నెత్తీనోరూ కొట్టుకోవడాన్కి / సమయమా ఇది/ బరువు తగ్గిస్తుందేడుపు/ కానీ బాధ్యత మిగిలే ఉంటుంది.. అని ఊరుకోదు కవి (ఇప్పవనాల గాలి, యుద్ధంలో మనస్తత్వం, 1984-86). వెన్నెల ఇక్కడ దారిచూపటాన్కి తప్ప / మరెందుకూ పనికిరావడం లేదు (ఇప్పవనాల గాలి, పహరా హుషార్).. నిత్య నిర్బంధంలో ఉద్యమాన్ని నిర్మిస్తున్న విప్లవకారుడు.. కవి కూడా అయినప్పుడు ఏ చెట్టుకో వెన్ను వాల్చి కాస్త విశ్రాంతి తీసుకోవడం కాదు, కాస్తంత రాసుకొందామన్నా అతడికి/ ఆమెకి వీలు కాని తీరికలేనితనాన్ని అద్భుతంగా వ్యక్తీకరించే పాదాలివి.

విరసం పరిణామం

ఇదే పద్ధతుల్లో విరసం పరిణామాన్ని.. అంటే చరిత్రని పరిశీలించవచ్చు. బెంగాల్‌లోని సరోజ్ దత్తా, అగ్రహ కవులు; శ్రీకాకుళంలోని సుబ్బారావు పాణిగ్రాహి, వెంపటపు సత్యం, తెలంగాణలో శివసాగర్‌ల విప్లవ సాహిత్య ఆచరణ.. విప్లవ సాహిత్యోద్యమానికి బాటవేసింది. దిగంబర కవులు, తిరగబడు కవులు, పైగంబర కవులు, అరసం నుంచి చీలిన అభ్యుదయ మేధావులు వేర్వేరు స్థాయిల్లో ఈ బాటను విశాలం చేశారు. తెలుగు సాహిత్యంపై ఎర్రజెండాని ఎగరవేశారు. విప్లవోద్యమంలోని ఆర్గనిక్ ఇంటిలెక్చువల్స్.. అంటే వీరు వస్తుగత: ఫలానా రంగానికి చెందినవారు అని చెప్పలేం. ఉద్యమ అవసరాల కోసం ఆ రంగాన్ని గురించి అధ్యయనం చేసి, కొన్ని విలువైన ప్రతిపాదనలను, నిర్దేశాలను అందిస్తారు. వీరినే నిర్మాణాత్మక మేధావులు అంటున్నాం. వీరు విప్లవ ఆచరణ క్రమంలో రూపొందుతారు. వీరి మార్గదర్శకం, రాడికల్ విద్యార్థుల చొరవతో ఈ క్రమమంతా ఒక నిర్మాణరూపం సంతరించుకుంది. దాన్నే మనం విప్లవ రచయితల సంఘంగా చెప్పుకుంటున్నాం. పైకి విప్లవ సాహిత్యోద్యమం అరసం నుంచి విరసంగా రూపాంతరం చెందినట్టు అనిపిస్తుందిగానీ.. మన సంఘం మూలాలు కృచ్చేవ్ రివిజనిస్టు రాజకీయాలను బద్దలుకొట్టిన గ్రేట్ డిబెట్‌లో, చైనా సాంస్కృతిక విప్లవంలో ఉన్నాయి. 'ఇది విప్లవాల యుగం' అంటూ నడిచిన శక్తుల్లో ఉన్నాయి. ఆ శక్తులను స్వాగతించిన పల్లెలు, గూడేల్లో ఉన్నాయి. వర్గ పోరాటాన్ని తప్పనిసరి చేసిన చారిత్రక గతిలో ఉన్నాయి. అందువల్లనే 'విరసం' కేవలం సంస్థ కాదు, మిగతా సాహిత్య సంఘాల్లాంటి నిర్మాణం మాత్రమే కాదు. అదొక చారిత్రక ఆవశ్యక పరిణామం. సాహిత్య ఉద్యమ చరిత్రలోనే పెను దృశ్యం.

కరదీపిక కవిత్వం

అది ఎలాంటి దృశ్యమో.. పాఠం ప్రారంభంలో ఉటంకించిన పాదాలను చూస్తే తెలుస్తుంది. కష్టజీవికి ఇరువైపులా నిలిచేదే కాదు / కష్టజీవి మార్గంలో కరదీపికైన కవిత్వం. కష్టజీవి బాధలను, గాథలను కవితా వస్తువుని చేసుకొని కవులు తొలిదశలో సాహిత్య రచన చేశారు. వీరిలో సామాజిక స్పృహ మెండుగా ఉంది. వీరిని నడిపించినవాడు శ్రీశ్రీ. అప్పుడు ఆయన మదిలో రష్యా శ్రామికుడి విప్లవ విజయాలు

సుడులు రేపుతున్నాయి. ప్రపంచ సోషలిస్టు ఉద్యమ చరిత్ర కుదిపేస్తూ ఉంది. 1930 ఆర్థిక సంక్షోభం ఈ మధ్య తరగతి యువకుడిలోని సంప్రదాయ, భ్రమాజనిత ఆలోచనలను పూర్తిగా తుడిచిపెట్టేసింది. ఈ చారిత్రక నేపథ్యం నుంచి.. కష్టజీవికి ఇరువైపులా/ నిలిచేవాడే కవి అని శ్రీశ్రీ సూత్రీకరించాడు. అనంతర కాలంలో తెలుగు నేలపై, ఇక్కడి భౌతిక వాస్తవికతలోంచి.. ఆ కష్టజీవి.. ఆ రష్యా శ్రామికుడు.. భూమి లేని నిరుపేద, కూలీ రైతుగా తెలంగాణలో అవతరించాడు. అప్పుడు మన కవి ఏమన్నాడు! గుత్పా పట్టిన రైతన్నకు, విల్లుని సారించిన సంతాల్‌కు, ఎర్రజెండా పట్టిన ఆదివాసీకి, ప్రతిఘటనను రచించిన గోండుకు అండగా మన కవి ఏమన్నాడు? సామాజిక స్పృహ నుంచి సామాజిక చైతన్యం దిశగా అడుగులు వేస్తున్న మన కవి ఏమన్నాడు?

ఒరే నాయనా! నా కాగితాల మీదుగా నడిచిపోరా / నీ పాదముద్రల్ని నా గీతాలుగా మార్చుకుంటా/ గుండెల నిండా శ్రీకాకుళాలు నినదించిన / గీత చరణాలే నీ చరణాలు / నన్ను సముద్రం చేసి/ భూమిని చేసి / నన్ను అడవిని చేసి / వెళ్లిపోయిన వాడా! నువ్వు నా అక్షరానివి (నేత్ర ధనస్సు, నా అక్షరం, 1976). తిరిగి తిరిగొచ్చింది నక్సల్బరీ అన్నట్టు.. నాయకత్వం వెన్నుపోటుకు గురయిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం.. బెంగాల్, శ్రీకాకుళం మీదుగా తిరిగి తన మాతృగర్భాన్ని చేరుకుంది. ఈ సన్నివేశానికి కవి పారవశ్యమే ఈ కవిత. ఈ సంచలన సందర్భం.. అక్కడే కవిని వదిలేయలేదు. పారవశ్యమే పరమావధి కాదంటూ మేల్కొలిపింది. సాయుధుడివి కమ్మని ఆదేశించింది. సాయుధుడికి అటూఇటూ నిలబడమని నిర్దేశించింది. మన కవి ఏమన్నాడు!

ప్రజను సాయుధం చేస్తున్న రివల్యూషనరీ నేడు కవి (ఉద్యమం నెలబాలుడు, మైక్రోస్కోపిక్, 1970) ఇలా నలభై ఏళ్లకు పైగా.. సామాజిక ఉద్యమ పరిణామాలను ఒరుచుకుంటూ సాగిన విప్లవ కవితా వస్తు పరిణామంతా. కష్టజీవి మార్గంలో కరదీపికైన కవిత్వం అంటూ కవి సూత్రీకరిస్తున్నాడు. ఈ పాదంలో కరదీపిక అనేది సిద్ధాంత వెలుగులకు ప్రతీక. పరాయీకరణకు గురయిన కష్టజీవి తననుతాను విముక్తం చేసుకోవడానికి విప్లవ సిద్ధాంతం అనే కాగడాను చేపడతాడు. కష్టజీవి పోరాటం సహా ఈ విప్లవ సిద్ధాంతాన్ని స్వాగతించే క్రమంలో తాను ప్రేరణలకు గురవుతూ.. ఎంతోమందికి ప్రేరణాత్మక శక్తిగా, అంటే కరదీపికగా కవిత్వం రూపాంతరం చెందుతూ ఉంటుంది. ఇదే విప్లవ కవిత సారం! ఇలా విప్లవ కవిత్వం.. కష్టజీవి మార్గానికి కరదీపిక అవుతుందని.. అవ్వాలని కోరుకుంటూ ముగిస్తున్నాను.

(గుంటూరు జిల్లా మంగళగిరిలో 2014, నవంబర్ 1,2 తేదీల్లో జరిగిన విప్లవ రచయితల సంఘం కవిత్వ వర్క్‌షాపు ప్రసంగ పాఠం)

(అయిపోయింది)

లేఖలు :

అరుణతార, అక్టోబర్ 2014 సంచికలో షహీదా రాసిన 'విప్లవ రచయిత్రి గజ్జెల సరోజ జీవితం - సాహిత్యం' చాలా అవసరమైన, చాలా గొప్ప వ్యాసం. శ్యాం, సరోజ వంటి అమరయోధుల జ్ఞాపకాల్ని తడిమి కంట నీరు పెట్టించింది. అయితే, ఒక చిన్న సవరణ. వ్యాసం చివరలో, 'పోదాం కలిసే పోరాటానికి వస్తావా నువ్ నావెంటా' అనే పాట సరోజది అన్నట్టుగా రాసారు. మొత్తం పాట ఇవ్వలేదు గనుక తను ప్రస్తావించిన పాట సరోజది కావచ్చునేమో గాని, ఆ పల్లవి తోనే సుప్రసిద్ధమైన పాట రాసినది ఎన్ కె. సృజన జనవరి 1975 సంచికలో శివసాగర్ 'ఆకాసంలో సగం' అచ్చయింది. ఆ కవిత ప్రేరణతో ఎన్ కె రాసిన ఈ పాట సృజన ఫిబ్రవరి 1975 సంచికలో అచ్చయింది. ఎమర్జెన్సీ ముందూ, ఎమర్జెన్సీ తర్వాత కొంత కాలం వరకూ వేదికల మీద ఎన్.కె. ఆ పాట పాడుతుండేవాడు.

- ఉత్తర కుమార్, చెన్నై

* * *

అరుణతార ఆగస్టు-సెప్టెంబరు 2014 సంచికలో పైడి తెరేష్‌బాబు సంస్మరణలో రాసిన 'ద్వారాలు తెరిచి ఉంచుకున్న కవి' అనే వ్యాసం వచ్చింది. అయితే తెరేష్‌బాబు మొదటి నుండి మార్క్సిస్ట్ ఐడియాలజీపై, నక్సలైట్ ఉద్యమంపై 'ద్వారాలు మూసి ఉంచిన కవి'గానే నేను ఇప్పటికీ భావిస్తున్నాను. అలాకాకపోతే ఆయన పై వాటిని కవిత్వం ద్వారా ఏ సందర్భంలోనైనా తన గుండె గదుల్లోకి ఆహ్వానం పలికాడా? ఇంకా అదే వ్యాసంలో 'ఎలాంటి పరిమితులు లేని కవి' అన్నారు. నిజంగా ఆయనకు ఎలాంటి పరిమితులు లేవంటారా? ఒకవేళ అలా అనుకుంటే భారతదేశంలో జరుగుతున్న దండకారణ్య ఉద్యమ లోతుల్ని, దానికున్న పరిమితుల్ని సరైన తీరులో అధ్యయనం చేసి ఉండేవాడే కదా! ఇంకా' అన్ని ఉద్యమ తీరుతెన్నులను తడి నయనాలతో దర్శించాడు' అన్నారు. దండకారణ్యంలో జరిగేది ఉద్యమం కాదా! ఆ ఉద్యమంలో ముందుండి నడుస్తూ, నడిపిస్తున్న దళిత, ఆదివాసీ, మహిళల నెత్తుటి తడి ఆయన నయనాలకు కనబడలేదా?

అయితే ఒక్కటి మాత్రం నిజం. ఆయన కవిత్వంలో కొత్త వ్యక్తీకరణలు చేశారు. పైడి తెరేష్‌బాబు కవిత్వం చదువుతున్న ప్రతిసారీ నా పునాదుల్ని గుర్తు చేసి, బాధ్యత మర్చిపోవద్దని హెచ్చరిస్తున్నట్టుంటుంది. ఆయన కవిత్వం ఎక్కడ కనబడ్డా గుండెల్లో హత్తుకోవాలనిపిస్తుంది.

- మేడక యుగంధరరావు

-: స్వీకారం :-




హింసపాదు

బమ్మిడి జగదీశ్వరరావు

ప్రచురణ : సిక్కోలు బుక్ ట్రస్ట్

వెల : రు. 180/-

పేజీలు : 286



హంసలను వేటాడొద్దు


బోరిస్ వాసిల్యెవ్

అనువాదం : కె. సురేష్

ప్రచురణ : కావ్య పబ్లిషింగ్ హౌస్

వెల : రు. 150/-

పేజీలు : 205




వేగావతి కథలు

సంపాదకత్వం : శ్రీకాకుళ సాహితి

ప్రచురణ : శ్రీకాకుళ సాహితి

వెల : రు. 150/-

పేజీలు : 288



పునరాగమనం


నవల

ఎ.వి. రెడ్డిశాస్త్రి

ప్రచురణ : శ్రీకాకుళ సాహితి

వెల : రు. 100/-

పేజీలు : 184




తుడుం

సంపాదకత్వం : శ్రీకాకుళ సాహితి

ప్రచురణ : శ్రీకాకుళ సాహితి

వెల : రు. 60/-

పేజీలు : 112



జముకు


తొమ్మిది బులెటిన్ల సంకలనం

సంపాదకత్వం : శ్రీకాకుళ సాహితి

ప్రచురణ : శ్రీకాకుళ సాహితి

వెల : రు. 100/-

పేజీలు : 208



శ్రీకాకుళ సాహితి

27 ఏళ్ళ సందర్భ జ్ఞాపిక

సంపాదకత్వం : శ్రీకాకుళ సాహితి

ప్రచురణ : శ్రీకాకుళ సాహితి

పేజీలు : 48



దింపుడు ఖలము


(దీర్ఘ కవిత)

సంపాదకత్వం : బరకు

ప్రచురణ : నాగం కవిత, ఏలూరు

వెల : 25/-

పేజీలు : 32



తెలంగాణ జైత్రయాత్ర

ఘంటాపథం

ఘంటా చక్రపాణి

ప్రచురణ : మలుపు

వెల : రు. 200/-

పేజీలు : 328

ARUNATARA A Literary and Cultural Telugu Monthly Journal of Revolutionary Writers' Association (VIRASAM)
• RNI Regn.No.21152/72 • Published on 13/12/2014 309 - December, 2014



Edited, printed, published and owned by Chalasani Prasad, H.No. 33-13-3, Seetharampuram, Vijayawada - 520 002
Printed at Nagendra Printing Press, Vijayawada - 520 002.
Editor : Chalasani Prasad

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M173
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	45
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Bhanu
పేజీలు విడదీసినది	Bhanu
స్కాన్ చేసినది	Apsa
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good